PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 1 | విజయవాడ, శుక్రవారం 1 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 1 August 2025 | Rs

థియరీ దశలోనే క్వాంటం కంప్యూటర్స్

- ఢిల్లీ సైన్స్ ఫోరం వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్థ


2



కష్టాల్లో భారత్

8

- తొలిరోజు ఆట ముగిసే సరికి 204/6 • ఇంగ్లండ్‌తో ఐదో టెస్ట్



మరో ట్రూఅప్ బాదుడు

రూ.12,771 కోట్ల వడ్డనకు ప్రతిపాదన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై మరో బాదుడు సిద్ధమైంది. ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎల పేరుతో ఇప్పటికే భారాలపై భారాలు మోపుతున్న డిస్కంలు మరో ట్రూఅప్‌ను సిద్ధం చేశాయి. (2019-2024) 4వ నియంత్రణ కాలంలో రూ.12,771 ఆదాయ లోటు వచ్చిందని, దీనిని భర్తీ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఇఆర్‌సి)కి ప్రతిపాదించాయి. ఈ ప్రతిపాదనలపై అభ్యంతరాలు కోరుతూ ఎపిఇఆర్‌సి గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎపిఇఆర్‌సి దగ్గర 2024-25కు చెందిన సర్దుబాటు చార్జీల భారం పెండింగ్‌లో ఉంది. దీని విచారణ పూర్తికాకుండానే తాజాగా 4వ నియంత్రణ కాలం(2019-20, 2023-24)లో లోటు అంటూ పెద్ద మొత్తంలో రూ.12,771 కోట్లను మూడు డిస్కంలు ప్రతిపాదించాయి. ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటేడ్(ఎపిఎస్‌పిడిసిఎల్) రూ.3,046కోట్లు, ఆంధ్రప్రదేశ్ ఈస్టరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటేడ్(ఎపిఇపిడిసిఎల్) రూ.7790 కోట్లు, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటేడ్(ఎపిసిపిడిసిఎల్) రూ.1,935కోట్లు చొప్పున వినియోగదారుల నుంచి వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని అభ్యర్థించాయి. డిస్కంల ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే ఈ నెల 14వ తేది లోపు చెప్పాలని ఇఆర్‌సి కార్యదర్శి పి కృష్ణ నోటిఫికేషన్‌లో తెలిపారు. వచ్చిన అభ్యంతరాలు, సలహాలపై ఈ నెల 29వ తేదీలోపు డిస్కంలు వివరణలు ఇవ్వాలని వెల్లడించారు. ఇప్పటికే వినియోగదారుల నుంచి మూడు సంవత్సరాల ఎఫ్‌పిపిసిఎ(సర్దుబాటు) చార్జీలను డిస్కంలు వసూలు చేస్తున్నాయి. ఇది కాకుండా నెల నెల సర్దుబాటు పేరుతో యూనిట్‌కు 40పైసలు వసూలు చేస్తున్నాయి.. వడ్డీ, చక్రవడ్డీ లెక్కలు కట్టి వసూలు చేసినట్లు ప్రతి నెల, ప్రతి ఏటా సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై డిస్కంలు భారాలపై భారాలు మోపుతున్నాయి. అది సరిపోదు అనట్లుగా ఇప్పుడు నాలుగేళ్ల కాలానికి సంబంధించిన ట్రూఅప్ చార్జీలను కూడా వసూలు చేసేందుకు సిద్ధమయ్యాయి.

టారిఫ్‌లపై అమెరికా ఒత్తిడిని ప్రతిఘటించండి


- సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : భారత ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరిస్తూ చేసిన ప్రకటనను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. రష్యాతో సంబంధాలను భారత్ తగ్గించుకోవాలని, ఆ దేశం నుండి చమురు కొనుగోలును ఆపేయాలని కూడా ట్రంప్ కోరుకుంటున్నారు. అటువంటి చర్యలకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం ధృడంగా నిలబడాలని, భారతీయుల ప్రయోజనాలను పరిరక్షించాలని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.వ్యవసాయం, డెయిరీ, ఫార్మాస్యూటికల్ సహా ఇతర రంగాల్లో అమెరికా కార్పొరేషన్ల దోపిడీకి ద్వారాలు తెరవాలని లేకపోతే టారిఫ్‌లు విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు పదేపదే బెదిరిస్తున్నారు. అమెరికా ప్రభుత్వాన్ని బుజ్జగించేందుకు గానూ భారత ప్రభుత్వం ఇప్పటికే అమెరికాతో రక్షణ, చమురు ఒప్పందాలను కుదుర్చుకుంది. వందల కోట్ల డాలర్లు విలువ చేసే ఆయుధాలు, చమురు కొనుగోలు చేసేందుకు అంగీకరించింది. ఇప్పుడు ఇంకా మరిన్ని రాయితీలు కావాలని అమెరికా డిమాండ్ చేస్తోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. అమెరికా తీసుకువస్తున్న ఈ ఒత్తిడికి లొంగిపోరాదని లేదా అమెరికా దోపిడీకి వెసులుబాటు కలిగించేలా భారత ఆర్థిక వ్యవస్థను, మార్కెట్లను ద్వారాలు తెరిచేందుకు అనుమతించరాదని భారత ప్రభుత్వాన్ని సిపిఎం కోరింది. ఇలాద్వారాలు తెరవడంవల్ల భారత పరిశ్రమలు, వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేసింది. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం తమ సార్వభౌమాధికారాన్ని స్పష్టం చేస్తుందని, అమెరికా బెదిరింపు ఎత్తుగడలకు వ్యతిరేకంగా ధృఢ వైఖరి ప్రదర్శిస్తుందని భారత ప్రజలు ఆశిస్తున్నారని పొలిట్‌బ్యూరో ప్రకటన పేర్కొంది.

'అన్నదాతా.. సుఖీభవ' రేపే

- ప్రకాశం జిల్లా వీరాయపాలెంలో ప్రారంభం
- పండుగ వాతావరణంలో నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం
- బొప్పాయి ధరలను సమీక్షించాలని ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన అన్నదాతా ..సుఖీభవ పథకం రేపు (ఆగస్టు 2,శనివారం) అమలులోకి రానుంది. పండగ వాతావరణంలో ఈ పథకాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెంలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.రైతులకు హామీ ఇచ్చినట్లుగానే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయం నుంచి మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల వరకు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు.

ఆగస్టు ఒకటవ తేదే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నుంచి రైతుల ఫోన్‌లకు సందేశాలు వెళ్లాలని, రైతులు వారి బ్యాంక్ ఖాతాలను యాక్టివేట్ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838 మంది రైతులు లబ్ధిపొందుతారని, మొదటి విడతలో రాష్ట్ర వాటా ఒక్కొక్కరికీ రూ.5వేలు కేంద్రం వాటా 2 వేలు చొప్పున మొత్తం ఏడు వేల రూపాయలు జమ అవుతాయని అన్నారు. రెండవ విడతలో 7 వేలు, మూడవ విడతలో ఆరు వేల రూపాయలు జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు నిధులే కాదు, నీళ్లు ఇస్తున్నామని చెప్పారు. బొప్పాయి ధర తగ్గిందని కథనాలు వస్తున్నాయని, వాటిపైన సమీక్ష చేసి రైతులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎరువుల విషయంలో కలెక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలని, ఎక్కడా కొరత లేకుండా చూడాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోందని, గండికోట, బ్రహ్మం సాగర్, సోమశిల, కండలేరు ప్రాజెక్టులను వంద శాతం నీటితో నింపాలన్నారు. రిజర్వాయర్లలో ఎంత నీరు ఉందనే సమాచారం ఉండాలని, నీటి నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. దేశంపై అమెరికా 25 శాతం సుంకాలు విధించిందని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్ని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొనాలని సూచించారు. ఇప్పటి వరకూ రైతులకు ప్రభుత్వం అందించిన సాయం, ఇతర వివరాలతో కరపత్రాలు రూపొందించి క్షేత్ర స్థాయిలో పంపిణీ చేయాలని కలెక్టర్లకు సూచించారు. అన్నదాత సుఖీభవ పథకంలో 59,750 గ్రీవెన్స్ నమోదవగా, వీటిలో 58,464 గ్రీవెన్స్‌ను పరిష్కరించినట్లు చెప్పారు. సందేహాల నివృత్తి కోసం 155251 టోల్ ఫ్రీ నంబరు అందుబాటులో ఉంచామని ముఖ్యమంత్రికి అధికారులు వివరిచారు.

నోరు మెదపరేం?



పార్లమెంట్ ఆవరణలో ఇండియా ఫోరం ఆందోళన

- అమెరికా సుంకాలపై దద్దరిల్లిన ఉభయసభలు
- అనైతిక ఓటర్ల సవరణలపైనా ఆగ్రహజ్వాల
- ప్రధాని మోడీ సమాధానం కోసం పట్టు
- ఇండియా బ్లాక్ నిరసన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ సుంకాల బాదుడు, ఆంక్షల మోతలకు, బీహార్‌లో అప్రజాస్వామికంగా కొనసాగిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు వ్యతిరేకంగా పార్లమెంటు ఉభయసభల్లోనూ, వెలుపల ప్రతిపక్షాల సభ్యులు ఆందోళన చేపట్టారు. సుంకాల పెంపు, ఎస్ఐఆర్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమాధానం చెపాలిందేనంటూ పట్టుబట్టారు. దీంతో ఉభయ సభల్లోనూ వాయిదాల పర్వం కొనసాగింది. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ పార్లమెంట్‌లో ట్రంప్ సుంకాలపై ప్రకటన చేశారు. దీనిపై అధ్యయనం చేస్తున్నామన్నారు. అయితే మంత్రి స్పందన పట్ల ప్రతిపక్షాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మోడీకి అత్యంత సన్నిహితుడిగా బిజెపి నేతలు గొప్పలు చెప్పుకునే ట్రంప్ పదేపదే భారత్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నా..ఆయన గారి 'ఆప్త మిత్రుడు' (మోడీ) నోరు మెదపరేం? అంటూ నిలదీశారు. లోక్‌సభలో గురువారం స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించగా.. ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు చేబూని వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. బీహార్ ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని నినాదాలు హోరెత్తించారు.

దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన ఆరు నిమిషాల్లోనే మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో అదే పరిస్థితి కొనసాగడంతో సభ మళ్లీ సాయంత్రం 4 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యనే అమెరికా సుంకాలపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ ప్రకటన చేశారు. అనంతరం తొమ్మిది నిమిషాల్లోనే సభ శుక్రవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ వాయిదాల పర్వం కొనసాగింది. రాజ్యసభలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ జీరో అవర్‌ను కొనసాగించేందుకు ప్రయత్నించగా ప్రతిపక్షాల నేతలు ఆందోళన చేపట్టారు. సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ఇదే పరిస్థితి కొనసాగితే నిమిషాల్లోనే సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తిరిగి సభ మిగతా 7లో

టారిఫ్‌లు నేటి నుంచే అమలు

- రాష్ట్రంలోని ఆక్వా రైతులపై ప్రభావం

5

జగన్ పర్యటనలో ఉద్రిక్తత

- బారికేడ్లు, ముళ్లకంచెలు, రహదారులపై గోతులు
- నగరాన్ని దిగ్బంధించిన పోలీసులు
- ఆంక్షలు పెట్టినా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- పోలీసుల లాఠీఛార్జ్



కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన ఉద్రికత్తల నడుమ సాగింది. ఆంక్షల వలయంలో నగరాన్ని దిగ్బంధించారు. అడుగడుగునా బారికేడ్లు, ముళ్లకంచెలు ఏర్పాటు చేశారు. మెయిన్‌రోడ్డులోకి ప్రజలు ఎవ్వరూ రాకుండా కొత్తూరు, అయ్యప్పగుడి, ఆస్పత్రి రోడ్డు, వేదాయపాళెం, పొదలకూరు రోడ్డులో ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు. కోవూరు టౌన్‌లోకి ఎవ్వరూ ప్రవేశించకుండా మట్టిరోడ్డును జెసిబితో గుంతలు తవ్వారు. ఉదయం నుంచి నగరంలోనికి ఎవరినీ రానివ్వలేదు. అయినా జగన్ నగరానికి చేరుకున్న కొద్దిసేపటికే అభిమానులు, కార్యకర్తలు ఒక్కసారిగా ఆటోలు, వాహనాల మీదుగా పెద్దఎత్తున్న నగరం లోకి తరలివచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బారికేడ్లను తోసుకుంటూ వైసిపి అభిమానులు, కార్యకర్తలు ముందుకు వెళ్లడంతో ఒక్కసారిగా తోపులాట చోటు చేసుకుంది. పోలీసులపై కార్యకర్తలు పడిపోవడంతో ఓ కానిస్టేబుల్‌కు చెయ్యి విరిగింది. దీంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. విషయం తెలుసుకున్న ప్రసన్నకుమార్‌రెడ్డి అక్కడి చేరుకుని మిగతా 7లో



నల్లపరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

సిఐడి మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్ రద్దు

- లొంగిపోవడానికి మూడు వారాల సమయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ సిఐడి మాజీ చీఫ్ సంజయ్‌కి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి కేసులో సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అయితే ఈ కేసులో సంజయ్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఈ హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. గురువారం ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టి ధర్మాసనం విచారించింది. ముందస్తు బెయిల్‌ను రద్దు చేసింది. సంజయ్‌కు కోర్టు ముందు లొంగిపోవడానికి మూడు వారాల సమయం ఇచ్చింది. సంజయ్ కస్టడీ కోసం మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని తెలిపింది. అదేవిధంగా బెయిల్ కోరుతూ నిందితుడు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది.

మాలేగావ్ పేలుళ్ల కేసులో అందరినీ వదిలేశారు !

- సాక్ష్యాల సేకరణలో ప్రాసిక్యూషన్ ఘోర వైఫల్యం
- ప్రజ్ఞా ఠాకూర్ సహా నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించిన ఎన్ఐఎ కోర్టు



ప్రజ్ఞా ఠాకూర్ | ప్రసాద్ పురోహిత్

ముంబయి : మహారాష్ట్రలోని మాలేగావ్‌లో 2008 సెప్టెంబరు 29న చోటుచేసుకున్న బాంబుపేలుళ్ల కేసులో నిందితులందరినీ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) ప్రత్యేక న్యాయస్థానం నిర్దోషులుగా ప్రకటిస్తూ గురువారం నాడు తీర్పు వెలువరించింది. దాదాపు17 ఏళ్ల తరువాత ఈ కేసు విచారణ ముగిసింది. బలమైన సాక్ష్యాధారాలు సేకరించడంలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలమైంది. వాస్తవానికి ఈ విచారణలో వేగవంతంగా ముందుకెళ్లరాదని, మెల్లగా కొనసాగించాలని ఎన్ఐఎ తనపై ఒత్తిడి తెచ్చిందంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రోహిణి సాలియా 2015లో రాజీనామా చేశారు. ఇలాంటి నేపథ్యమున్న ఈ కేసులో ఇంతకంటే గొప్పగా తీర్పును ఆశించలేమని పలువురు సామాజిక, రాజకీయ విమర్శలకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'ఉగ్రవాదానికి మతం లేదు. ఎందుకంటే ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదు.

కానీ, కేవలం ఊహాగానాలు, నైతిక ఆధారాలతో ఎవరినీ కోర్టులు శిక్షించవు. 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' మినహా ఈ కేసులో బలమైన సాక్ష్యాధారాలు లేవు' అని తీర్పు వెలువరించే సమయంలో న్యాయమూర్తి చెప్పారు. ఈ కేసులో బిజెపి నేత సాధ్వి ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్, మేజర్ రమేష్ ఉపాధ్యాయ్ (రిటైర్డ్), అజయ్ రాహిర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణిలను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రత్యేక న్యాయమూర్తి మిగతా 7లో

న్యాయాన్ని అపహాస్యం చేయడమే !

- ఎన్ఐఎ కోర్టు తీర్పుపై సిపిఎం

7

నేటి నుంచి 'ఆపరేషన్ ట్రేస్'

- తప్పిపోయిన బాలికల కోసం ప్రత్యేక డ్రైవ్ : డిజిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తప్పిపోయిన బాలికలను గుర్తించి, వారిని కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ప్రత్యేక కార్యక్రమం 'ఆపరేషన్ ట్రేస్' శుక్రవారం నుంచి 31 వరకూ నిర్వహిస్తున్నట్లు డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. బాలికల అపహరణలను పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఆగస్ట్ 1, 2వ తేదీల్లో డేటా కలెక్షన్, 3 నుంచి 10 వరకూ ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలోని షెల్టర్స్‌ను తనిఖీ చేసి, ఎఫ్ఐఆర్ రీ వెరిఫికేషన్ చేస్తామన్నారు. ఆగస్టు 11 నుంచి 30 వరకూ రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లు, ప్రార్ధనా స్థలాలు, రెడ్‌లైట్ ఏరియాలలో ప్రత్యేక తనిఖీలు చేస్తామన్నారు. శక్తియాప్‌లో రిపోర్ట్ మిస్సింగ్ చిల్డ్రన్ ఫీచర్‌తో తప్పిపోయిన పిల్లల కోసం ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. 112, చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి, ఉమెన్ హెల్ప్ లైన్ 181కు, శక్తి వాట్సాప్ నంబరు 79934 85111కు సమాచారం ఇవ్వడంతో సహాయం పొందవచ్చని డిజిపి సూచించారు.

మృత ఆర్థిక వ్యవస్థలు

భారత్, రష్యాలపై నోరు పారేసుకున్న ట్రంప్



వాషింగ్టన్ : భారత్, రష్యా ఆర్థిక వ్యవస్థలు మృత ఆర్థిక వ్యవస్థలని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన సొంత సామాజిక మాధ్యమ సంస్థ అయిన 'ట్రూత్' వేదికగా ఈ మేరకు ఒక ప్రకటన పోస్టు చేశారు. 'రష్యాతో భారత్ ఏం చేసినా మాకు అనవసరం. ఆ రెండు దేశాలు కలిసి వాటి మృత ఆర్థిక వ్యవస్థలను ముందుకు తీసుకెళ్ళగలవు. అంతే' అని ఆయన పేర్కొన్నారు. 'భారత్‌తో మా వ్యాణిజ్యం చాలా తక్కువ. అయినా వారి టారిఫ్‌లు చాలా ఎక్కువ. ప్రపంచంలోనే అత్యధికం' అని ట్రంప్ తెలిపారు. తన మాటలను పట్టించుకోవాలంటూ రష్యా మాజీ అధ్యక్షులు దిమిత్రి మెద్వదెవ్‌ను కూడా ఆయన హెచ్చరించారు. మెద్వదెవ్ చాలా ప్రమాదకరమైన ప్రాంతంలోకి ప్రవేశిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. గత జులై 28న మెద్వెదెవ్ పెట్టిన పోస్టుకు వ్యంగ్యంగా ట్రంప్ ఈ హెచ్చరిక చేశారు. '50 రోజులా లేదా పది రోజులా అంటూ ..ట్రంప్, రష్యాతో ఆటలాడుతున్నారు. ఆయన రెండు విషయాలు గుర్తించుకోవాలి. ఒకటి...రష్యా ఇజ్రాయిల్ కాదు..ఇరాన్ కూడా కాదు. .ప్రతి కొత్త అల్టిమేటమ్ కూడా ఒక బెదిరింపే, యుద్ధం దిశగా ఒక అడుగే, అదీ రష్యా, ఉక్రెయిన్ మధ్య కాదు, ఆయన సొంత దేశంతో, అలాంటి పనికి దిగొద్దు' అంటూ మెద్వెదెవ్ నాటి పోస్టులో ట్రంప్‌ను హెచ్చరించారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. దేశ ఆర్థిక వ్యవస్థ కునారిల్లిపోతున్న సంగతి ప్రపంచమంతటికీ తెలుసు కానీ..బిజెపి నేతలకు ముఖ్యంగా ప్రధాని మోడీకి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు మాత్రం తెలియడం లేదని ప్రతిపక్షాల నేతలు విమర్శలు గుప్పించారు. ఇప్పటికైనా కనువిప్పు కలిగి అదానీ, అంబానీలకు సహజ సంపదను, ప్రభుత్వ రంగాలను దోచిపెట్టే విధానాలకు స్వస్తి పలికి యువతకు ఉపాధి కల్పించడంపైనా, గ్రామీణ ప్రజలను ఆదుకోవడం పైనా దృష్టి సారించాలని హితవు పలికారు.

నీటి పన్ను బకాయిలపై వడ్డీ రూ.85.81 కోట్లు రద్దు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నీటి పన్ను బకాయిలపై వడ్డీ రూ.85.81 కోట్లను ఒకేసారి మాఫీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భూ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఎఫ్ఏసి) జి.జయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024-25 సంవత్సరం వరకూ సాగునీటి పన్నులకు సంబంధించిన బకాయిలపై వడ్డీని రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గిరిజనుల భూసమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వానికి ఆదివాసీ గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజనుల భూసమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్ భార్గవికి ఆ సంఘం నాయకులు గురువారం విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట నుంచి ఏలూరు జిల్లా కెఆర్ పురం ఐటిడిఎ పరిధిలో 1/70 చట్టం ప్రకారం ఆ ప్రాంతంలో ఆదివాసీలకు భూమి, అడవిపై హక్కు ఉందని తెలిపారు. గిరిజనేతర్లు కొందరు అధికారులను లోబర్చుకుని తప్పుడు రికార్డులతో ఆ ప్రాంతంలో భూభాగాన్ని గిరిజనుల నుంచి లాక్కుంటున్నారని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం గిరిజన పక్షాన ఉంటూ... ఆ ప్రాంతంలో నివాసిస్తున్న ఆదివాసులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అటవీ, ఆదాయేతర కారుచౌకగా భూములు అప్పగిస్తోందని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో బుట్టాయిగూడెం జీలుగుమిల్లి పోలవరం మండలాల్లో 55వేల ఆదివాసీ భూములు అన్యాక్రాంతమైనట్లు వివరించారు. పోలవరం నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తమ ప్రాంతంలో ఆదివాసీల సాగు చేస్తున్న భూములను పోలవరం నిర్వాసితులకు కేటాయించడం దుర్మార్గమైన ఆలోచన అని పేర్కొన్నారు. ప్రభుత్వం గిరిజనుల మధ్య గొడవలు తీసుకురావడం తప్ప మరొకటి కాదని, తక్షణమే ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న ఆదివాసీలకు పీసా చట్టం ప్రకారం గ్రామసభ నిర్ణయించి తీర్మానం చేయాలని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం దీనికి విరుద్ధంగా గ్రామసభ నిర్ణయించకుండా, ప్రజాభిప్రాయం సేకరించకుండా, గిరిజనుల సాగులో ఉన్న భూములను గిరిజనేతరులకు పేర్లతో కొనుగోలు చేయడం దుర్మార్గమని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని డైరెక్టర్ భార్గవి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సహాయ కార్యదర్శి ఎ. అశోక్, ఉపాధ్యక్షులు తెల్లం రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ఎ రవి, నాయకులు తెల్లం దుర్గారావు, తామ ముత్యాలమ్మ, వీరయ్య, సూర్యచంద్రం, బోడెమ్మ తదితరులు ఉన్నారు.

థియరీ దశలోనే క్వాంటం కంప్యూటర్స్

- ఢిల్లీ సైన్స్ ఫోరం వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



క్వాంటం టెక్నాలజీపై సదస్సులో మాట్లాడుతున్న ప్రబీర్ పుర్కాయస్థ

క్వాంటం కంప్యూటర్లు ఇంకా థియరీ దశలోనే ఉన్నాయని, ప్రాక్టికల్ దశకు చేరుకోలేదని ఢిల్లీ ఫోరం వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్థ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన గురువారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన క్వాంటం టెక్నాలజీపై సదస్సులో ఆయన మాట్లాడారు. క్వాంటం టెక్నాలజీ ఇనేది ఇంకా పూర్తిగా అందుబాటులోకి రాలేదని, వచ్చే 20 ఏళ్లలో ఏమి జరుగుతుందో చెప్పలేమని అన్నారు. అయితే ఆ పేరుతో వ్యాలీలు ఏర్పాటు వల్ల ప్రజలకు వచ్చే ఉపయోగం ఉండకపోవచ్చని, రియల్ ఎస్టేట్ మాత్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

అదే సమయంలో ప్రస్తుతం ఉన్న కంప్యూటర్లలో వస్తున్న సమస్యలను పరిష్కరించుకుంటూ పోతే మరింత ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. క్వాంటం పేరుతో పెద్దగా ఉపాధి కల్పన సదుపాయాలు ఉంటాయనేది కూడా చెప్పలేమని తెలిపారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారానే అభివృద్ధి సాధ్యమని, అదే సమయంలో అందుబాటులో లేని టెక్నాలజీ గురించి కాకుండా ఉపయోగంలో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసే సమయంలో డాక్టర్ నార్ల తాతారావు మొత్తం యూనిట్ ఒక స్విచ్ ద్వారానే ఆపరేట్ అయ్యేలా చూడాలని ఆదేశించారని, ఆ మేరకు టెక్నాలజీని పరిశీలించి దేశంలోనే మొదటిసారి ఆధునిక పద్ధతుల్లో మూడో దశను ఏర్పాటు చేశామని చెప్పారు. తాను మీడియా రంగంలో ఉన్నానని, ప్రస్తుతం మీడియా కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోయిందని తెలిపారు. వేలమంది రైతులు కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఢిల్లీ వచ్చి ఆందోళన చేస్తుంటే వారి సమస్య ఏమిటో పట్టించుకోకుండా ట్రాఫిక్ ఆగిపోయిందని ప్రచారం చేసే స్థాయిలోకి మీడియా దిగజారిపోయిందని పేర్కొన్నారు. పాలకులు కూడా వారికి ఏమి కావాలో అది రాయించుకునేస్థితిలోకి వెళ్లిపోతున్నారని అన్నారు. జన చైతన్యవేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఎపిలో ప్రతి ముగ్గురిలో ఒకరు నిరక్షరాస్యులని, వారి గురించి పట్టించుకోకుండా అందుబాటులోలేని టెక్నాలజీ గురించి మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. ప్రొఫెసర్ శ్రీపత్ వక్తలను వేదిక మీదకు ఆహ్వానించగా, జెవివి ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, కార్యవర్గ సభ్యులు మురళీధర్ పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన నిపుణులు అడిగిన పలు ప్రశ్నలకు ప్రబీర్ పురకాయస్థ సమాధానాలు ఇచ్చారు.

తక్కువ ధరకే భూములు అప్పగిస్తే తప్పేంటి ?

- ఇటువంటి నిర్ణయాలతోనే అభివృద్ధి
- విలేకరులతో లోకేష్
- సింగపూర్ 45వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుందని వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరిశ్రమలకు,పెట్టుబడీదారులకు అతి తక్కువ ధరకే భూమలు అప్పగిస్తే తప్పేమిటని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రశ్నించారు. సింగపూర్ పర్యటనపై ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విజయవాడ నగరం నడ్డిబొడ్డున లులూ మాల్‌కు రాష్ట్రప్రభుత్వం కేటాయించిన భూములపై వ్యక్తమవుతున్న అభ్యంతరాల గురించి విలేకరులు ప్రశ్నించగా 'అభివృద్ధికి అభ్యంతరం తెలిపే వారు మాట్లాడుతూనే ఉంటారు' అని అన్నారు. విజయవాడలో జనాభా ఎక్కువ ఉందని, ఉపయోగం లేని భూములను అప్పగిస్తే తప్పేంటని లోకేష్ ప్రశ్నించారు. ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటునే అభివృద్ధి జరుగుతుందన్నారు పరిశ్రమలకు అతి తక్కువ ధరకు భూములు అప్పగించాలన్నది ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నుంచే నేర్చుకున్నట్లు చెప్పారు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అతి తక్కువ ధరలకే పరిశ్రమలకు భూములు కేటాయించారని, తాము కూడా అదే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు టిసిఎస్‌కు ఎకరా 99పైసలు చొప్పున 25 ఎకరాలు కేటాయించామని, ఏ రాష్ట్రప్రభుత్వం కూడా ఇంత తక్కువ ధరకు భూములు ఇవ్వలేదన్నారు. సింగపూర్ పర్యటన గురించి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 4 రోజుల పాటు జరిగిన పర్యటన విజయవంత మైందన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనదే రాష్ట్రప్రభుత్వం లక్ష్యమని, పట్టుదలతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాబోయే ఐదేళ్లల్లో గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్టిమెంట్ కార్పొరేషన్ సింగపూర్ సావరిన్ ఫండ్ ద్వారా రాష్ట్రంలో రూ.45వేల కోట్ల పెట్టుబడులు పెట్టెందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఇది యువతకు గుడ్‌న్యూస్ అని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బ్యాడ్ న్యూస్ అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం ఏకపక్షంగా ఒప్పందాలను రద్దు చేసి సింగపూర్ కంపెనీ లను తరిమివేశారని విమర్శించారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టొద్దని మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంపెనీకి చెందిన మురళీకృష్ణ అనే వ్యక్తి సింగపూర్ ప్రభుత్వానికి మెయిల్ పంపారని వెల్లడించారు.దేశంలో అతిపెద్ద డెటా సెంటర్ విశాఖకు రాబోతుందన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే బనకచర్ల రాద్ధాంతం

రాజకీయ ప్రయోజనాల కోసమే బనకచర్లపై తెలంగాణ నేతలు ఆరోపణలు చేస్తున్నారని లోకేష్ అన్నారు. సముద్రంలోకి వెళ్లే మిగులు జలాలను తాము ఉపయోగించుకుంటే తప్పేంటని విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. మిగులు జలాలను రాయలసీమకు తీసుకెళ్తే వారికి ఇబ్బంది ఎందుకని ప్రశ్నించారు. రెగ్యులేటరీ కమిటీ అనుమతి లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు ఎలా కట్టారని నిలదీశారు. కొందరు రాజకీయ స్వార్థం కోసం ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి తెలుగువారి మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బనచకర్ల ప్రాజెక్టు ప్రతిపాదించింది ఎపి భూభాగంపైనే అని, తెలంగాణకు ఒక నీతి, ఆంధ్రకు ఒక నీతా? తాము తెలంగాణ నీళ్లు తీసుకుంటున్నామా? అని ప్రశ్నించారు. బనకచర్లపై పూర్తిస్థాయి చర్చ జరగాలని కోరారు. ప్రతి ఏటా సముద్రంలోకి వందల టిఎంసిల నీరు వృద్ధాగా వెళ్తోందని, మిగులు జలాలు ఉన్నపుడే లిఫ్ట్ చేస్తామన్నారు.

నైపుణ్యం కలిగిన యువత కొరత

- డాక్టర్ బాలసుబ్రమణియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నైపుణ్యం కలిగిన యువత కొరత ప్రపంచ దేశాలను వేధిస్తోందని, జర్మన్ దేశంలో నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆ దేశ లోయర్ సాక్సోని రాష్ట్ర నైపుణ్య ఉద్యోగుల నియామక విభాగాధిపతి డాక్టర్ బాల సుబ్రమణియన్ రమణి తెలిపారు. తాడేపల్లిలోని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జర్మనీలో ప్రస్తుతం ఏడు లక్షల మందికిపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. 2035 నాటికి నిపుణుల అవసరం 70 లక్షలకు చేరుతుందని అంచనా వేశామన్నారు. రవాణా, నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ, ఇంజనీరింగ్, ఐటి వంటి కీలక రంగాల్లో నిపుణుల కొరత ఉండనుందని వివరించారు. రాష్ట్రంలో యువత నైపుణ్య విద్యతోపాటు జర్మన్ భాషపై పట్టు సాధించాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ సిఇఒ గణేష్ కుమార్, ప్రభుత్వ సలహాదారు సీతాశర్మ రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

డాక్టర్ నమ్రతకు ఐదు రోజుల పోలీసు కస్టడీ


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సికింద్రాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అక్రమ సరోగసీ, శిశు విక్రయాలకు సంబంధించి సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ యజమాని డాక్టర్ అథలూరి నమ్రత, ఆమె కుమారుడు జయంత్ కృష్ణ, మరికొంత మంది నిందితులను గోపాలపురం పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వైద్యురాలు నమ్రత, జయంత్ కృష్ణలను కస్టడీకి ఇవ్వాల్సిందిగా పోలీసులు సికింద్రాబాద్ కోర్టును కోరారు. నమ్రత వద్ద సరోగసీ, ఐవిఎఫ్ కోసం వచ్చిన వారి వివరాలు లభ్యమయ్యాయని, మరిన్ని విషయాలు రాబట్టేందుకు వారం రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ వేశారు. దీనిపై గురువారం విచారణ చేపట్టిన కోర్టు.. డాక్టర్ నమ్రతను ఐదు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది.

ప్రకృతి ఒడిలో అమరావతి

- బిడదారి తరహాలో గృహ నిర్మాణం
- బ్యూటిఫికేషన్ మాస్టర్‌ప్లానుపై సిఎం సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అమరావతి నగరాన్ని గ్రీన్, బ్లూ నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. . గురువారం రాష్ట్ర సచివాయలంలో అమరావతి బ్యూటీఫికేషన్, గ్రీన్, బ్లూ మాస్టర్‌ప్లానులపై సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజధానిలో నిర్మిస్తున్న ప్రధాన ట్రంక్ రోడ్లు, అనుబంధ రహదారులు, ఎల్పిఎస్ లేఅవుట్ల వద్ద నిర్మించే రహదారులు, బఫర్‌జోన్లు, గ్రీన్‌జోన్లు కూడళ్లు ఆహ్లాదంగా ఉండేలా చూడాలని తెలిపారు. అమరావతి ఇన్ నేచర్ కాన్సెప్టుతో హరిత ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హరిత ప్రాంతం, పార్కులు ఉండేలా చూడాలని ఆదేశించారు. జీవ వైవిధ్య ప్రాంతంగా రూపొందించాలని చెప్పారు. రాజధానిలో ఏర్పాటు చేసే కాలువల్లో ఏడాది పొడవునా వేర్వేరు పూలు వికసించేలా ప్లాను చేయాలని తెలిపారు. ఔషధ మొక్కలు పెంచేందుకు ప్రముఖ యోగాగురు బాబా రాందేవ్ నుండి సలహాలు తీసుకోవాలని తెలిపారు. కడియం నర్సరీని ప్రోత్సాహించాలన్నారు. హిమాలయాల నుండి కన్యాకుమారి వరకూ ఉన్న దేశీయ వృక్షజాతిని పెంచాలన్నారు. సింగపూర్ బిడదారి తరహాలో హౌసింగ్ ప్రాజెక్టు చేపట్టాలన్నారు. 250 ఎకరాల ప్రాంతంలో 10 వేలమంది నివసించేలా బిడదారి ఎస్టేట్‌ను నిర్మించారని, ప్రకృతితో సేదతీరే ప్రాంతాలనూ ఏర్పాటు చేశారని, ఇక్కడా అటువంటి పద్ధతిలో గృహ నిర్మాణం ఉండాలని తెలిపారు. కొండవీటివాగు, పాలవాగు సహా కాలువల వ్యవస్థను కూడా అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని సిఎం ఆదేశించారు. కృష్ణానదిలో ఎగువున ఉన్న ఆరుదీవులను కూడా సుందరంగా తీర్చిదిద్ది రివర్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు సిఎంకు తెలిపారు. పర్యావరణానికి ఇబ్బంది లేకుండా చేయాలని సిఎం సూచించారు. ఉండవల్లి కొండపై అందంగా కనిపించేలా పూలమొక్కలు నాటాలని ఆదేశించారు.

ప్రతి నీటిబొట్టు సద్వినియోగం చేయండి

ఆగస్టు 31న కుప్పం బ్రాంచీకెనాల్‌కు నీరు : సమీక్షలో సిఎం

సముద్రంలోకి వృథాగా పోతున్న నీటితో రిజర్వాయర్లు నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లో ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులకు నీటిని తరలించాలని నిర్దేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, సమర్థనీటి నిర్వహణపై జల వనరులశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ప్రధాన ప్రాజెక్టుల్లో 771 టిఎంసిల మేర నీటి నిల్వలు ఉన్నాయని అధికారుల ముఖ్యమంత్రికి తెలిపారు. మధ్యస్థాయి ప్రాజెక్టుల్లో 43 టిఎంసిలు, చిన్న, నీటి చెరువుల్లో 67 టిఎంసిల మేర నీరు నిల్వ ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వాయర్లు, చెరువుల్లో 882 టిఎంసిల మేర నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు. రాయలసీమ ప్రాంతంలో రిజర్వాయర్లు చెరువుల్లోకి ఇంకా 132 టిఎంసిలు ఎనీటిని నింపేందుకు అవకాశం ఉందని అన్నారు. కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహాలు కొనసాగుతున్నందున రాయలసీమలోని ప్రాజెక్టులకు నీటిని తరలించే అంశంపై సిఎం అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక ఉండాలని తెలిపారు. సోమశిల, కండలేరు, గండికోట, బ్రహ్మంసాగర్, పైడిపాలెం తదితర రిజర్వాయర్లన్నీ నింపాలని సిఎం ఆదేశించారు. చెరువులతోపాటు భూగర్భ జలాలు కూడా నిండాలని అన్నారు. రాష్ట్రంలో 43 వేల చెరువులను నింపడం ద్వారా భూగర్భ జలాలకు కూడా రీఛార్జ్ చేసినట్లు అవుతుందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలాలు పెరిగితే 120 టిఎంసిల నీటిని నిల్వ చేసినట్లేనని తెలిపారు. ఇప్పుడు 9.8 మీటర్ల లోతులో ఉన్నాయని, వ్యత్యాసాన్ని తగ్గించి మరో ఐదు మీటర్ల మేర నిల్వలు పెరిగేలా చర్యలు తీసుకుంటే 600 టిఎంసిలు నీరు అందుబాటులోకి వస్తుందని వివరించారు. రిజర్వాయర్లలో 1300 టిఎంసిల నీరు నిల్వ ఉంటుందని, దీనివల్ల ఖరీఫ్, రబీకి పుష్కలంగా నీరు సరఫరా చేయొచ్చని వివరించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు 31న నీళ్లు తీసుకెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



శ్రావణ్‌కుమార్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన ఆదివాసీ నిరుద్యోగ యువత

ఏజెన్సీ టీచర్ పోస్టులను ప్రత్యేక డిఎస్‌సితో భర్తీచేయాలని..

జిసిసి చైర్మన్ క్యాంపు కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-పాడేరు టౌన్ (అల్లూరి జిల్లా)

మెగా డిఎస్‌సిలోని ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులను మినహాయించి ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సితో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ క్యాంపు కార్యాలయాన్ని ఆదివాసి నిరుద్యోగ యువత, డిఎస్‌సి అభ్యర్థులు గురువారం ముట్టడించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఆదివాసీ నిరుద్యోగ సంఘం, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ఆధ్వర్యాన పాడేరు ఏజెన్సీ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వచ్చి ఆందోళన చేపట్టారు. తాము అధికారంలోకి వస్తే జిఒ 3కు ప్రత్యామ్నాయంగా మరో జిఒ తీసుకొస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీని అమలుచేసి, ఆదివాసి స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ జిల్లా కో-కన్వీనర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఆగస్టు 9వ తేదీలోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోతే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. తక్షణమే ఆదివాసి స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని కోరుతూ ఆగస్టు ఒకటి నుంచి నిర్వహించనున్న జీపు జాతాను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు క్యాంపు కార్యాలయానికి చేరుకొని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్ సత్యనారాయణ, భాను, ఎం భవాని, జి బాను సిహెచ్ రావు, వి చిన్నతల్లి, కృష్ణంపడాల్, శంకర్, సుధీర్, రాజంనాయుడు, ప్రవీణ్, విష్ణుమూర్తి, రాజు, వినయ్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే 'ప్రత్యేక డిఎస్సి' నోటిఫికేషన్

- డివైఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు బోధించే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అవసరమైన డిఎస్సి నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్రకమిటీ ఆందోళన నిర్వహించింది. అభ్యర్థులతో కలిసి విజయవాడలో ధర్నా చౌక్‌లో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 86 వేల మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నారని తెలిపారు. వీరికి బోధన చేసేందుకు అవసరమైన ఉపాధ్యాయులను రాష్ట్రప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేశారు. జులై 15వ తేదీలోపు ప్రత్యేక డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో 2,260 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని రాష్ట్రప్రభుత్వం జిఒ 13 కూడా విడుదల చేసిందన్నారు. ఈ ఖాళీ పోస్టులకు తక్షణమే సిలబస్ ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్లతరబడి స్పెషల్ కోర్సు చేసి డిఎస్సి కోసం నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేదని, అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు ఇవ్వాలని కోరారు. ఈ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోస్టులను భర్తీ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్, డివైఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా నాయకులు ఎస్ నిజాముద్దీన్, శివ, బసవ, మహేష్, అభ్యర్థులు దివ్య, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టారు... బడి రూపు మార్చారు

- సొంత నిధులతో మరమ్మతులు

ప్రజాశక్తి- మండపేట (కోనసీమ)



వెలగతోడులో రంగులు వేసిన అనంతరం పాఠశాల

వెలిసిపోయిన రంగులు, తుప్పు, చెదలు పట్టిన తలుపులు, బీటలు వారిన గోడలు, గోతులు పడిన గచ్చులు ఇదీ కోనసీమ జిల్లా మండపేట మండలం వెలగతోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిస్థితి. 200లకు పైగా విద్యార్థులకు ఇదొక్కటే పాఠశాల. పాఠశాల దుస్థితిని ప్రభుత్వానికి పలుమార్లు నివేదించారు పాఠశాల హెచ్ఎం శొంటేని శ్రీనివాసరావు. అయినా సరైన స్పందన లేదు. సమస్యల మధ్య విద్యార్థుల చదువులు సాధ్యం కాదని తలచి తన సొంత నిధులను వెచ్చించి పాఠశాల రూపురేఖలు మార్చారు. మరమ్మతులు చేయించి రంగులు వేయించి సుందరంగా తీర్చిదిద్దారు. గుంతలతో నిండిన ఆవరణను చదును చేయించి కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రతి రోజూ విద్యార్థులకు క్విజ్ నిర్వహించి, బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఎన్ఎంఎంఎస్, రిలయన్స్ క్విజ్ పోటీలకు పాఠశాల సమయం పూర్తయిన తరువాత పిల్లలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేసి ఈ పనులు చేశానని శ్రీనివాసరావు తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులకు సకల వసతులూ కల్పించామని చెబుతున్నారు.

పలువురి అభినందన

ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ మెరుగైన బోధనను అందించేందుకు కృషి చేస్తున్న శ్రీనివాసరావు మాస్టారు అభినందనీయులని మండల విద్యాశాఖాధికారులు సోమిరెడ్డి, నాయుడు రామచంద్రరావు, స్థానిక ప్రజాప్రతినిధులు కొనియాడారు. ఈ సందర్భంగా వారు శాలువా, పూలదండలతో గురువారం మాస్టారును సత్కరించారు.

రేపటి ధర్నా జయప్రదం చేయాలి : ఫ్యాప్టో పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఈ నెల 2న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో పిలుపునిచ్చింది. ఈ మేరకు ఫ్యాప్టో చైర్మన్ ఎల్ సాయిశ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్ చిరంజీవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీగా ఉన్న ఎంఇఒ-1 పోస్టులను కామన్ సీనియార్టీ ప్రాతిపదికన పదోన్నతుల ద్వారా ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలని కోరారు. పి4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయొద్దని తెలిపారు ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించి 72,73,74 జిఒలు అమలు చేయాలని కోరారు. హైస్కూల్ ప్లస్‌లలో వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి, యథాతథంగా కొనసాగించాలని తెలిపారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టి కలెక్టర్ పూల్ ద్వారా పోస్టింగులు ఇవ్వాలని కోరారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 3 డిఎలను ప్రకటించాలని పేర్కొన్నారు.

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో

మళ్లీ మొదటి నుంచి విచారణ వద్దు : హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో తదుపరి దర్యాప్తు పేరుతో మళ్లీ మొదటి నుంచి దర్యాప్తు చేయడానికి వీలులేదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణకు అనుమతి ఇస్తూ రాజమహేంద్రవరం ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ అనంతబాబు దాఖలు చేసిన వ్యాజ్యంలో గురువారం కీలక ఆదేశాలు వెలువడ్డాయి. సుబ్రహ్మణ్యం హత్య కేసులో కేవలం విచారణ తదుపరి దర్యాప్తునకే పరిమితం కావాలని, మొదటి నుంచి చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు దర్యాప్తు అధికారికి జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని, లేకపోతే మొదటి నుంచి దర్యాప్తు చేసే అవకాశం ఉందని పిటీషన్‌లో అనంతబాబు ఆందోళన వ్యక్తం చేశారు. దర్యాప్తు అధికారి పునర్ దర్యాప్తు మొదలుపెట్టి వేధించే అవకాశం ఉందని అనంతబాబు తరుపు సీనియర్ న్యాయవాది చిత్తరవు రఘు వాదించారు.

ఆర్‌టిసి స్థలాల పరిరక్షణకు ఐక్య పోరాటాలు

- పౌర వేదిక రౌండ్‌టేబుల్ తీర్మానం
- 137 జిఒ రద్దుపై పోరాట కమిటీ ఏర్పాటు
- కన్వీనర్‌గా ఐలు నేత సుంకర ఎన్నిక
- 6న విజయవాడ పాత బస్టాండ్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ



పౌర వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ఆర్‌టిసి స్థలాలను కాపాడుకోవాలని, లూలూ కంపెనీకి ఆ స్థలాలను కట్టబెట్టడాన్ని అడ్డుకోవాలని, చిరు, మధ్య తరగతి వ్యాపారుల మనుగడ, పరిరక్షణకు రాజకీయాలకతీతంగా విశాల ఐక్యత ద్వారా ఉమ్మడి ఉద్యమానికి సిద్ధం కావాలని పౌర వేదిక రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. దీనిలో భాగంగా ఆగస్టు 6న ఉదయం పాత బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టాలని, వివిధ దశల్లో పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించింది. ఆర్‌టిసికి చెందిన విజయవాడ పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ కంపెనీకి కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ పౌర వేదిక ఆధ్వర్యాన నగరంలోని బాలోత్సవ్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం జరిగింది. టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఎంవి.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో "ఆర్‌టిసి ఆస్తుల పరిరక్షణా కమిటీ'ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ (ఎస్ఆర్‌పి)ని కన్వీనర్‌గా ఎన్నుకుంది. ఆయన పేరును పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్ ప్రతిపాదించగా, సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. రూ.400 కోట్ల విలువైన నాలుగున్నర ఎకరాల పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ కంపెనీకి కట్టబెట్టవద్దని, 137 జిఒను రద్దు చేయాలని కోరుతూ 'ఆర్‌టిసి ఆస్తుల పరిరక్షణా కమిటీ' ఆధ్వర్యంలో సంస్థ యాజమాన్యానికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రాలు ఇవ్వాలని, దశలవారీగా పోరాటాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్, ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్, పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ సిహెచ్.బాబూరావు, ఆర్‌టిసి ఇయు నాయకులు దామోదర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, హోటల్స్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, జెవివి రాష్ట్ర అధ్యక్షులు జి.మురళీధర్, ఐలు జిల్లా కార్యదర్శి సంపర శ్రీనివాస్, ఆర్‌టిసి పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మురహరి, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి వి.సాంబిరెడ్డి, నాయకులు భవానీప్రసాద్, అమరావతి రైతు నాయకులు తిరుపతిరావు తదితరులు మాట్లాడారు.

రామచంద్ర యాదవ్ వినతిపై చర్యలు తీసుకోండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి : నెల్లూరు జిల్లా కరేడు గ్రామ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఇండో సోల్ పరిశ్రమ కోసం భూసేకరణ ప్రక్రియను వ్యతిరేకిస్తున్న రైతులకు సంఘీభావం తెలిపేందుకు అనుమతి కోరుతూ బోడే రామచంద్ర యాదవ్ ఇచ్చిన వినతి పత్రంపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రైతులకు సంఘీభావం తెలిపేందుకు అనుమతినివ్వాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ (బిసివైపి) అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ ఇచ్చిన వినతి పత్రంపై ఆగస్టు 2వ తేదీ కల్లా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర డిజిపి, నెల్లూరు జిల్లా ఎస్‌పిలకు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

- ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉంగుటూరు

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కొల్లేరు వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులందరికీ కొల్లేరు సమస్య పరిష్కారానికి సంబంధించిన అంశాలపై వాస్తవ పరిస్థితులను తెలిపేందుకే సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

చెరువులపై ఆధారపడిన కుటుంబాలకు సైతం న్యాయం చేసేలా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. ప్రలోభాలకు లొంగిపోవద్దని, అందరికీ న్యాయం జరిగేలా తాము బాధ్యత తీసుకుంటున్నామని, ధైర్యంగా ఉండాలని రైతులకు భరోసా ఇచ్చారు. పర్యావరణానికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా రైతులకు న్యాయం జరిగేలా త్వరలోనే సుప్రీంకోర్టులో తీర్పు వస్తుందనే ఆశావాహ దృక్పథంతో ఉన్నామని తెలిపారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ కొల్లేరు పర్యావరణానికి హాని కలగకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

'హజ్' దరఖాస్తుల స్వీకరణ గడువు 7 వరకూ పెంపు

- మంత్రి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే ఏడాది హజ్ యాత్ర కోసం, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఆగస్ట్ 7వ తేదీ వరకూ పొడిగించినట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. హజ్ యాత్ర కోసం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేంద్ర హజ్ కమిటీ తొలుత దరఖాస్తుల సమర్పణకు తుది గడువు జూలై 31వ తేదీనే నిర్ణయించిందన్నారు. హజ్ యాత్రకు ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆగస్ట్ 7వ తేదీలోపు వారి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. అదేవిధంగా విజయవాడ ఎంబార్కేషన్ సెంటర్‌ను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని కోరారు.

లాటరీ ద్వారా ఇళ్ల ప్లాట్ల కేటాయింపుపై నిరసన

- రూ.25 లక్షల ప్యాకేజీ ప్రకటించాలని భూ నిర్వాసితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులు, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఎపిఐఐసి సేకరించిన భూములలో నివాస గృహాలు కోల్పోయిన నిర్వాసితులకు ఇంటి స్థలాలు కేటాయించేందుకు లాటరీ పద్ధతి ఎంపిక కార్యక్రమాన్ని భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని పట్టుపట్టారు. నక్కపల్లి మండలంలోని కాగిత - పాటిమీద కొత్త రోడ్డులో గురువారం నర్సీపట్నం ఆర్‌డిఒ, ఆర్ అండ్ ఆర్ అధికారి వివి.రమణ ఆధ్వర్యాన డిఎల్.పురం, చందనాడ, వేంపాడు, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట గ్రామాల్లో నివాస గృహాలు కోల్పోయిన వారికి బోదుగల్లం గ్రామంలో నిర్మించే ఆర్‌ఆర్ కాలనీలో ఒక్కొక్కరికి 0.05 సెంట్లు విస్తీర్ణంతో కూడిన ప్లాట్లను కేటాయించేందుకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక కార్యక్రమం చేపట్టారు. ఇందుకుగాను 290 కుటుంబాల్లో 745 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. వీరందరికీ ప్లాట్లు కేటాయించేందుకు లాటరీ ప్రక్రియను అధికారులు కొనసాగిస్తుండగా భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించే వరకు స్థలాలు కేటాయించొద్దని నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని బహిష్కరించి ఆందోళనకు దిగారు. భూ నిర్వాసితులకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నేత వీసం రామకృష్ణ, వైస్ ఎంపిపిలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, భూ పోరాట కమిటీ సభ్యులు సూరకాసుల గోవింద్, గంటా తిరుపతిరావు, తళ్ల భార్గవ్, సిపిఎం మండల కార్యదర్శి రాజేష్ తదితర నాయకులు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. దీనిపై ఆర్‌అండ్‌ఆర్ అధికారి రమణ మాట్లాడుతూ.. ప్యాకేజీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. స్థానికులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, లే-అవుట్‌లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని, ఒక కుటుంబమంతా ఒక్క దగ్గరే ఉండే విధంగా ప్లాట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్లాట్లను లాటరీ పద్ధతి ద్వారా నిర్వాసితులకు కేటాయించారు. టిడిపి కూటమి పార్టీలకు చెందిన వారంతా తీసుకున్నారు. మిగిలిన వారు రూ.25 లక్షల ప్యాకేజీ ప్రకటించాకే తీసుకుంటామంటూ వెనుదిరిగారు.

రోడ్డెక్కిన బొప్పాయి రైతులు

- గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న బొప్పాయి రైతులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు (అన్నమయ్య జిల్లా)

బొప్పాయికి ధరలు భారీగా తగ్గడంతో ఆగ్రహించిన రైతులు గురువారం అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులోని కడప-చెన్నై ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. చిట్వేలి-కడప-తిరుపతి ప్రధాన రహదారులలో బొప్పాయి లోడు కోసం వెళుతున్న లారీలను ఆపి లారీల్లో ఉన్న గడ్డి, పేపర్లను రహదారిపై వేసి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న సిఐ హేమసుందర్ ఘటనా స్థలానికి వెళ్లి రైతులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, రైతులకు మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకుంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బొప్పాయి వ్యాపారస్తులు, సేట్లు సిండికేట్‌గా ఏర్పడి ధరలు భారీగా తగ్గిస్తున్నారని తెలిపారు. కనీస గిట్టుబాటు ధర లేకుండా కాయలు ఎలా అమ్ముకోవాలని ప్రశ్నించారు. గిట్టుబాటు ధర లేకుండా చేసి దళారులు మోసం చేస్తున్నారని తెలిపారు. దళారుల మోసాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. గిట్టుబాటు ధర కల్పించాలని రాజంపేట సబ్ కలెక్టర్‌ను కోరగా.. న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన మరుసటి రోజే దళారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిలో రూ.16 నుంచి రూ.11లకు ధర తగ్గించారని వాపోయారు. ఈ క్రమంలో బుధవారం మరోసారి రూ.7లకు తగ్గించారన్నారు. ఆర్డర్‌లు లేవంటూనే వందల లారీలు లోడ్ చేసేందుకు ఎలా పంపుతున్నారని నిలదీశారు. 18 టన్నులు లోడుపైన రూ.1.50 లక్షలు రైతులు నష్టపోతున్నారన్నారు. మరోపక్క వెయ్యి కిలోలకు వంద కిలోలు సూటు పేరుతో తగ్గించి మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సూటు రద్దు చేయాలని కోరారు. బొప్పాయి రైతులకు కనీసం కిలో రూ.25 గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వైఖరి మారాలని, కేసులు పెడతామని బెదిరించడం మానుకోవాలని, దళారులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బొప్పాయిని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయండి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బొప్పాయి పంటలను మార్క్‌ఫెడ్‌తో, కిలో రూ.25కు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు, సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డిలు గురువారం లేఖ రాశారు. అన్నమయ్య జిల్లా రాజంపేట, ఎ.కోడూరు ప్రాంతంలో బొప్పాయి పంటను రైతులు అధికంగా పండించారని, పంట చేతికి వచ్చే సమయానికి వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కొనుగోలు ధరలు తగ్గించి రైతులను ప్రతి ఏటా మోసం చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఇదే విధంగా జరిగిందన్నారు. ప్రారంభంలో కిలో రూ.16కు కొనుగోలు చేయగా, క్రమంగా ధరలు తగ్గించి బుధవారం వరకూ కిలో రూ.11 చెల్లించగా, గురువారం కేవలం రూ.7 మాత్రమే ధర నిర్ణయించారని పేర్కొన్నారు. దీంతో బొప్పాయి రెతులు కడుపు మండి రహదారిపై నిరసన తెలియజేశారని చెప్పారు. సూట్ పేరుతో టన్నుకు రూ.100 కిలోల ధరను రైతుల నుంచి తీసుకుంటున్నారని తెలిపారు. సూట్‌ను తొలగించాలని కోరారు. పెట్టుబడిరాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే బొప్పాయి రైతులు మార్కెటింగ్, ఉద్యానశాఖ, సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అధికారుల జోక్యం ఆశించినంతగా లేదని, దీన్ని అవకాశంగా తీసుకుని బొప్పాయి వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు తగ్గించి రైతుల జీవితాలతో ఆటలాడుతున్నారని పేర్కొన్నారు.



ప్రకాశం బ్యారేజీ నుండి విడుదలవుతున్న నీరు

ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి

- 2.65 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు భారీ వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం నుంచి 3,18,434 క్యూసెక్కులు దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్ 26 క్రస్టు గేట్లను ఎత్తి 2,43,829 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట నీటి నిల్వ 312 టిఎంసిలు కాగా గురువారం రాత్రి 8 గంటలకు 297.72 టిఎంసిలుగా నమోదైంది. సాగర్ నుంచి పులిచింతలకు 2,09,404 క్యూసెక్కుల నీరు వస్తోంది. అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రకాశం బ్యారేజీకి వరద తీవ్రత కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజీకి 2,65,909 క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ అన్ని గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి నుంచి బాపట్ల జిల్లా రేపల్లే వరకు కృష్ణా తీర ప్రాంత గ్రామాల్లోని పొలాల్లోకి నీరు ప్రవేశించింది. సాయంత్రానికి వరద ప్రవాహం కొంత మేరకు తగ్గుముఖం పట్టడం వల్ల అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

తగ్గిన గోదావరి వరద

వారం రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ వచ్చిన గోదావరి వరద ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. గురువారం నాడు భద్రాచలంలో గోదావరి నీటిమట్టం 27 అడుగులకు చేరుకొని క్రమంగా తగ్గుతోంది. వరద తగ్గినా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే ముంపు నుండి బయటపడలేదు. వేలేరుపాడు మండలంలో కొయిదా వెళ్లే మార్గంలో యడవల్లి వద్ద ఎద్దు వాగు కాజ్‌వేపై ఉన్న వరద తగ్గకపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాకపోకలకు మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

చేనేత దంపతులపై దాడి కేసులో ఐదుగురు అరెస్టు

- శ్రీ సత్యసాయి జిల్లా ఎస్‌పి రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

డబ్బులు చెల్లించలేదన్న కారణంతో చేనేత దంపతులపై దాడి చేసిన నిందితులను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి వి.రత్న గురువారం పుట్టపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు.... అదే పట్టణానికి చెందిన ఎరికల రాజా వద్ద రూ.ఆరు లక్షలు వడ్డీకి అప్పు తీసుకున్నారు. వారానికి రూ.పది వడ్డీ చొప్పున రూ.15 లక్షల వరకు చెల్లించారు. తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని అంత వడ్డీ ఇవ్వలేనని రాజాకు చేనేత కార్మికుడు చెప్పారు. ఈ క్రమంలో గత నెల 23న రాజా అనుచరులు మండల మహేష్, ముద్దనగుల వినోద్ కుమార్, గుజ్జల హేమంత్ కుమార్, గుంజర గోవర్ధన్, జెర్రిపోతుల మనోహర్ కలిసి చేనేత కార్మికుడి ఇంటికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వలేనని చెప్పడంతో అతని భార్య, పిల్లలపై దాడి చేశారు. దాడి ఘటన సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతో సంచలనం రేపింది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ధర్మవరం పోలీసులు బుధవారం నిందితులు మహేష్, ముద్దనగుల వినోద్ కుమార్, గుజ్జల హేమంత్ కుమార్, గుంజర గోవర్ధన్, జెర్రిపోతుల మనోహర్‌ను అదుపులోకి తీసుకున్నారు. రాజా ఇంకా పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు.

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాల్సిందే

- విశాఖ డెయిరీ కార్మికుల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న సిఐటియు నాయకులు జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి -గాజువాక (విశాఖపట్నం)

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలంటూ విశాఖ డెయిరీ కార్మికులు గురువారం సిఐటియు ఆధ్వర్యాన గాజువాకలో పాదయాత్ర నిర్వహించారు. పాత గాజువాక జంక్షన్ నుండి కొత్త గాజువాక వరకు, తిరిగి పాత గాజువాక జంక్షన్ వరకు పాదయాత్ర సాగింది. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ అక్రమంగా 300 మంది కార్మికులను విశాఖ డెయిరీ యాజమాన్యం తొలగించిందని, వారిలో 200 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. వారిని తొలగించి 48 రోజులు గడుస్తోందన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపి శ్రీభరత్ స్పందించి విధుల్లోకి తీసుకునేటట్లు యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని కోరారు. 25 నుండి 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని తొలగించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. చర్చల పేరుతో యాజమాన్యం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ జోక్యం చేసుకొని డెయిరీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కార్మికులను ఆదుకోవాలని కోరారు. వారిని విధుల్లోకి తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సిఐటియు నాయకులు ఎం రాంబాబు మాట్లాడుతూ చేసిన అగ్రిమెంటు అమలుచేయాలని అడిగినందుకు కార్మికులను తొలగించారని తెలిపారు. తొలగించిన వారి స్థానంలో వేరే రాష్ట్రాల వారిని తీసుకొచ్చి పనిచేయిస్తున్నారని, ఆ పనులు వారు చేయలేకపోవడం వల్ల రోజుకు 30 వేల లీటర్ల వరకు పాలు, పెరుగు పాడవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి రమణ, కె కిరీటం, కె సంతోషం, ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

దేశ ఆసక్తులకే ప్రాధాన్యం

- అమెరికాతో చర్చలపై మంత్రి పియూష్ గోయల్



న్యూఢిల్లీ : అమెరికాతో జరుగుతున్న వాణిజ్య ఒప్పందం చర్చల్లో భారత ఆసక్తులే ప్రాధాన్యమని వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగస్టు 1 నుంచి భారత వస్తువులపై 25 శాతం సుంకాలు, జరిమానాను ప్రకటించిన నేపథ్యంలో పార్లమెంట్‌లో పియూష్ గోయల్ మాట్లాడుతూ.. భారత్ సుంకాల సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందన్నారు. దేశ ఆసక్తులను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరిస్తుందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశాన్ని మృత ఆర్థిక వ్యవస్థ (డెడ్ ఎకానమీ) అని పేర్కొనడాన్ని గోయల్ తీవ్రంగా ఖండించారు. భారతదేశం గత పదేళ్ల క్రితం ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ నుంచి ఇప్పుడు ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. భారత్ ఇప్పటికే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఐరోపా ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఇఎఫ్‌టిఎ)తో పరస్పర లాభదాయకమైన ఉచిత వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని మంత్రి తెలిపారు. మరిన్ని దేశాలతో ఇలాంటి ఒప్పందాల కోసం చర్చలు జరుగుతున్నాయన్నారు. త్వరలో భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అధిక సుంకాలతో జిడిపి తగ్గొచ్చు

- వృద్ధి 30 బేసిస్ పాయింట్లు తగ్గొచ్చు
- బార్క్‌లేస్ అంచనా

న్యూఢిల్లీ : అమెరికా విధిస్తున్న అధిక సుంకాలు భారత జిడిపిని దెబ్బతీయనున్నాయని విత్త సంస్థ బార్క్‌లెస్ విశ్లేషించింది. భారత వస్తువులపై 25 శాతం సుంకాలు సహా రష్యన్ దిగుమతులపై అదనపు జరిమానా విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపిని 30 బేసిస్ పాయింట్లు (0.3 శాతం) తగ్గించనుందని అంచనా వేసింది. అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నందున.. తుది సుంకాలు 25 శాతం కంటే తక్కువగా ఉండవచ్చుని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి 6.5 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ, ఐఎంఎఫ్ 6.4 శాతంగా, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ 6.5 శాతంగా అంచనా వేశాయి. అమెరికా అధిక సుంకాలతో భారత్‌కు చెందిన ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వస్త్రాలు వంటి రంగాలు సుంకాల ప్రభావాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. వ్యవసాయం మరియు డైరీ రంగాలలో మార్కెట్ యాక్సెస్ విషయంలో భారతదేశం గతంలో జాగ్రత్తగా వ్యవహరించిందని మూడీస్ అనలిటిక్స్ అసోసియేట్ ఎకనమిస్ట్ అదితి రామన్ పేర్కొన్నారు.



పసిడి డిమాండ్‌కు అధిక ధరల దెబ్బ

న్యూఢిల్లీ : బంగారం ధరలు భారీగా పెరిగిపోవడంతో వినియోగదారులు కొనలేక పోతున్నారు. దీంతో పసిడికి డిమాండ్ తగ్గుతోంది. ఈ ఏడాది 2025లో బంగారం వినియోగం ఐదేళ్ల కనిష్ఠానికి పడిపోనుందని వాల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. బంగారం పెట్టుబడుల్లో స్వల్ప డిమాండ్ ఉన్నప్పటికీ.. పెద్దగా ప్రభావం చూపడం లేదని తెలిపింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వినియోగదారు అయిన భారత్‌లో గతేడాది 802.8 టన్నుల బంగారం డిమాండ్ చోటు చేసుకుందని డబ్ల్యుజిసి రీజినల్ సిఇఒ సచిన్ జైన్ తెలిపారు. ఈ ఏడాది పసిడి డిమాండ్ 600 నుంచి 700 మెట్రిక్ టన్నుల వరకూ ఉండొచ్చుని అంచనా వేసింది. ఇది 2020 నాటి కనిష్ఠ స్థాయి అని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతదేశ బంగారం డిమాండ్ 10 శాతం తగ్గి 134.9 టన్నులకు చేరుకుందని డబ్ల్యుజిసి అంచనా వేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది 149.7 టన్నులుగా ఉంది. ఇటీవల 10 గ్రాముల బంగారం ధర రూ.1 లక్ష దాటడంతో సామాన్య ప్రజలు కొనలేని స్థాయికి చేరింది.

గంజాయి కేసులో 13 మంది అరెస్టు

- 5.2 కేజీల సరుకు స్వాధీనం
- నిందితుల్లో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

గంజాయి కేసులో 13 మందిని గుంటూరు జిల్లా కొల్లిపర పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 5.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల 13 మందిని అరెస్టు చేసి వారి నుంచి 21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోగా తాజాగా మరో 13 మందిని గురువారం అరెస్టు చేశారు. ఈ వివరాలను తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్లో డిఎస్‌పి బి జనార్ధన్‌రావు వెల్లడించారు. డిఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం... పాడేరులోని కించముండ గ్రామంలో నివసించే పరమేశ్వర్ వద్ద కొల్లిపర మండలానికి చెందిన 13 మంది గంజాయిని చౌకగా కొనుగోలు చేసి తెనాలి పరిసర ప్రాంతాల్లో 20 గ్రాములు రూ.500కు విక్రయిస్తున్నారు. వారిని కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం మాల డొంక ప్రాంతంలో పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో కొల్లిపరకు చెందిన మల్లోల శోభన్‌బాబు, పాముల రుషిబాబు, మంద్రురాజ్ కుమార్, ఆరే ఆదిత్య, అమిరే ఆనంద్ కిషోర్, పోకూరి శ్రీను, కాజా గ్రామానికి చెందిన కారంకి నిఖిల్ కుమార్, అత్తోటకు చెందిన యర్రు శశి కుమార్, దాసరి చేతన్, రేపల్లెకు చెందిన కొసరాజు రోహిత్, కుంచవరానికి చెందిన గరిక గోపినాథ్, మేడా ప్రవీణ్, విశాఖపట్నంకు చెందిన కొచ్చర్ల సత్యసాయి చక్రవర్తిగా గుర్తించారు. వారిలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు ఉండడం గమనార్హం. పట్టుబడిన వారిలో తొమ్మిది మందిపై గతంలో కేసులున్నాయి. గంజాయి రవాణా, విక్రయాలను ఉపేక్షించేది లేదని, ఇప్పటికే పది మందిపై పిడి యాక్ట్ ప్రయోగించబోతున్నామని డిఎస్‌పి చెప్పారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కోర్టు ఆవరణాన్ని శుభ్రం చేయండి

- మందు బాబులకు 'పారిశుధ్య పనుల' శిక్ష

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి సామాజిక స్ఫూర్తితో వినూత్నంగా శిక్ష విధించారు బాపట్ల జిల్లా చీరాల అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.కాత్యాయని. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పోలీసులకు పట్టుబడి గురువారం కోర్టుకు హాజరైన పది మందికి కమ్యూనిటీ సేవగా కోర్టు ప్రాంగణంలో మూడు రోజులపాటు సమయపాలన పాటిస్తూ శుభ్రత పనులు చేయాలని ఆదేశించారు. ఈ విషయంపై కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ.. ఈ నెల 30న చీరాల పట్టణ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో సుమారు పది మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుబడినట్లు తెలిపారు. కేసు విచారణ నిమిత్తం కోర్టులో హాజరైన వారిలో పలువురు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని న్యాయమూర్తికి విన్నవించారు. దీంతో వారి ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు కమ్యూనిటీ సేవ చేయాలని జడ్జి జె.కాత్యాయని ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ మేరకు వారంతా కోర్టు ప్రాంగణాన్ని మూడు రోజులపాటు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకూ శుభ్రంగా ఉంచాల్సి ఉంటుందని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సమయానికి హాజరుకాని వారికి జరిమానాతోపాటు 15 రోజుల జైలుశిక్ష విధిస్తామని, మళ్లీ ఇలాంటి చర్యకు పాల్పడితే మూడు నెలల వరకు జైలు శిక్ష తప్పదని న్యాయమూర్తి హెచ్చరించారు.

జిఒ 137ను ఉపసంహరించాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి పాత బస్టాండ్ స్థలం 4.25 ఎకరాల విలువైన స్థలాన్ని లూలూ షాపింగ్ మాల్‌కు ఇవ్వాలనే జిఒ 137ను వెంటనే ఉపసంహరించుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్టీసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుకు, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరరావు, ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయనున్న నేపథ్యంలో ఎపిఎస్‌ఆర్‌టిసి సంస్థను విస్తరింప చేయాల్సిన అవసరం ఉందని, సిబ్బంది, కొత్త బస్సులు, కొత్త డిపోలు అవసరం ఉందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆర్టిసిని విస్తరించాల్సి ఉండగా, ఆర్టిసి స్థలాను షాపింగ్ మాల్స్‌కు ఇవ్వడం విచారకరమన్నారు. ఆర్టిసి స్థలాన్ని మాల్స్‌కు కేటాయించి, డిపోను తరలించే విషయంపై ఆర్టిసి సంఘాలు, ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం లూలూ సంస్థకు ఆర్టిసి స్థలాన్ని కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని కోరారు.

సునామీ, తుపాన్లకు సంసిద్ధంగా ఉండాలి

- ఎస్‌డిఆర్ఎం ఇడి దీపక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సునామీ, తుఫాన్ల పట్ల అధికారులు ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఇడి వెంకట దీపక్ సూచించారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ, ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఒషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'సునామీ సన్నద్ధత'పై 12 కోస్తా జిల్లాల్లోని ప్రభావిత మండల, గ్రామ స్థాయి అధికారులతో 'మాక్ ఎక్సర్‌సైజ్' వీడియో కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్ మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న వనరులు, సౌకర్యాలు, సాంకేతికతను ముందుగానే తెలుసుకోవాలని సూచించారు. ఈ సమయాల్లో ముఖ్యంగా ఆహారం, నీరు, పునరావాసం, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలను ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. సేఫ్ రూట్ మ్యాప్, పవర్ బ్యాక్ అప్ వంటి సదుపాయాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

అలిపిరిలో మహిళ మృతి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతిలోని అలిపిరి లగేజీ సెంటర్ వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... అలిపిరి లగేజ్ సెంటర్ ఎదుట సుమారు 45 సంవత్సరాలు వయస్సు గల ఓ మహిళ మృతి చెందిన విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని మహిళగా భావించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

సుంకాలపై మౌనమేల?

ఆధిపత్య ధోరణికి అహంకారమూ, అరాచకమూ తోడైతే ఎలా ఉంటుందో- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతెన్నులను పరికిస్తే అర్థమవుతుంది. తాను అనుకుంటున్నట్టుగా ప్రపంచాన్ని నడిపించటానికి సుంకాల బెత్తం ఝుళిపించి, పెత్తనం చెలాయించాలని రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ పేట్రేగుతున్నాడు. అధిక సుంకాలు విధిస్తానని గత ఏప్రిల్‌లోనే ఇండియా, చైనా, బ్రెజిల్, మెక్సికో, కెనడా సహా 30 దేశాలను బెదిరించిన ట్రంప్ ... చైనా తదితర దేశాల నుంచి ఎదురు సుంకాలు గొంతెత్తటంతో- అమలుకు 90 రోజులు గడువంటూ మిన్నకున్నాడు. ఒకపక్క ఇండియా - అమెరికా మధ్య చర్చలు జరుగుతుండగానే- మన ఎగుమతులపై 25 శాతం సుంకాలను విధించటం, ఇది ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తుందంటూ ఏకపక్షంగా ప్రకటించటం అమెరికా ఆధిపత్య ధోరణికి, ట్రంప్ అహంకార వైఖరికి నిదర్శనం. ఏదోవిధంగా మనదేశంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి, తమ వాణిజ్య ప్రయోజనాలను సాధించాలన్నది అమెరికా వ్యూహం. దీనికి భారత్ నుంచి సరైన, దీటైన సమాధానం ఇవ్వటం చాలా అవసరం. కానీ, నోరు మెదపటానికి సైతం మన ప్రధాని మోడీ వెనకాడుతుండటం విచారకరం.

ఏ దేశమైనా తాను ఉత్పత్తి చేసే సరుకులను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంది. తనకు అవసరమైన వస్తువులను అనువైన ధరలకు ఇచ్చే దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇది కనీస వ్యాపార సూత్రం. ఎక్కడి నుంచి ఎంతకు కొనాలో, సుంకాలు ఎంతెంత ఉండాలో ఏ దేశమూ ఏకపక్షంగా నిర్ణయించజాలదు. అమెరికా ధోరణి ఈ ప్రాథమిక నియమానికి భిన్నంగా ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే రష్యా అత్యంత చౌకగా ముడి చమురు, సహజ వాయువును సరఫరా చేస్తోంది. భారత్, చైనా తమ అవసరాలకు రష్యా నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అమెరికా అనుంగు ఆయిల్ కంపెనీలకు ఇది నష్టదాయకంగా పరిణమించింది. దీంతో, రష్యాతో ఎలాంటి వాణిజ్య లావాదేవీలు జరిపినా ఊరుకునేది లేదని నెలరోజుల క్రితం అమెరికా హూంకరించింది. నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే కూడా తీవ్రమైన పరిభాషతో మన దేశాన్ని హెచ్చరించాడు. రష్యాతో వాణిజ్య వ్యాపారాలను వెంటనే నిలిపేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని బెదిరింపులకు తెగించాడు. ఒక సర్వ సత్తాక స్వతంత్ర దేశాన్ని ఇలా బెదిరించటానికి అతడికున్న దన్నేమిటి? ఒకపక్క మోడీ తానే ట్రంప్‌కు ప్రియమైన మిత్రుడైనట్టు పోజులిస్తుంటే- అమెరికా నుంచి ఈ తరహా పరోక్ష, ప్రత్యక్ష అదిలింపులూ, ఒత్తిళ్లలో అర్థమేమిటి? వెన్నెముక ఉన్న ఏ ప్రభుత్వమైనా ఇలాంటి ధోరణులపై తక్షణం స్పందించాలి. అవసరం లేని అంశాలపై రాద్ధాంతాలు చేసి; ఆత్మగౌరవానికి, సార్వభౌమత్వానికి భంగం వాటిల్లే విషయాలపై మాట్లాడకుండా మిన్నకుండడం సమంజసం కాదు.

'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదం తలకెత్తుకున్న ట్రంప్... ముంచుకొస్తున్న ఆర్థికమాంద్యం నుంచి తప్పించుకోవటానికి అధిక సుంకాలు విధించటం, యుద్ధాయుధ అమ్మకాలను పెంచటం ఓ గొప్ప పరిష్కారంగా ఎంచుకొని ఆ దిశగా పావులు కదుపుతున్నాడు. దరిమిలా విస్తారమైన అవకాశమున్న మనదేశంలోకి తమ వ్యవసాయ, డైరీ ఉత్పత్తులతో ముంచెత్తాలని అమెరికా తీవ్ర ఒత్తిడి తెస్తోంది. మోడీ ప్రభుత్వం ఆ ఒత్తిళ్లకు తలొగ్గి, ఇప్పటికే లక్షల కోట్ల విలువైన ఆయుధాల కొనుగోలుకు, చమురు దిగుమతికి అంగీకరించింది. మరింత వాణిజ్య చొరబాటుకు ట్రంప్ పరివారం మంత్రాంగం నడుపుతోంది. వ్యవసాయ, పాల ఉత్పత్తులు, ఔషధ రంగాల్లోకి తన కార్పొరేట్ మద గజాలను దించాలని ప్రయత్నిస్తోంది. ఈ పన్నాగంతోనే తీవ్ర ఒత్తిళ్లకు, పెత్తందారీ పోకడలకు దిగుతోంది.

అమెరికా అభీష్టానికి అనుకూలంగా తలూపితే మన వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. పెట్రో ధరలు పెచ్చు పెరిగి, నిత్యావసరాలపైనా ఆ భారం పడుతుంది. ఇప్పటికే నిరుద్యోగం, అల్పాదాయాలు, అధిక ధరలతో సతమతమవుతున్న దేశ ప్రజానీకానికి ఇది మరింత దుర్భర స్థితిని కలిగిస్తుంది. కాబట్టి- మోడీ ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టేలా అమెరికాకు గట్టి సమాధానం చెప్పాలి. దేశ ప్రగతికి, ప్రజలకు నష్టం కలిగించే వాణిజ్య ఒప్పందాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. నష్టదాయక ఒప్పందాలూ, కష్టకారక లొంగుబాట్లూ వద్దంటూ ప్రజలూ గొంతెత్తాలి!

మహనీయుల మాట



పిల్లలు ఆడుకుంటున్నప్పుడు మనం వారి ఆకాంక్షలను గమనిస్తూ వుండాలి. వాటి వెనక వున్న వారి ఆకాంక్షలు అర్థం చేసుకుంటూ వుండాలి. వాటికి మనం చేయూతనిస్తే...ఆ పిల్లలే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తయారవుతారు.

- గిజూభాయి,
ప్రసిద్ధ విద్యావేత్త.

ప్రజల శక్తిగా నాలుగున్నర దశాబ్దాలు

సందర్భం

తెలకపల్లి రవి


ప్రజాశక్తి దిపపత్రిక నాలుగున్నర దశాబ్దాలు పూర్తి చేసుకుని 45వ వార్షికోత్సవ ఘట్టంలో అడుగెట్టింది. కమ్యూనిస్టు ఉద్యమ నేతగా, ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడుగా స్ఫూర్తినిచ్చిన మోటూరు హనుమంతరావు గారి పేరిట నెలకొల్పిన అవార్డు ప్రదానం జరగునున్నది. అక్షరాక్షర దీక్షగా / ఆశయాలే రక్షగా / నడచి వచ్చిన దారులు / నిలిచి గెలిచిన తీరులు ఈ సందర్భంలో కళ్ల ముందు కదలాడతాయి. 1942లో ప్రజాశక్తి వారపత్రికగా ప్రారంభమై 45లో దినపత్రికగా మారింది. ఆ విధంగా చూస్తే ఇది ఎనభయ్యవ వార్షికోత్సవం కూడా. ఫాసిస్టు యుద్ధాన్ని ఖండించడంలోను, ప్రగతిశీల భావాలను వ్యాపింప చేయడంలోనూ నాటి ప్రజాశక్తి కీలక పాత్ర వహించింది. గ్రాంథికం, వ్యవహారం, వాదోపవాదాల మధ్య పత్రికా భాష ఇంకా పూర్తిగా స్థిరపడని ఆ కాలంలో జన సామాన్యానికి అర్థమయ్యే విధంగా రాయడంలో ప్రజాశక్తి భాషకు వరవడి, భావాలకు వరిపిడి అయింది. 1946లో ప్రారంభమైన తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రజాశక్తి వాణిగా పనిచేసింది. ప్రభుత్వం 1948లో విజయవాడలోని ప్రజాశక్తి నగర్‌పై దాడి చేసి, విధ్వంసానికి పాల్పడింది. నిజాం నవాబు కూడా హైదరాబాద్ సంస్థానంలో నిషేధించాడు. నూతన స్వాతంత్రం, రాష్ట్రాల ఏర్పాటు, ఎన్నికలు తదితర పరిణామాల మధ్య మళ్లీ 1951లో వారపత్రికగా పున:ప్రారంభమైంది. కొన్నాళ్ళ తర్వాత దినపత్రికగా మారి విశాలాంధ్ర పేరుతో పున:ప్రారంభమైంది. రాజకీయ సిద్ధాంత కారణాల వల్ల మధ్యలో కొంతకాలం జనశక్తిగా వెలువడింది. మళ్లీ ప్రజాశక్తి 1968లో వారపత్రికగా 1981 ఆగస్టు ఒకటవ తేదీన దినపత్రికగా అవతరించింది.

ఈ నలభై అయిదేళ్ల కాలంలో అంతర్జాతీయంగానూ, దేశంలోనూ లౌకిక ప్రగతిశీల శక్తులు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశాయి. అనేక ఎదురు దెబ్బలూ తగిలాయి. 1981 అఖిలపక్ష ఉద్యమం, 1982లో సిపిఎం అఖిల భారత మహాసభల మహా సమీకరణ తర్వాత 83 ఎన్నికల్లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చారు. 1984లో సానుభూతి పవనాలతో రాజీవ్ గాంధీ గద్దెనెక్కారు. 1990లలో సోషలిస్టు శిబిరంలో కల్లోలం చెలరేగి చివరకు 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైంది. దేశంలో సరికొత్త ఆర్థిక విధానాలు, వాటిని వెంటనంటి రాజకీయాలలో మితవాద, మతవాద దాడి మొదలైనాయి. చివరకు 1998లో బిజెపి అధికారం చేపట్టింది. రాష్ట్రంలో తెలుగుదేశం దానితో జత కట్టి మరోసారి అధికారంలోకి వచ్చి ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేయడంలో ప్రథమ పీఠిన నిలిచింది. ఆ సమయంలో సాగిన విద్యుచ్ఛక్తి ఉద్యమానికి ప్రజాశక్తి ప్రాణవాయువులా సేవ చేసింది. 2004లో వై.ఎస్ ప్రభుత్వం వచ్చాక భూపోరాటం వంటివి జరిగాయి. తెలంగాణ ఏర్పాటుకు ఉద్యమంతో 2014 ఎన్నికల తర్వాత రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఎ.పి లో టిడిపి, వైసిపి పాలన మళ్లీ ఇప్పుడు టిడిపి కూటమి పాలన సాగుతున్నది. కేంద్రంలో బిజెపి ఆధిక్యత కోల్పోయినా ఈ పార్టీల మద్దతుతో మూడోసారి వచ్చిన మోడీ ప్రభుత్వం కరుడుగట్టిన మతతత్వం కార్పొరేట్ తత్వం సామ్రాజ్యవాద అనుకూలతల కలయికగా సాగుతున్నది. రాజకీయ పరిస్థితులు ఎన్ని విధాలుగా మారి ఎన్ని సవాళ్లు వచ్చినా ఈ దశలన్నిటా ప్రజాశక్తి ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం వేదికగా నిలిచింది. తీవ్రమైన కరోనా తాకిడితో సహా చాలా సమస్యలను అధిగమించింది.

మోటూరు విలక్షణ పాత్ర

ఎం.హెచ్ గా సుపరిచితులైన మోటూరు హనుమంతరావు ఒక నిస్వార్థ ప్రజా నాయకుడు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత. సమర్థుడైన సంపాదకుడుగా, శక్తివంతమైన రచయితగా, ఉర్రూతలూపే ఉపన్యాసకుడుగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సమిష్టి తత్వాన్ని అమలు జరిపిన క్రమశిక్షణా శీలి. అవగాహనలో అనుభవంలో ఆరితేరినా తరాల అంతరం లేకుండా అందరితో ఆప్యాయంగా అభిమానంగా మెలిగిన అనురాగమూర్తి. సహచరులనూ, కార్యకర్తలనూ సామాన్య ప్రజలనూ సదా ఆదరిస్తూ సార్థక జీవితం గడిపిన సంయమనశీలి. రాజకీయ వ్యక్తిగత హుందాతనానికి అర్థం చెప్పిన సంస్కారి. ఆటుపోట్లకు అవరోధాలకు తలవంచని ధీశాలి. తెలుగునాట ఎందరో రాజకీయ నేతలూ, పాత్రికేయ ప్రముఖులూ ప్రసిద్ధులూ వున్నా ఇన్ని ప్రత్యేకతల కలబోత గనకే ఎం.హెచ్ అందరి గౌరవం పొందగలిగారు. ప్రగతిశీల కళాసాహిత్య ఉద్యమాలపై ఆయనది ప్రత్యేక ముద్ర. 2001లో ఆయన కన్నుమూత తర్వాత గడచిన దాదాపు పాతికేళ్ల కాలంలో ఈ కృషి కొనసాగుతున్నది. అంకితభావంగల నాయకత్వం సంపాదకులు, పాత్రికేయులు, కార్మికులు, ఉద్యోగ సిబ్బంది సేవలు, ఉద్యమాభిమానులు, పత్రిక శ్రేయోభిలాషుల అండదండలు దాన్ని నిలబెట్టాయి. ఆయన స్మారకార్థం అవార్డును నెలకొల్పి అన్ని పత్రికల నుంచి అర్థవంతమైన కథనాలు ఆహ్వానించి కమిటీ ద్వారా ఎంపిక చేసి అవార్డు ఇవ్వడం కరోనా సమయంలో తప్ప క్రమం తప్పకుండా జరగడం అభినందనీయం. 1945 నుంచి ఆఖరి శ్వాస వరకూ అన్ని దశల్లో ప్రజాశక్తితో లీనమై ప్రజాశక్తిమంతుడు అనిపించుకున్న వి.ఆర్.బొమ్మారెడ్డి పత్రికా ప్రపంచంలో పితామహుల వంటి వారు. ఆయన ఆఖరి కోరిక మేరకు ప్రజాశక్తి పాత్రికేయుల కథనాలను బట్టి ఎంపిక చేసి అంతర్గత అవార్డు అందజేయడం జరుగుతున్నది. ఈ పెద్దలతో పాటు ఉద్యమ పత్రికల కోసం వివిధ దశల్లో ఎనలేని కృషి చేసిన డి.వి.సుబ్బారావు, నాగులపల్లి కోటేశ్వరరావు, ఎల్.జోగారావు, తుమ్మల వెంకట సుబ్బయ్య, ఎ.కె.ఆర్.బి.కోటేశ్వరరావు, గొల్ల రాధాకృష్ణ మూర్తి తదితర అమరజీవులను కూడా గుర్తు చేసుకుందాం.

విజయవాడలో ప్రజాశక్తి దినపత్రికను ప్రారంభిస్తున్న ఇఎంఎస్ నంబూద్రిపాద్ తో సుందరయ్య (1981)



నేడు గుంటూరులో కామ్రేడ్ మోటూరు హనుమంతరావు, వి.ఆర్.బొమ్మారెడ్డి అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా...

ఈ నలభై అయిదేళ్లలో మీడియా ముఖచిత్రం ఎంతగానో మారింది. ఆధిపత్య శక్తులకు అంగీకార సృష్టి నేటి ప్రపంచాధిపత్య వ్యూహంలో ప్రధానాంశం. ఇందులో పెద్ద పాత్ర మీడియాది. అందుకే ప్రజానుకూల శక్తులు ప్రత్యామ్నాయ మీడియా కోసం నిరతం కృషి చేస్తున్నారు. అమెరికా వంటి చోట్ల కూడా ప్రత్యామ్నాయ భావజాల కృషి ఉధృతమవుతున్నది. తెలుగు మీడియా ముఖ్యులలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రగతిశీల భావాల ప్రేరణ లేనివారు చాలా తక్కువ. ఇప్పుడు భారతీయ మీడియాలో ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ సోషల్ మీడియాలోనూ కార్పొరేట్ శాసనం ప్రబలిపోయింది. ఆంక్షల అంకుశాలు, నిరంకుశ పాలకుల శాసనాలు మీడియాను వేటాడుతుంటే ఆ విలువలు వెలవెలబోతున్నాయి. మరీ ముఖ్యంగా తెలుగునాట ప్రధాన పత్రికలు, ఛానళ్లు రెండు ప్రాంతీయ పాలక పార్టీల మధ్య విభజింపబడి వివాదాలలో మునిగితేలుతున్నాయి.

అంతర్జాతీయంగా అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిఘటించడమూ వుండదు. రైతాంగ ఆందోళన, మితవాద విజృంభణ, లాటిన్ అమెరికా పరిణామాలు ఏదైనాసరే వీటికి అవసరం లేని పని, మోడీ మన్ కీ బాత్ వాటికి వేద వాక్యం. వ్యూస్ కోసం రేటింగుల కోసం వాస్తవాలతో నిమిత్తం లేని కథనాలు వండి వారుస్తుంటాయి. ఎ.పి లోనే చూస్తే కార్పొరేట్లకు భూపందేరాల భాగోతాలు విశాఖ ఉక్కుతో సహా ప్రైవేటీకరణ పోకడలు వీటికి సమస్యలే కాదు. ఈ సోషల్ మీడియా యుగంలో ఇందుకు సంబంధించిన విస్తారమైన సమాచారం ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక మేధావులు, పాత్రికేయులు, రచయితలు తవ్వి తీస్తున్నా దాదాపు కనిపించదు. తాము బలపర్చే పక్షాల్ని తలకెత్తుకోడం, అవతలి పక్షంపై దాడి చేయడం అవసరమైతే అందుకు అవాస్తవాలూ అతిశయోక్తులైనా ప్రధానంగా ప్రచారంలో పెట్టడం నిత్యకృత్యమైంది. ఒకరు అధికారంలో వుంటే మరో వైపు మీడియాపై దాడి చేయడం పరిపాటిగా మారింది. ఇతర వాణిజ్య పోకడలు, సంచలనాలు, సెలబ్రిటీ ముచ్చట్లు సరేసరి. ప్రజాశక్తి వీటికి అతీతంగా ప్రజల ప్రయోజనాలే పరమావధిగా 'ప్రతి అక్షరం ప్రజల పక్షం' అంటూ ప్రస్థానం సాగిస్తున్నది.

ప్రత్యామ్నాయ మార్గంలో...

ఒకప్పుడు మిగిలిన వాటిని మెయిన్ స్ట్రీమ్ పత్రికలనీ, ప్రజాశక్తి, విశాలాంధ్ర వంటి వాటిని వామపక్ష పత్రికలనీ అనేవారు. అయితే ఇప్పుడు ప్రజాశక్తి వంటివి ప్రజల (మెయిన్) స్ట్రీమ్ కాగా చాలా పత్రికలు ఆయా పాలక పార్టీల స్ట్రీమ్‌లుగా మారాయి. విశ్వసనీయత, స్వతంత్రత, నిష్పాక్షికతలకు కట్టుబడి ప్రజల పక్షంగా యథార్థాన్ని ఆవిష్కరించే బాధ్యత పూర్తిగా మోస్తున్నది ప్రజాపత్రికలే. అందుకే ప్రజలు వాటిని గౌరవిస్తారు. అయితే రానురాను పాలక వర్గాల ప్రతీప శక్తుల సవాళ్లు తీవ్రమవుతాయి. ఎందుకంటే ప్రత్యామ్నాయ మీడియా అనేది పాలకులకు ఎప్పుడూ సింహస్వప్నమే. అందుకే మోడీ అధికారంలోకి రావడానికి ఉపయోగించుకున్న సోషల్ మీడియానే ప్రజాస్వామిక వాదులు ఉపయోగించుకుంటే అపరాధమై పోతున్నది. సుప్రీంకోర్టు ముందు మీడియాకు సంబంధించిన కేసులు ఎన్ని వున్నాయో చెప్పడం కష్టం. సభకు విచ్చేసిన ప్రబీర్ పురకాయస్త వంటివారు ఈ పోరాటానికి ప్రత్యక్ష ఉదాహరణలు. ఇలాంటి జటిలమైన గత సవాళ్లను అధిగమిస్తూ నాలుగున్నర దశాబ్దాలు నడిచిన ప్రజాశక్తి చరిత్రకు తోడు ఇప్పుడు చైతన్యవంతమైన ఉద్యమాల కదలిక మరింత విశ్వాసమిస్తుంది. చారిత్రాత్మక ఢిల్లీ రైతు ఉద్యమం, ఇటీవలి ఎన్నికలలో లౌకిక శక్తుల బలం పెరగడం, కేంద్రంలో మోడీ దూకుడుకు ప్రజలు పగ్గాలు వేయడం ప్రజాశక్తి వంటి పత్రికల కృషికి ఉత్సాహమిచ్చే పరిణామం. కర్ణాటకలో సిద్దరామయ్య ప్రభుత్వం ఏరో స్పేస్ కోసం భూసేకరణ నిలిపేయడం గానీ, ఎ.పి లో అదానీ సంస్థలు రెంటినీ విరమించుకోవడం గానీ ప్రజా విజయాలే. కానీ ఇంకా జరగవలసిన పోరాటం మరెంతో వుందని గుర్తించాలి. మోటూరు వంటి యోధుల జీవితాలు, కృషి అందుకు ఆదర్శంగా నిలుస్తాయి. అవార్డు గ్రహీతలను అభినందిస్తూ ఆ దిశగా అడుగులు వేద్దాం.

★

(నిన్నటి తరువాయి)

'గ్రీన్ ఎనర్జీ' పేరుతో కార్పొరేట్ దోపిడీ

విశ్లేషణ



సుంకర రాజేంద్ర ప్రసాద్

ఈ ప్రాజెక్టును 'గ్రీన్ ఎనర్జీ' అనే ఆకర్షణీయమైన పేరుతో ప్రచారం చేస్తున్నారు. కానీ ఆహారాన్ని ఉత్పత్తి చేసే, కార్బన్‌ను పీల్చుకునే ఒక వ్యవసాయ పర్యావరణ వ్యవస్థను నాశనం చేసి సోలార్ ప్యానెళ్లను తయారు చేసే ప్రాజెక్ట్ ఎంత 'పచ్చనిది'? ఈ విధ్వంసం పూర్తిగా అనవసరం.

ఇప్పటికే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నాయుడుపేట మండలం, మేనకూరు సెజ్‌కు 5600 ఎకరాల భూమిని సేకరించారు. దానిలో ఇప్పటికీ 500 ఎకరాలు మాత్రమే పరిశ్రమల స్థాపనకు ఉపయోగించారు. శ్రీ సిటీ కోసం 5,500 ఎకరాలు సేకరించగా ఇప్పటికీ వేల ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయి. చింతవరం సెజ్ కోసం 2500 ఎకరాలు సేకరించగా ఇప్పటికీ ఏ ఒక్క పరిశ్రమను స్థాపించలేదు. ఇఫ్కో ఎరువుల పరిశ్రమకు రేగడ చేలిక గ్రామం వద్ద 2700 ఎకరాలను 35 సంవత్సరాల క్రితం తీసుకొని, ఏ విధమైన ఎరువుల పరిశ్రమలు రానందున దానిని ఇఫ్కో కిసాన్ సెజ్‌గా పేరు మార్చారు. అయినా, ఇప్పటికీ ఒకటి రెండు పరిశ్రమలు తప్ప ఏ మాత్రం అభివృద్ధి లేదు. రిలయన్స్ థర్మల్ ప్రాజెక్ట్ పేరుతో 2006లో కృష్ణపట్నం గ్రామంలో 2550 ఎకరాలను రైతుల అభ్యంతరాలను ఖాతరు చేయకుండా బలవంతంగా సేకరించారు. ఇప్పటికీ ఏ ప్రాజెక్ట్ ఆనవాలు అక్కడ లేదు. రిలయన్స్ యాజమాన్యం ఆ భూములను రియల్ ఎస్టేట్‌గా మార్చడానికి ప్రయత్నిస్తున్నదని తెలుస్తోంది. నెల్లూరు జిల్లాలోనే ఇవికాక మరిన్ని బలవంతపు భూసేకరణలు, వాటిలో నామమాత్రపు పరిశ్రమలు స్థాపించిన ఉదాహరణలు మరెన్నో ఉన్నాయి. మరి ఇప్పటికే వేల ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండగా, కరేడు గ్రామంలో ఈ పచ్చటి పొలాలపై కన్ను పడటం అనేక సందేహాలకు దారితీస్తోంది. దీని భయంకరమైన స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి మనం కొన్ని ఉదాహరణలను పోల్చి చూసుకున్నట్లయితే వాస్తవాలు తేలికగా అర్థమవుతాయి.

సేకరిస్తున్న భూమి : ఒక నగరం కంటే పెద్దది

కరేడులో సేకరిస్తున్న 8,348 ఎకరాల భూమి ఒక చిన్న రాజ్యం లాంటిది. ఇది 34 చదరపు కిలోమీటర్లతో సమానం. ❖ ఈ ప్రాజెక్ట్ ప్రాంతం తిరుపతి మునిసిపల్ ప్రాంతం కంటే పెద్దది. ఇది 6,780 ఎకరాల్లో వుంది. ❖ అలాగే ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఫిల్మ్ స్టూడియో కాంప్లెక్స్ అయిన రామోజీ ఫిల్మ్ సిటీ కంటే నాలుగు రెట్లుపెద్దది. ఇది 2000 ఎకరాల్లో వుంది. ❖ ఈ ఒక్క ప్రాజెక్ట్ కాకినాడ నగరం కంటే పెద్దది. 30.51 చదరపు కిలోమీటర్లలో విస్తరించి వుంది.

నీరు: జీవనాడిని మళ్లించడం

అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే, కరువు పీడిత ప్రాంతంలో మంచినీటిని కేటాయించడం. ప్రభుత్వం ఈ ఒక్క కంపెనీకి సోమశిల రిజర్వాయర్ నుండి రోజుకు 115 మిలియన్ లీటర్లు (11 కోట్ల 50 లక్షల లీటర్లు), మరియు స్థానిక గ్రామ చెరువుల నుండి రోజుకు 7 మిలియన్ లీటర్ల (70 లక్షల లీటర్లు) మంచినీటిని కేటాయించింది. ఇది శీతలీకరణ కోసం ఉపయోగించే సముద్రపు నీరు కాదు. ఇది తాగడానికి, వ్యవసాయానికి ఉపయోగపడే విలువైన, జీవనాధారమైన మంచినీరు. దీన్ని అర్థం చేసుకోవడానికి, కొన్ని పోలికలను చూడండి.

❖ విజయవాడ నగరానికి ప్రతిరోజు సరఫరా చేసే మంచి నీరు 20 కోట్ల 90 లక్షల లీటర్లు (209 ఎం.ఎల్.డి). ❖ తిరుపతి, తిరుమల నగరానికి ప్రతిరోజూ సరఫరా చేసే మంచి నీరు 8 కోట్ల 30 లక్షల లీటర్లు (83 ఎం.ఎల్.డి).❖ ప్రాజెక్టుకు కేటాయించిన నీటితో సుమారు 15,000 ఎకరాల వరిని, రెండు పూర్తి పంట కాలాలకు పండించవచ్చు. వేలాది రైతు కుటుంబాల జీవనోపాధిని భద్రపరచవచ్చు. ❖ ప్రాజెక్టుకు చేసిన వార్షిక కేటాయింపుతో నెల్లూరు వంటి నగరం (6 లక్షల జనాభా) మొత్తం తాగునీటి అవసరాలను మూడు సంవత్సరాలకు పైగా తీర్చగలదు. ❖ ప్రభుత్వ ఉత్తర్వులో (జీవో ఎం.ఎస్. నెం. 17) ఈ మంచినీటిని "ఎక్కువ కాలం అందించడం సాధ్యం కాకపోవచ్చు" అని చెప్పడం దీని తీవ్రతను తెలియజేస్తుంది. ❖ రాయలసీమ, ప్రకాశం జిల్లాల రైతులు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటుంటే, ప్రభుత్వం ఒక నదికి సరిపడా నీటిని ఒక కంపెనీకి మళ్లిస్తోంది. ఇది కేవలం నీటి కేటాయింపు కాదు. ఇది చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయానికి, ప్రజల జీవనానికి మరణశాసనం రాయడమే.

పారిశ్రామిక కీలుగుర్రం: సోలార్ ముసుగులో గాజు ఫ్యాక్టరీ

ఈ "పచ్చని" ప్రాజెక్టులో దాగి ఉన్న ఒక భారీ పారిశ్రామిక రాక్షసుడు: రోజుకు 3,600 టన్నుల ఫ్లోట్ గ్లాస్ తయారీ కేంద్రం. ఇది ఒక చిన్న అనుబంధ పరిశ్రమ కాదు. ఇది తీవ్రమైన, పర్యావరణ సమస్యలను కలిగించే ఒక భారీ పరిశ్రమ.

గ్రీన్ వాష్ : ఈ ప్రాజెక్టును "సోలార్" ప్రాజెక్ట్ అని ప్రజలను మోసగిస్తున్నారు. ఇది కాలుష్యాన్ని వెదజల్లే భారీ పరిశ్రమ అనే వాస్తవాన్ని ఉద్దేశపూర్వకంగా మరుగు పరుస్తున్నారు.

తీవ్రమైన ఇంధన వినియోగం : గ్లాస్ తయారీకి ఫర్నేసులను ప్రతి నిమిషం 1700 డిగ్రీల సెల్సియస్ ఉష్ణంతో నడపాలి. దీనికోసం మండించే ఇంధనాల ద్వారా భారీగా గ్రీన్ హౌస్ వాయువులను విడుదల చేస్తాయి.

వాయు కాలుష్యం : ఇసుక, సోడా యాష్, సున్నపురాయిని కరిగించే ప్రక్రియలో కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, సల్ఫర్ డయాక్సైడ్ వంటి కాలుష్య కారకాలు విడుదలవుతాయి. ఇవి చుట్టుపక్కల వ్యవసాయ క్షేత్రాలపై స్థిరపడి, నేల, భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి.

ప్రమాదకరమైన వ్యర్థాలు : ఈ తయారీ ప్రక్రియలో గణనీయమైన పారిశ్రామిక వ్యర్థాలు ఉత్పత్తి అవుతాయి. సరైన పర్యావరణ ప్రభావ అంచనా లేకుండా, కరేడు ఒక పారిశ్రామిక వ్యర్థాల శాశ్వత డంపింగ్ యార్డ్‌గా మారే ప్రమాదం ఉంది. పర్యావరణ ప్రభావ అంచనాను అధ్యయనం చేయడాన్ని మినహాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం చట్టాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడమే. ఈ పరిశ్రమ అత్యంత కాలుష్యకరమైన 'ఎ' జాబితాలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ మినహాయింపు ఇవ్వటం అనేక అనుమానాలకు తావిస్తుంది.

డబ్బు : అపారమైన ప్రజాధనం
రూ.46,429.5 కోట్ల ప్రోత్సాహక ప్యాకేజీ అనేది ప్రజాధనాన్ని దోపిడీ చేసి కార్పొరేట్ శక్తులకు ధారపోయడమే.

పోలిక	ప్రాజెక్ట్ ప్రోత్సాహం (రూ.46,429.5 కోట్లు) వర్సెస్ ప్రజా వ్యయం	వాస్తవ బడ్జెట్/వ్యయం
ఎ.పి వ్యవసాయ బడ్జెట్	ఈ మొత్తం రాష్ట్ర వార్షిక వ్యవసాయ, అనుబంధ రంగాల బడ్జెట్ కంటే ఎక్కువ	రూ.42,357 కోట్లు (2024-25)
పోలవరం ప్రాజెక్ట్	ఇది లక్షలాది మంది రైతులకు జీవనాధారమైన పోలవరం ప్రాజెక్ట్ మొత్తం సవరించిన వ్యయంలో 83శాతానికి సమానం.	రూ.55,548కోట్లు (సవరించిన)
ఎ.పి విద్యా బడ్జెట్	ఈ ప్యాకేజీ రాష్ట్ర పాఠశాల, ఉన్నత విద్య వార్షిక బడ్జెట్ కంటే 133 శాతం ఎక్కువ.	రూ.34,717 కోట్లు (2024-25)

అధికారం లేనప్పుడు ఒక మాట తరువాత మరో బాట



కూటమి నాయకులు వారు అధికారంలో లేనప్పుడు ఈ భూ కేటాయింపులకు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిలో పెద్ద కుంభకోణం దాగి ఉందని, ఈ సంస్థ యాజమాన్యం అప్పటి ప్రభుత్వాధి నేత బినామీ అని విమర్శించారు. వారు అధికారంలోనికి రాగానే మాట మార్చారు, ఏవిధమైన ప్రాతిపదిక లేకుండానే చట్టంలో ఉన్న అవకాశాలను దుర్వినియోగపరిచి, ప్రజాభిప్రాయాన్ని కాలరాసి, ఏ విధమైన ప్రజాప్రయోజనం కానీ, సామాజిక ప్రయోజనం కానీ లేని ఒక కార్పొరేట్ సంస్థకు సామాజిక సంపదను, ప్రకృతి వనరులను దోచి పెట్టడానికి నిర్ణయించారు.

అధికారంలో లేనప్పుడు నారా లోకేష్ అభిప్రాయం

"గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023" సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, ఇండోసోల్ కంపెనీ డైరెక్టర్లు అందరూ పులివెందులకు చెందిన వారని, కేవలం లక్ష రూపాయల పెట్టుబడితో 2023 సంవత్సరంలో ఏర్పాటైన కంపెనీ అని, ఈ కంపెనీ రూ.76000 కోట్ల పెట్టుబడి పెడతామని చెబుతున్నారని, ఇది నమ్మదగిన విషయం కాదని, కానీ ఇటువంటి కంపెనీకి జగన్ మోహన్ రెడ్డి కర్నూలు, కడప, కృష్ణా జిల్లాల్లో 25000 ఎకరాల భూమిని కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ అధికారంలో లేనప్పుడు వెలిబుచ్చిన అభిప్రాయం

మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో (15.11.2023) ఈ విధంగా మాట్లాడారు. ఇండోసోల్ కంపెనీ సంప్రదాయ, పునరుత్పాదక విద్యుత్ కంపెనీగా నమోదు అయింది. దీని మాతృ కంపెనీ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్. ఈ సంస్థతో ముఖ్యమంత్రికి ఉన్న బంధం ఏమిటో అందరికీ తెలుసు. ఇండోసోల్‌కు జిల్లాలోనే అత్యధికంగా 8,348 ఎకరాలు రెండు విడతల్లో దక్కడం వెనుక వైసిపి పెద్దల కుతంత్రం అర్థం చేసుకోవచ్చు.

బిజెపి అధికార ప్రతినిధి దినకర్ అభిప్రాయం

దినకర్ 2024 మే 30న మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వైసిపి నాయకుల ఆక్రమణలో ఉన్న భూములపై, విద్యుత్ ప్రాజెక్టులకు భూములను కేటాయించడంపై, భూ మాఫియా మీద కొత్త ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. మరి ఈ కూటమి ప్రభుత్వం ప్రస్తుత చర్యలు గతంలో వారు చెప్పిన దానికి అనుకూలంగా ఉన్నాయా? లేక వ్యతిరేకంగా ఉన్నాయా? గత ప్రభుత్వం కంటే ఎక్కువగా ఇండో సోల్ కంపెనీకి భూమిని, ప్రకృతి వనరులను, ఆర్థిక సహాయాన్ని ఎందుకు చేస్తున్నారు? ఈ విషయంపై సమాధానం చెప్పవలసిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉన్నది.

2013 భూ సేకరణ చట్టానికి తూట్లు

ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయకుండా, దానికి అనేక తూట్లు పొడిచి, ఆ చట్టంలో పేర్కొన్న ఆహార భద్రత, సామాజిక ప్రభావ అంచనా విషయాలలో ఏకపక్షంగా 2014లో చేసిన సవరణను ఆధారం చేసుకొని ఈ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారు. మన రాష్ట్రంలో 2013 భూ సేకరణ చట్టానికి సవరణలు తెచ్చి, ఆ చట్టం కల్పిస్తున్న కనీస హామీలను కాలరాసి, అభివృద్ధి ముసుగులో చిన్న, సన్నకారు రైతుల భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు. ఇది ప్రభుత్వం యథేచ్ఛగా తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని చట్టాన్ని తూట్లు పొడిచి, కార్పొరేట్ శక్తులకు ప్రజా ధనాన్ని, ప్రకృతి వనరులను, ప్రజల భూమిని ధారాదత్తం చేయడమే.

విజన్ 2047 అని ఆర్భాటాలతో ప్రచారం చేసుకొనే కార్యక్రమంలో రైతులను గురించి ఈ విధంగా చెబుతున్నారు: భారత వ్యవసాయ రంగం కోసం విజన్ 2047 సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం, పునరుత్పాదక వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వ్యవసాయదారులను శక్తిమంతులుగా చేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని స్థిరమైన సమ్మిళిత, లాభదాయక వ్యవస్థగా మార్చడానికి దృష్టి పెడుతుంది. కానీ ప్రభుత్వాల చర్యలు రైతులను బికారులను చేసే విధంగానూ, దేశ ఆహార భద్రతకే ప్రమాదం తెచ్చే విధంగా ఉంటున్నాయి.

కరేడు భూముల సేకరణకు వ్యతిరేకంగా ఎన్నో ఆందోళనలు రైతులు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం వారి అభిప్రాయాలను, ఆందోళనలను పెడచెవిన పెట్టి, కరేడు ప్రాంతంలో 20 వేల ఎకరాల భూ సేకరణకు కార్యక్రమాన్ని ప్రారంభించింది.

కరేడు గ్రామం లేవనెత్తుతున్న అనేక ప్రశ్నలు

కరేడు కథ కేవలం ఒక గ్రామానికి సంబంధించినది కాదు. ఇది మన రాష్ట్ర అభివృద్ధి నమూనాకు ఒక క్లిష్టమైన పరీక్ష.

❖ఈ విషాదం మనల్ని కొన్ని ప్రాథమిక ప్రశ్నలను అడిగేలా చేస్తుంది. ఒకే ఒక్క కంపెనీకి లాభం చేకూర్చడానికి, శతాబ్దాల నాటి స్వయం సమృద్ధ గ్రామాన్ని విధ్వంసం చేయాలా? ❖ రైతులు కనీస మద్దతు కోసం వేడుకుంటుంటే, ఈ స్థాయిలో ప్రజా వనరులను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించడం న్యాయమేనా? ❖ గ్రామ ప్రజల జీవనాధారాలను కాలరాసి, వేలాది మందిని నిరాశ్రయులను చేసి, పర్యావరణాన్ని విషపూరితం చేస్తూ, ప్రజల గొంతును నొక్కేదాన్ని మనం "అభివృద్ధి" అని పిలవగలమా? ❖ ప్రభుత్వం కరేడు ప్రజలకు సమాధానం చెప్పాలి. వారి పచ్చని స్వర్గాన్ని ఒక కంపెనీ కోసం ఎందుకు బలి ఇస్తున్నారో? ❖ వారి గొంతును ఎందుకు విస్మరిస్తున్నారో వివరించాలి. రాష్ట్ర ప్రభుత్వ ఏకపక్ష చర్యలు, కార్పొరేట్ అనుకూల విధానాలు కరేడు సారవంతమైన పొలాల్లో విచారణలో ఉన్నాయి, దాని తీర్పు తరతరాలకు ప్రతిధ్వనిస్తుంది.

ప్రభుత్వం ఇప్పటికైనా తమ మంకు పట్టు వీడి, సామాన్య ప్రజల జీవితాలను విచ్ఛిన్నం చేసే చర్యలు మానుకోవాలని, సామాజిక సంపదను కార్పొరేట్‌కు దోచిపెట్టే విధానాలకు స్వస్తి చెప్పాలని, కరేడు పచ్చని పొలాల సేకరణను రద్దు చేయాలని ప్రజలందరూ ముక్త కంఠంతో నినదిస్తున్నారు. ప్రభుత్వం విజ్ఞత పాటించి తన ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక చర్యలను ఉపసంహరించుకోకపోతే ప్రజాగ్రహానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

/ వ్యాసకర్త అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ /

టారిఫ్‌లు నేటి నుండే అమలు

● రాష్ట్రంలోని ఆక్వా రైతులపై ప్రభావం

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్ : భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన అధిక సుంకాలు నేటి (శుక్రవారం) నుండే అమలులోకి రానున్నాయి. రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నందుకు గాను 25శాతం అధిక టారిఫ్‌లను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత్‌ను అత్యంత సన్నిహిత దేశంగా పేర్కొంటూనే ఆయన అధిక టారిఫ్‌లు విధించడం గమనార్హం. ట్రంప్ చర్యలతో ప్రధానంగా భారత ఎగుమతి రంగాలైన ఆటో పరికరాలు, స్టీల్, అల్యూమినియం, జెమ్స్ అండ్ జ్యువెలరీ, టెక్స్‌టైల్స్, సముద్రపు ఉత్పత్తులపై ప్రధానంగా ప్రభావం పడనుంది. రాష్ట్రంలో రొయ్యల ఎగుమతి అధిక టారిఫ్‌ల తీవ్ర ప్రభావం చూపనున్నాయి. దేశం మొత్తంమీద జరుగుతున్న రొయ్యల ఎగుమతుల్లో 70శాతం రాష్ట్రం నుండే జరుగుతోంది. ఈ రంగంపై దాదాపు 10 లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అంచనా. అధిక సుంకాల కారణంగా అమెరికాలో భారత రొయ్యల ధరలు భారీగా పెరుగుతాయి. ఇది వినియోగదారులపై ప్రభావం చూపుతుందని, ఎగుమతులు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే విధంగా వ్యవసాయం, ఐటీ, తయారీ రంగాలపై అధిక టారిఫ్‌ల ప్రభావం చూపనున్నాయి. మామిడి, మసాలాలు, బియ్యం తదితర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో ఈ రంగాలలోని రైతులు స్థానిక మార్కెట్లపై లేదా ఇతర మార్కెట్లపై ఆధారపడవలసి వస్తుంది.

ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా తొమ్మిది రోజూ ప్రతిపక్షాలు గళమెత్తాయి. దీంతోపాటు బిజెపి పాలిత రాష్ట్రాల్లో కార్మికుల అరెస్టులపై కూడా నిరసన తెలిపారు. అందులో భాగంగా గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు పెద్ద ఎత్తున ఇండియా బ్లాక్ ఎంపిలు నిరసనకు దిగారు. మకర ద్వారానికి ఎదురుగా చేపట్టిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్, సిపిఎం ఎంపిలు అమ్రారామ్, శివదాసన్, జాన్ బ్రిట్టాస్, టిఎంసి ఎంపిలు డెరిక్ ఓ బ్రెయిన్, సాగరికా ఘోష్, డిఎంకె ఎంపిలు కనిమొళి, ఎ. రాజాతో పాటు ఇండియా బ్లాక్ ఎంపిలు పాల్గొన్నారు. బీహార్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'సర్-ప్రజాస్వామ్యంపై దాడి' అనే భారీ బ్యానర్, ఎస్ఐఆర్‌ని ఆపాలి, ఓటు లూటీ ఆపాలనే ప్లకార్డులను ప్రదర్శించారు. 'ఓటు-బందీ, 'ఓటు కీ చోరీ-ఓటు కీ లూట్ 'ఓటు-బందీ, 'ఓటు కీ చోరీ-ఓటు కీ లూట్' అనే నినాదాలతో హోరెత్తించారు. ప్రజల అభిప్రాయం లేకుండా, ఎన్నికల తరువాత ఓటర్లను మత, కుల ప్రాతిపదికన వడపోసే ఈ ప్రయత్నాన్ని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే కుట్రగా ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఓటర్లను తొలగించడం కాదు, వారి గొంతుకను వినడమే ప్రభుత్వాల బాధ్యత అని కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికారు. బీహార్ ఎన్నికలకు ముందు కుట్ర పూరితంగా ఎస్ఐఆర్‌ను తీసుకొచ్చారని విమర్శించారు.

ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన

అంతకుముందు ప్రతిపక్ష ఇండియా బ్లాక్ నేతల సమావేశం జరిగింది. ఇండియా బ్లాక్ నాయకులు వచ్చే వారం ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయానికి నిరసన ప్రదర్శన నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల పౌరసత్వాన్ని నిర్ణయించడానికి ఇసి తన ఆదేశాన్ని మించి పనిచేస్తోందని ప్రతిపక్షం నిరూపించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సూచించారు. రాహుల్ గాంధీ, ఆర్‌జెడి నేత తేజశ్వి యాదవ్‌తో కలిసి ఆగస్టు రెండో వారంలో బీహార్‌లో ఎస్ఐఆర్ అంశంపై రెండు వారాల పాటు ప్రచారం చేస్తారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే వచ్చే వారం ఇండియా బ్లాక్ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు. "కర్ణాటక ఉదాహరణను ఉపయోగించి ఈ అంశంపై ఆ రోజు తాను ఒక ప్రజెంటేషన్ ఇస్తానని రాహుల్ గాంధీ సమావేశంలో చెప్పారు" అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, టిఎంసి ఎంపి డెరెక్ ఓ'బ్రెయిన్, ఎంపిలు టి.ఆర్. బాలు, తిరుచ్చి శివ, ఎస్‌పి ఎంపి రాంగోపాల్ యాదవ్, ఎన్‌సిపి ఎంపి సుప్రియా సులే, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, సిపిఐ ఎంపి సంతోష్ కుమార్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఎంపి రాజా రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లకు టారిఫ్ భయాలు

● సెన్సెక్స్ 300 పాయింట్ల పతనం


ముంబయి : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత వస్తువులపై 25 శాతం సుంకాలు, జరిమానా విధించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 296 పాయింట్లు లేదా 0.36 శాతం క్షీణించి 81,186కు పరిమితమయ్యింది. నిఫ్టీ 86.70 పాయింట్లు లేదా 0.35 శాతం తగ్గి 24,768 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో ఏకంగా 800 పాయింట్లకు పైగా పడిపోయింది. రోజంతా 81,803-80,695 మధ్య కదలాడింది. ట్రంప్ అధిక సుంకాలు ప్రధానంగా ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. మరోవైపు 2025 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరాశపర్చాయి. ఫార్మా, రియల్టీ, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల సూచీలు 1-1.5 శాతం మేర నష్టపోయాయి.



అక్టోబర్ 17న 'తెలుసు కదా' విడుదల

కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ, కథానాయికగా రాశీఖన్నా నటిస్తున్న చిత్రం 'తెలుసు కదా'. శ్రీనిధి శెట్టి మరో కథానాయిక. నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'మల్లికా గంధ'ను మల్లారెడ్డి ఉమెన్స్ కాలేజీలో మేకర్లు విడుదల చేశారు. తమన్ సంగీతాన్ని అందించారు. దర్శకురాలు నీరజా కోన, సినిమాటోగ్రాఫర్ జ్ఞాన శేఖర్ వి.ఎస్ ఈ ప్రేమ కథను తెరపై అద్భుతంగా మలుస్తున్నారు. దీపావళి కానుకగా అక్టోబర్ 17న ఈ సినిమా విడుదల కానుందని నిర్మాతలు తెలిపారు.

'హ్రీం' చిత్రం ప్రారంభం



పవన్ తాత, చమిందా వర్మ జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'హ్రీం'. రాజేష్ రావూరి ఈ చిత్రంతో దర్శకునిగా మారనున్నారు. శివమ్ మీడియా పతాకంపై సుజాత సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివమల్లాల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కథానాయకుడు సందీప్ కిషన్ గురువారం ఈ సినిమాకు క్లాప్‌నిచ్చి, ప్రారంభించారు. నటులు అలీ, బెనర్జీ, ఆడిటర్ విజయేంద్రరెడ్డి, సినిజోష్ అధినేత రాంబాబు పర్వతనేని దర్శకుడు రాజేష్‌కి స్క్రిప్ట్ అందించారు. నటులు రాజీవ్ కనకాల కెమెరా స్విచ్చాన్ చేశారు. సందీప్‌కిషన్ మాట్లాడుతూ తన తొలి చిత్రం నుండి ఈ చిత్ర నిర్మాతతో పరిచయం ఉందన్నారు. నటుడు అలీ మాట్లాడుతూ 'హ్రీం' చిత్ర నిర్మాతలు శివమల్లాల, సుజాత తనకు కుటుంబ సభ్యులని పేర్కొన్నారు.

'వార్ 2' నుంచి 'ఊపిరి ఊయలగా'

హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వార్ 2'. యష్‌రాజ్ బ్యానర్‌పై అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో కియారా అద్వానీ కథానాయికగా నటిస్తున్నారు. స్పై యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబో తున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసిన చిత్ర యూనిట్ తాజాగా 'ఊపిరి ఊయలగా' అంటూ సాగే పాటని విడుదల చేసింది. హృతిక్, కియారాల మధ్య వచ్చే ఈ సాంగ్ తెలుగు వర్షన్‌కి చంద్రబోస్ లిరిక్స్ అందించారు. శశ్వాంత్ సింగ్ పాడారు.



జ్వరంతో బాధపడుతున్న విద్యార్థి

మంచం పట్టిన విద్యార్థులు

- డోకిశిల ఆశ్రమ పాఠశాలలో జ్వరాల బెడద

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలంలోని డోకిశిల ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతిగృహ విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. జ్వరాలు, తలనొప్పి, వాంతులతో సుమారు 25 మంది విద్యార్థులు ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో సమీపంలో పిహెచ్‌సికి గురువారం తరలించారు. వైద్యులు ఐశ్వర్య వైద్య పరీక్షలు నిర్వహించి, పలువురు విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. పాఠశాలలో కేటాయించిన సిక్ రూమ్ మంచాలన్ని అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన విద్యార్థులతో నిండిపోయాయి. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల వద్ద ప్రత్యామ్నాయ సహాయకులను గాని, పర్యవేక్షణ అధికారులను గానీ, ఏర్పాట్లు గాని కనిపించకపోవడం విచారకరం. జ్వరంతో మంచాలపై ఉన్న విద్యార్థుల వైపు బాధ్యతగా ఏ ఒక్కరూ చూడడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం తరలించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

గోదావరి, రాయగడ ఎక్స్‌ప్రెస్ కోచ్‌ల సవరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి గోదావరి రాయగడ ఎక్స్‌ప్రెస్‌ల కోచ్‌ల కూర్పును సవరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 12728 హైదరాబాద్-విశాఖపట్నం గోదావరి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 29 నుండి, 12727 విశాఖపట్నం-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 30 నుండి సవరించిన కూర్పుతో నడుస్తాయని అధికారులు తెలిపారు. ఈ రైళ్లలో ఫస్ట్ క్లాస్ ఏసీ -1, 2వ ఏసీ-3, 3వ ఏసీ-6, స్లీపర్-6, జనరల్ సెకండ్ క్లాస్-4, సెకండ్ క్లాస్ కమ్ లగేజ్ (దివ్యాంగన్) కోచ్-1, జనరేటర్ మోటార్ కార్-1 కలుపుకుని మొత్తం 22 కోచ్‌లు ఉంటాయని వివరించారు. 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 1 నుండి, 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 2వ తేదీ నుంచి సవరించిన కూర్పుతో నడుస్తాయని తెలిపారు. సవరించిన కూర్పు ప్రకారం ఈ రైళ్లలో 3వ ఏసీ-3, స్లీపర్-12, జనరల్ సెకండ్ క్లాస్-3, సెకండ్ క్లాస్ కమ్ లగేజ్ (దివ్యాంగ్జన్) కోచ్-2 కలుపుకుని మొత్తం 20 కోచ్‌లు ఉంటాయని వివరించారు.

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను కలిసిన ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భేటీ అయ్యారు. గురువారం పార్లమెంట్‌లోని స్పీకర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాజకీయ అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఆ తరువాత కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తోనూ బాలకృష్ణ భేటీ అయ్యారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతులను మంత్రికి అందజేశారు. టిడిపి ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న పార్టీ అని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ పాటుపడుతోందని అన్నారు. గురువారం ముందుగా పార్లమెంట్ ఆవరణలో విజయనగరం ఎంపి అప్పలనాయుడు తాను రోజు పార్లమెంటుకు వచ్చే సైకిల్‌ను బాలకృష్ణకు చూపించారు. దీంతో బాలకృష్ణ కాసేపు సరదాగా ఆ సైకిల్ ఎక్కి ఫొటోలకు ఫోజులిచ్చారు.

సర్వాంగ సుందరంగా గండికోట టూరిజం

- మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్ (వైఎస్‌ఆర్ జిల్లా)

పర్యాటకంగా గండికోటను సర్వాంగ సుందరంగా నిర్మించబోతున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. వైఎస్‌ఆర్ జిల్లా గండికోటలో ఆయన గురువారం పర్యటించారు. గండికోటలోని జుమ్మా మసీదు, ధాన్యాగారం, పెన్నాలోయ, వ్యూ పాయింట్ తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమెరికాలో గ్రాండ్ కెన్యాన్ కంటే అందమైన సహజ సౌందర్యమైన లోయ గండికోటలో ఉందన్నారు. అద్భుత వారసత్వ సంపద గండికోటకు సొంతమని అన్నారు. పర్యాటకులు వచ్చి రెండు రోజులు పాటు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టూరిజం పాలసీతోపాటు పెట్టుబడిదారులను ఆకర్షిస్తూ అభివద్ధి పరుస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ శాస్కి స్కీమ్ ద్వారా మంజూరైన రూ.77.91 కోట్లతో గండికోట పర్యాటక ప్రాజెక్టు పనులకు సిఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. గండికోట పర్యాటక ప్రాంతానికి సమీపంలో ఒబెరాయ్ గ్రూప్ 5 స్టార్ హోటల్ పెట్టేందుకు ముందుకొచ్చిందని అన్నారు. ఆయన వెంట మంత్రి సవిత, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

నాడు నిర్మాణం.. నేడు పగుళ్లు..!

- హిందూపురంలో అర్బన్ హెల్త్ సెంటర్ల భవనాలు సురక్షితమేనా..?
- మూడేళ్లకే బీటలు వారిన గోడలు



ప్రజాశక్తి-హిందూపురం

గత ప్రభుత్వం 'నాడు-నేడు' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, ఆసుపత్రుల్లో ఆధునీకరణ పనులు చేయడంతో పాటు నూతన భవన నిర్మాణాలు చేపట్టింది. ఇందులో భాగంగా 'ఆయుష్మాన్ భారత్' కింద హిందూపురం పట్టణంలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణాలు చేపట్టింది. ఒక్కో భవనానికి రూ. 80 నుంచి రూ. 90 లక్షలు ఖర్చు చేసింది. అయితే ఇంజనీర్లు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై భవన నిర్మాణంలో చేతివాటం చూపించారు. దీంతో కాంట్రాక్టర్లు పనులు నాసిరకంగా చేయడంతో మూడేళ్లు కూడా గడవకముందే ఆయా భవనాల గోడలు నెర్రెలు చీలాయి. ఏ క్షణంలో ఏ గోడ కూలుతుందో అనే భయంతో అందులో పని చేసే వైద్య ఆరోగ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సత్యసాయి జిల్లాలోని అతిపెద్ద పట్టణం హిందూపురం పురపాలక సంఘం. పట్టణంలో ప్రజల సౌకర్యార్థం లక్ష్మీపురం, బోయపేట, శ్రీనివాస్ నగర్, ముదిరెడ్డిపల్లి, పళనీనగర్ ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో లక్ష్మీపురం, బోయపేటలో పాత భవనాలకు మరమ్మతులు చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో 2022 సంవత్సరంలో మిగిలిన మూడు ప్రాంతాల్లో ఒక్కో భవనానికి సుమారు రూ. 80 నుంచి 90 లక్షలు ఖర్చు చేసి నూతన భవన నిర్మాణాలు చేపట్టారు. ఈ భవనాలు ప్రారంభించిన ఏడాదికే పళనినగర్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ గోడలు బీటలు వారాయి. ఆ సమయంలో ప్రజాశక్తి దినపత్రికలో ప్రత్యేక కథనంతో సమస్యను వెలుగులోకి తీసుకురావడంతో గోడలకు సిమెంటు పూసి అధికారులు చేతులు దులిపేసుకున్నారు. మరో ఏడాదికి మళ్లీ ఆ గోడలు బీటలు వారాయి. ఆ సమయంలోనే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నిబంధనల మేరకు పనులు పూర్తయిన తర్వాత ఇంజనీర్లు భవనాల నాణ్యతను పరిశీలన చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే సంబంధిత అధికారులు కనీస నిబంధనలను కూడా పాటించకుండా కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా బిల్లులు మంజూరు చేశారు. దీంతో వందేళ్ల జీవితకాలం ఉండాల్సిన భవనాలు వంద నెలలు కూడా ఉండడం లేదు. నిర్మాణాలు పూర్తయిన ఏడాదికే కాంట్రాక్టర్ల డొల్లతనం బయట పడుతోంది. ప్రమాదవశాత్తూ అర్బన్ హెల్త్ సెంటర్లు కూలిపోతే వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు వైద్యం కోసం వచ్చిన రోగులు సైతం ప్రమాదం బారిన పడతారు. ప్రమాదాలు సంభవించక ముందే అధికారులు స్పందించి పట్టణంలో నిర్మాణం చేసిన మూడు అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవన నిర్మాణంలో అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్‌పై కూడా చర్యలు తీసుకొని, ప్రజాధనాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

తిరుమలలో రీల్స్ చిత్రీకరణపై టిటిడి హెచ్చరిక

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో అసభ్యకర వీడియోలు, వెకిలి చేష్టలతో రీల్స్ చేయరాదని యాత్రికులను టిటిడి హెచ్చరించింది. తిరుమల శ్రీవారి ఆలయం ముందు, మాఢవీధుల్లో ఇటీవల కొంతమంది వెకిలి చేష్టలు చేస్తూ, నృత్యాలు ప్రదర్శిస్తూ వీడియోలు (రీల్స్) చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నట్లు టిటిడి దృష్టికి రావడంతో పై విధంగా హెచ్చరించింది. తిరుమలలో కేవలం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకే పరిమితం కావాలని, శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది యాత్రికుల మనోభావాల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంది. టిటిడి విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారని, తిరుమల పవిత్రతను భంగం కలిగేలా వ్యవహరించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని టిటిడి హెచ్చరించింది.

చిత్రావతి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి - తాడిమర్రి

సత్యసాయి జిల్లా తాడిమర్రి మండల పరిధిలోని పెద్దకోట్ల పరివాహ ప్రాంతంలో నిర్మించిన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి దిగువకు నీటిని గురువారం విడుదల చేశారు. కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశాల మేరకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి రోజుకు 125 క్యూసెక్కులు చొప్పున ఒక గేటు ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతానికి వారం రోజులపాటు నీటిని దిగువకు విడుదల చేయాలని ఆదేశాలు ఇచ్చారని ఈ నీటి విడుదల ద్వారా మండలంలోని దాడి తోట తురక వారి పల్లి నాయన పల్లిలో తాగు, సాగునీటి సమస్య కొద్దిమేర తగ్గుతుందని అధికారులు తెలిపారు.

ఎన్‌సిడిసికి రూ.2వేల కోట్ల గ్రాంట్

- పిఎంకెఎస్‌వై వ్యయం రూ.6,520 కోట్లకు పెంపు
- కేంద్ర మంత్రి వర్గం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రూ.2 వేల కోట్ల వ్యయంతో నేషనల్ కోపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సిడిసి)కు గ్రాంట్-ఇన్-ఎయిడ్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో పలు ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మంత్రివర్గ వివరాలను మీడియాకు వెల్లడించారు. 2025-26 నుంచి 2028-29 వరకు నాలుగేళ్ల కాలానికి పథకం కోసం రూ.2 వేల కోట్లు (ఏటా రూ.500 కోట్లు) ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. నాలుగేళ్లలో ఎన్‌సిడిసి రూ.20 వేల కోట్లు సేకరిస్తుందని, ఈ నిధులను కొత్త ప్రాజెక్టులు, ప్లాంట్ల విస్తరణ, సహకార సంస్థలకు రుణాలు ఇవ్వడం, మూలధన అవసరాలను తీర్చేందుకు రుణాలు అందించేందుకు వినియోగిస్తుందని తెలిపారు. దీంతో 13,288 సహకార సంఘాల్లోని 2.9 కోట్ల మంది సభ్యులకు ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా పాడి పరిశ్రమ, పశువులు, మత్స్య సంపద, చక్కెర, వస్త్రాలు, ఆహార ప్రాసెసింగ్, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్ వంటి వివిధ రంగాలలో మహిళల నేతృత్వంలో సహకార సంస్థలు నడుస్తున్నాయన్నారు.

అలాగే, 15వ ఆర్థిక సంఘం (2021-22 నుంచి 2025-26 వరకు) కాలానికి కేంద్ర ప్రాయోజిత పథకం "ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన (పిఎంకెఎస్‌వై)" మొత్తం వ్యయాన్ని రూ. 6,520 కోట్లను పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. ఇందులో రూ.1,920 కోట్ల వ్యయాన్ని అదనంగా చేర్చినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

13 జిల్లాల్లో మల్టిట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినేట్ కమిటీ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు. ఈ ప్రాజెక్టులు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఒరిస్సా, జార్ఖండ్‌లోని 13 జిల్లాల్లో విస్తరించి ఉన్నాయని, ఈ ప్రాజెక్టులతో సుమారు 574 కిలో మీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్ విస్తరిస్తుందని తెలిపారు. ఇటార్సీ, నాగ్‌పూర్ మధ్య నాలుగో లైన్ ఏర్పాటు, ఔరంగాబాద్ (ఛత్రపతి సంభాజీనగర్) - పర్భాని డబ్లింగు, అలువాబాడీ రోడ్డు-న్యూ జల్‌పాయిగుడీ మూడో, నాలుగో లైన్, డంగోపోసీ-జారోలీ మూడో, నాలుగో లైన్ ప్రాజెక్టుల ఉన్నాయని అన్నారు. ఈ ప్రాజెక్టుల మొత్తం అంచనా ఖర్చు దాదాపు రూ.11,169 కోట్లని, 2028-29 కల్లా పూర్తి అవుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులతో సుమారు 2 .29 కోట్ల పనిదినాల మేరకు ప్రత్యక్ష ఉపాధి కల్పన జరుగుతుందన్నారు.

ఉక్రెయిన్‌లో ఆకాశమే హద్దుగా అవినీతి

- ప్రజాందోళనలతో దర్యాప్తు సంస్థలకు స్వేచ్ఛ



కీవ్ : ఉక్రెయిన్‌లో అవినీతి నిరోధక దర్యాప్తు సంస్థలకు స్వతంత్రతను, స్వేచ్ఛను పునరుద్ధరిస్తూ అక్కడి పార్లమెంటులో గురువారం ఒక బిల్లును ఆమోదించారు. అమెరికా ఉసిగొల్పడంతో రష్యాపై యుద్ధానికి కాలుదువ్విన ఉక్రెయిన్ అప్పటి నుంచి పీకల్లోతు కష్టాల్లో చిక్కుకొని విలవిల్లాడుతోంది. రాజకీయంగా తీవ్ర సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. వీటిని ఆసరా చేసుకొని అక్కడి పాలక పెద్దలు అవినీతి సామ్రాజ్యాన్ని నిర్మించారు. రష్యాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలతో అక్కడి దర్యాప్తు సంస్థలకు చెందిన పలువురు అధికారులను ఉక్రెయిన్ ప్రభుత్వం అరెస్టు చేయించింది. అనేక ఆంక్షలు విధించి దర్యాప్తు సంస్థల చేతులు కట్టేసింది. ఈ పరిణామాలతో అవినీతి, అక్రమాలు ఆకాశమే హద్దుగా పెరిగిపోయాయి. దీంతో ఉక్రెయిన్ ప్రజానీకం అధ్యక్షులు వ్లాదిమిర్ జెలెన్ స్కీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించారు. లక్షలాది మంది ప్రజానీకం వీధుల్లోకి వచ్చి దర్యాప్తు సంస్థలకు స్వతంత్రత కల్పించాలని ప్రదర్శనలు చేపట్టారు. దర్యాప్తు సంస్థలను స్వతంత్రగా నడవనివ్వాలని, రాజకీయ జోక్యం లేకుండా వాటికి పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టారు. కీవ్, ఎల్‌వివ్, డినిప్రో, ఒడెసా నగరాల్లో మంగళవారం, బుధవారం కూడా భారీ ప్రదర్శనలు నిర్వహించారు. జెలెన్ స్కీ పాలన అవినీతి సామ్రాజ్యంగా మారిందని నినదించారు. దర్యాప్తు సంస్థలకు స్వేచ్ఛ కల్పించి అవినీతిని నివారించాలని డిమాండ్ చేశారు. దీంతో యూరోపియన్ యూనియన్ (ఇయు) దేశాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు కూడా ఇదే డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో తలొగ్గిన జెలెన్ స్కీ ప్రభుత్వం..దర్యాప్తు సంస్థలకు స్వతంత్రతను, స్వేచ్ఛను పునరుద్ధరిస్తూ బిల్లులను ప్రవేశపెట్టింది. కొత్త చట్టం ద్వారా ప్రాసిక్యూటర్ జనరల్‌కు నేషనల్ యాంటీ కరప్షన్ బ్యూరో (ఎన్ఎబియు), స్పెషలైజ్డ్ యాంటీ కరప్షన్ ప్రాసిక్యూటర్స్ ఆఫీస్ (ఎస్‌ఎపిఒ) సంస్థలపై నియంత్రణ, దర్యాప్తులకు ఆదేశించే అధికారం లభిస్తుంది.

నిర్లక్ష్యపు వైద్యానికి రూ.17 లక్షల జరిమానా

ప్రజాశక్తి-విశాఖ లీగల్

వ్యాధి నిర్ధారణ చేయకుండా చికిత్స చేసి మహిళ మృతికి కారణమయ్యారనే అభియోగంతో వైద్యులకు రూ.17లక్షల పరిహారం చెల్లించాలని విశాఖ జిల్లా వినియోగదారుల కమిషన్ 2 అధ్యక్షురాలు జి వెంకటేశ్వరి, సభ్యులు పి విజయదుర్గ, కరకు రమణబాబు గురువారం తీర్పునిచ్చారు. వైద్యానికి మృతురాలి కుటుంబ సభ్యులు చెల్లించిన రూ.1,70, 443లను 24 శాతం వడ్డీతో 2017 ఫిబ్రవరి 9వ తేదీ నుంచి చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు తీర్పులో పేర్కొన్నారు. కోర్టు ఖర్చులు కింద మరో రూ.ఐదు వేలు ఇవ్వాలని స్పష్టం చేశారు.మృతురాలి లావేటి ఢిల్లీ రావు తెలిపిన వివరాలివి. లావేటి మహేశ్వరికి 2017 ఫిబ్రవరి నెలలో కడుపులో నొప్పి రావడంతో స్థానిక వైద్యుడు డాక్టర్ జి శ్రీధర్‌ను సంప్రదించారు. కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమని కంచరపాలెం సన్‌రైజ్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ తనూజ ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. వ్యాధి నిర్ధారణ సక్రమంగా చేయకుండా అందించిన వైద్యసేవలతో మహేశ్వరి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో చివరకు నగరంలోని ఓమ్ని ఆర్కే ఆసుపత్రిలో ఆపరేషన్ చేసినా రోగి మృతి చెందింది. తనకు జరిగిన అన్యాయంపై మృతురాలి భర్త ఢిల్లీరావు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా, విచారణ తర్వాత అభియోగాలపై నిర్ధారణకు వచ్చిన కమిషన్ అధ్యక్షురాలు, సభ్యులు ఈ మేరకు తీర్పుచెప్పారు.

జైలు నుంచి గిరిజన మహిళల విడుదల

అరెస్టులతో ఉద్యమం ఆపలేరు: జెఎసి

ప్రజాశక్తి- ఉలవపాడు (నెల్లూరు)

నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లిన ముగ్గురు గిరిజన మహిళలు గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. వారు తమ స్వగ్రామం రామకృష్ణాపురానికి చేరుకోగానే కరేడు గ్రామస్తులు, జెఎసి, వామపక్షాల నేతలు స్వాగతం పలికారు. ఉద్యమకారులపై ప్రభుత్వ నిర్బంధ కాండను ఆపాలని, బలవంతపు భూ సేకరణ ఆపాలని, గో బ్యాక్ ఇండోసోల్- సేవ్ కరేడు అంటూ పెద్ద ఎత్తున నినదించారు. అనంతరం రామకృష్ణాపురంలో ఉద్యమకారులతో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జివిబి కుమార్ అధ్యక్షత వహించారు. కరేడు భూ సేకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బత్తుల వెంకటరమణారెడ్డి, మిరియం శ్రీనువాసులు, వామపక్ష పార్టీల నేతలు కే నాంచార్లు, బూసి సురేష్ బాబు, జెఎసి నాయకులు మాట్లాడారు. ఎన్ని కేసులు పెట్టినా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని, ఇది ఆరంభం మాత్రమేనని, రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా మారకముందే ప్రభుత్వం బలవంతపు భూసేకరణను విరమించు కోవాలన్నారు. జైలు నుంచి విడుదలైన గిరిజన మహిళలు మాణికల శిరీష, కత్తి లలితమ్మ, మాణికల సుజాత మాట్లాడుతూ.... తాము అరెస్ట్ అయిన దగ్గర నుంచి బయటకు వచ్చినంత వరకూ కృషిచేసిన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా ఉద్యమం నుంచి వెనక్కి తగ్గేదేలేదన్నారు.

గాజాలో కరువు రక్కసి బారిన చిన్నారులు !

- పోషకాహార లోపంతో కృంగి కృశిస్తున్న బాలలు
- 90మంది పిల్లలతో సహా 159మంది మృతి

గాజా : గాజాలో గత 24గంటల్లో ఇజ్రాయిల్ దాడుల్లో 111మంది పాలస్తీనియన్లు మరణించారు. 820మందికిపైగా గాయపడ్డారు. వీరిలో 91మంది ఆహార పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన దాడుల్లో మరణించిన వారేనని ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. గురువారం ఆకలి దప్పులతో ఇద్దరు పిల్లలు మరణించారని వైద్య వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పటివరకు కరువు కాటకాలతో మరణించిన వారి సంఖ్య 159కి చేరింది. వీరిలో 90మంది పిల్లలే వున్నారు. గాజాలో కొత్తగా జన్మిస్తున్న పిల్లలందరూ తక్కువ బరువుతో వుంటున్నారని, పోషకాహార లోపం వల్ల వారు సరిగా ఎదగడం లేదని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. ఇటువంటి ఆందోళనకర పరిస్థితుల్లో గాజాలోకి ప్రతిరోజూ వందలాదిగా ఆహార ట్రక్కులు రావాలని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) ప్రతినిధి అద్నన్ అబూ హస్నా పేర్కొన్నారు. కాల్పుల విరమణ జరిగితేనే గాజాలో మానవతా సంక్షోభం పరిష్కారమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. గాజా ప్రజలకు ఆహారం అందాలంటే ఆహార ట్రక్కులు కూడా సురక్షితంగా చేరాలని, అందుకు ఇజ్రాయిల్ సహకరించాలని అన్నారు. గాజాకు అందే ఆహార సాయం ముందుగా ఐక్యరాజ్య సమితి గిడ్డంగులకు చేరితే, అక్కడ నుండి పంపిణీ కేంద్రాల వద్దకు చేరుతుందని అన్నారు. గాజాలో మంచినీటి శుద్ధి కేంద్రాలను నాశనం చేశారు. దీంతో తాగు నీరు కలుషితమై వ్యాధులు వ్యాపిస్తున్నాయి.

అంగోలాలో నిరసనలు...

- పెరిగిన ఇంధన ధరలు
- టాక్సీ, మినీ బస్ డ్రైవర్ల ఆందోళన హింసాత్మకం
- 22 మంది మృతి, అనేక మందికి గాయాలు

లువాండా : ఆఫ్రికన్ దేశం అంగోలా రిపబ్లిక్‌లో ఇంధన ధరలు తగ్గించాలని టాక్సీ, మినీ బస్ డ్రైవర్ సంఘాలు తలపెట్టిన సమ్మె హింసాత్మకంగా మారింది. దీనిలో 22 మంది సాధారణ పౌరులు, ఒక పోలీస్ అధికారి మృతి చెందారని, అనేక మందిని అరెస్ట్ చేశామని గృహ శాఖామంత్రి మాన్యువల్ హోమెమ్ గురువారం ప్రకటించారు. అధ్యక్షుడు జోవో లౌరెంవో ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరిస్తుందని ప్రతిపక్షాలు విమర్శించాయి..

నిరసనలు ఎలా మొదలయ్యాయి :

జోవో లౌరెంవో అంగోలా అధ్యక్షుడుగా ఎన్నికైనప్పటి నుండి ప్రపంచీకరణ విధానాలను విస్తృతంగా అమలు జరిపారు. ఫలితంగా పేదరికం, ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయి. ఆఫ్రికాలో రెండోవ అతి పెద్ద చమురు ఉత్పత్తి దేశమైనప్పటికి అప్పుల ఊబిలోకి కూరుకుపోయి అనేక ఆర్థిక సవాళ్లను ఎదుర్కోంటుంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ షరతులకు లోంగి ఇంధనంపై సబ్సిడిని తొలగించింది. దీంతో చమురు ధరలు లీటరు 400 క్వాంజాలకు పెరిగిపోయింది..నిత్యావసరాల ధరలూ పెరిగాయి. దీన్ని వ్యతిరేకిస్తు డ్రైవర్లు సమ్మెబాట పట్టారు. ఈ నిరసనల్లో సాధారణ ప్రజలు భాగస్వామ్యం అయ్యారు. రాజధాని లువాండాలో ప్రారంభమైన ఆందోళనలు క్రమంగా దేశమంతా వ్యాపించాయి..లూటీలు జరిగాయనే పేరుతో ప్రభుత్వం శాంతియుత ఆందోళనలు అణిచేస్తుందని హ్యూమన్ రైట్స్ వాచ్ ఆరోపించింది.



అలల తాకిడితో కోతకు గురైన తీరం

సునామీ ఎఫెక్ట్

- అప్రమత్తమైన అధికారులు
- తీర మండలాల్లో మాక్ డ్రిల్

ప్రజాశక్తి -పూసపాటిరేగ (విజయనగరం)

రష్యా, జపాన్, అమెరికాలో సునామీ హెచ్చరికలు... జపాన్‌లో భూకంపం రిక్టార్ స్కేల్‌పై 8.8 తీవ్రతతో నమోదైన నేపథ్యంలో విజయనగరం జిల్లా తీర ప్రాంతం ముఖ్యంగా భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. సునామీ వస్తే తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించా లన్న దానిపై మాక్ డ్రిల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గురువారం పూసపాటిరేగ, భోగాపురం తహశీల్దార్ విఆర్‌ఒలతో అత్యవసర సమావేశం జూమ్‌లో ఏర్పాటు చేశారు. సునామీ వస్తే పరిస్థితి ఏంటని అడిగి తెలుసుకున్నారు. వెంటనే తీర గ్రామాల్లో పరిస్థితిని నమోదు చేసుకోవా లన్నారు. సముద్రానికి ఏయే గ్రామాలు దగ్గరలో ఉన్నాయని, వాటి పరిస్థితి తెలియ జేయాలన్నారు. తహశీల్దార్‌లు తీరప్రాంత విఆర్‌ఒలకు స్పష్టమైన మార్గదర్శకాలు అందజేశారు. వాటిలో ముఖ్యంగా సునామీ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి, తీర గ్రామాలలో ఉన్న ప్రజలకు వెంటనే దండోరా వేయడంతో పాటు సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించే మార్గాలు సిద్ధంగా ఉంచాలని, మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లవద్దని ముందుగానే తెలియజేయడానికి కావాల్సిన ఏర్పాట్లతో పాటు స్థానికంగా ఉన్న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హాల్స్ లాంటి వనరులను ఉపయోగించుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలుకు ఎంటువంటి భయాందోళనలు కలగజేయకుండా ఇది మాక్ డ్రిల్ మాత్రమే అని చెప్పాలని తహశీల్దార్ ఎన్‌వి రమణ విఆర్‌ఒలకు తెలిపారు.

'పోలవరం-బనకచర్ల' ప్రతిపాదనలను ఇఎసి తిప్పిపంపింది

- రాజ్యసభలో వెల్లడించిన కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ (పిబిఎల్‌పి) కోసం పర్యావరణ ప్రభావ అంచనా(ఇఐఎ) అధ్యయనాన్ని చేపట్టడానికి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టిఒఆర్) మంజూరు చేయాలని కోరుతూ జూన్ 5న ఏపి ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ ప్రతిపాదనలపై నది లోయ, జల విద్యుత్ ప్రాజెక్టుల నిపుణుల అంచనా కమిటీ (ఇఎసి) జూన్ 17న జరిగిన సమావేశంలో చర్చించినట్లు తెలిపింది.

ప్రతిపాదనలను తిప్పిపంపినట్లు వెల్లడించింది. ఈ వివరాలను గురువారం రాజ్యసభలో అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాతపూర్వక సమాధానంలో తెలిపారు. ఇఎసి మీటింగ్‌లో ఏపి ప్రభుత్వానికి పలు సిఫారసులు చేసినట్లు చెప్పారు. పర్యావరణ ప్రభావ అంచనా(ఇఐఎ) నిర్వహించడానికి కావాల్సిన టిఒఆర్ రూపొందించడానికి ప్రతిపాదనలు సమర్పించే ముందు అంతరాష్ట్ర సమస్యల పరిశీలన, అవసరమైన క్లియరెన్స్/నో అబ్జక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఒసీ) మంజురు చేయడానికి సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి)ను సంప్రదించాలని సూచించనట్లు చేసినట్లు తెలిపారు. పైన చెప్పిన విధంగా నూతన ప్రతిపాదనలు పంపాలని ఏపి ప్రభుత్వానికి ఇఎసి ప్రతిపాదనలను తిప్పి పంపినట్లు కేంద్ర మంత్రి సమాధానంలో పేర్కొన్నారు.

బ్రెజిల్ న్యాయమూర్తిపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్ : మాజీ అధ్యక్షుడు జెయిర్ బోల్సొనారోపై వచ్చిన ఆరోపణలను విచారిస్తున్న బ్రెజిల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలగ్జాండర్ డి మొరాయస్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. బోల్సొనారోను నిర్బంధించాలని విచారణకు ముందే ఆదేశాలు జారీ చేశారని, భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారని ఆయనపై ఆరోపణలు గుప్పించింది. 2022లో జరిగిన బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల ఫలితాలు తనకు వ్యతిరేకంగా రావడంతో బోల్సొనారో కుట్రకు పాల్పడ్డారని, అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నించారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. వీటిపై మొరాయస్ నేతృత్వంలోని న్యాయమూర్తుల బృందం విచారణ జరుపుతోంది. బ్రెజిల్ వస్తువులపై యాభై శాతం సుంకం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. తన స్నేహితుడైన బోల్సొనారోను వేధించకుండా నిలువరించేందుకే బ్రెజిల్‌పై టారిఫ్ విధించానని ఆయన గొప్పగా చెప్పుకున్నారు. గ్లోబల్ మాగ్నిట్‌స్కై చట్టం కింద మొరాయస్‌పై విధించిన ఆంక్షల ప్రకారం...మానవ హక్కులకు భంగం కలిగించిన, అవినీతి చరిత్ర ఉన్న విదేశీయులపై ఆర్థికపరమైన జరిమానాలు విధిస్తారు. అమెరికాను, బ్రెజిల్ పౌరులను, కంపెనీలను చట్టవిరుద్ధంగా వేధించడానికి మొరాయస్ తనకు తానుగా కేసు విచారణ చేపట్టారని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆరోపించారు. సెన్సార్‌షిప్ విధించారని, బోల్సొనారో నిర్బంధానికి ఏకపక్షంగా ఆదేశాలు ఇచ్చారని, ఇలా చేయడం మానవ హక్కులకు భంగకరమని ఆయన చెప్పారు.

ఆంక్షల కారణంగా మొరాయస్‌కు అమెరికాలో ఉన్న ఆస్తులను ఫ్రీజ్ చేశారు. ఆయనతో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించకుండా అమెరికన్లపై నిషేధం విధించారు. అమెరికా ఆంక్షలపై బ్రెజిల్ సుప్రీంకోర్టు కానీ, మొరాయస్ కానీ ఇంకా స్పందించలేదు.

పాక్‌లో అపార చమురు నిల్వలు

- భారత్‌కు ఏదో రోజు చమురు అమ్మగలదు
- మేం ఒప్పందం చేసుకుంటున్నాం
- ట్రంప్ వ్యాఖ్యలు

వాషింగ్టన్ : పాకిస్థాన్‌లో చమురు నిల్వలు అపారంగా ఉన్నాయని, తాము ఆ దేశంతో చమురు ఒప్పందం చేసుకుంటాన్నామని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ గురువారం తెలిపారు. పాక్ ఏదో ఒక రోజు భారత్‌కు చమురు అమ్మగలదేమో అని ఆయన వ్యాఖ్యానించారు. సామాజిక మాధ్యమాల్లో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. 'శ్వేతసౌధంలో వాణిజ్య ఒప్పందాలతో తీరిక లేకుండా ఉన్నాం. అమెరికాకు అత్యంత సంతోషం కలిగించే చాలా దేశాల అధినేతలతో చర్చలు జరుపుతున్నాం. ఈ రోజు మధ్యాహ్నమే దక్షిణ కొరియా వాణిజ్య బృందంతో సమావేశం నిర్వహించాం. అలాగే పాకిస్థాన్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాం. అక్కడున్న అపార చమురు నిల్వలను వెలికి తీసేందుకు ఇరు దేశాలు కలిసి పని చేస్తాయి. అయితే మా భాగస్వామ్యాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లగలిగే చమురు కంపెనీ కోసం అన్వేషణ మొదలైంది. ఎవరికి తెలుసు ఏదొక రోజు వాళ్లు (పాక్) భారత్‌కు కూడా చమురు అమ్ముతారేమో!' అని ట్రంప్ పేర్కొన్నారు.

భారత చమురు కంపెనీలపై అమెరికా ఆంక్షలు

- ఇతర దేశాల సంస్థలపై కూడా...
- ఇరాన్ నుంచి 'పెట్రో' ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నాయని నెపం



వాషింగ్టన్ : మిత్రదేశం, శత్రుదేశం అనే తేడా లేకుండా అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా సుంకాల బాదుడు, ఆంక్షల మోతతో పెట్రేగిపోతున్నారు. తన శత్రు దేశాలతో వ్యాపారం చేస్తున్న దేశాలు తనకు మిత్ర దేశాలైనా సరే ఆయన సహించలేకపోతున్నారు. ఈ క్రమంలో భారత్‌పై ట్రంప్ ప్రభుత్వం ఆంక్షల కత్తి దూస్తోంది. తనకు చాలా సన్నిహిత మిత్రదేశమంటూనే ఈ ఆంక్షలు విధించడం గమనార్హం. రష్యా నుంచి ఆయుధాలు, చమురును కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై అమెరికా 25 శాతం పైగా సుంకం విధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇరాన్ నుంచి పెట్రోలియం, పెట్రో కెమికల్ ఉత్పత్తులను దిగుమతి చేసుకొని మార్కెటింగ్ చేస్తున్నారన్న ఆరోపణపై ఆరు భారత కంపెనీలపై అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. ఇరాన్ చమురుతో వ్యాపారం చేస్తున్న వివిధ దేశాలకు చెందిన 20 సంస్థలను అమెరికా విదేశాంగ శాఖ లక్ష్యంగా చేసుకుంది. ఈ కంపెనీలు అనేక మిలియన్ డాలర్ల విలువ కలిగిన ఇరాన్ పెట్రోకెమికల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నాయని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది.

'చమురు విక్రయం ద్వారా ఇరాన్ పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చుకుంటోంది. వాటితో మధ్యప్రాచ్యంలో ఘర్షణలు, అస్థిరతకు ఆజ్యం పోస్తోంది. తన ప్రజలతో పాటు ప్రపంచ దేశాలను అణచివేసేందుకు ఉగ్ర ముఠాలకు ఆర్థిక సాయం చేస్తోంది. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌పై ఒత్తిడి తేవడానికి కఠిన చర్యలు చేపట్టాం. ఇరాన్ పెట్రోలియం, పెట్రోకెమికల్స్ ఉత్పత్తులతో వ్యాపారం చేస్తున్న వివిధ దేశాలకు చెందిన 20 కంపెనీలపై ఆంక్షలు విధిస్తున్నాం' అని అమెరికా విదేశాంగ శాఖ తెలియజేసింది.

ఆంక్షల జాబితాలోని కంపెనీలు ఇవే

భారత్‌తో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, తుర్కియే, ఇండోనేషియా దేశాలకు చెందిన కంపెనీలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ నుంచి పెట్రోలియం, పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేయాలని అనుకునే వారు తాము విధించే ఆంక్షలను ఎదుర్కోక తప్పదని, అంతేకాక తమతో వ్యాపారం చేసే అవకాశాన్ని కూడా కోల్పోతారని హెచ్చరించింది. అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటున్న భారతీయ కంపెనీలలో అల్ కెమికల్ సొల్యూషన్స్, రమణిక్‌లాల్ ఎస్ గోసాలియా అండ్ కంపెనీ, జ్యూపిటర్ డై కెమ్ ప్రైవేట్ లిమిటెడ్, గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్స్ లిమిటెడ్, పర్సిస్టెంట్ పెట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి.

అమెరికా చెబుతున్న దాని ప్రకారం...అల్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గత సంవత్సరం ఇరాన్ నుంచి 84 మిలియన్ డాలర్ల విలువ కలిగిన పెట్రోకెమికల్స్ వస్తువులను దిగుమతి చేసుకుంది. గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్స్ లిమిటెడ్ కంపెనీ గత ఏడాది జూలై నుంచి ఈ సంవత్సరం జనవరి వరకూ 51 మిలియన్ డాలర్ల విలువైన మెంథాల్, ఇతర పదార్థాలను కొనుగోలు చేసింది. జ్యూపిటర్ డై కెమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇదే కాలంలో టోలుయిాన్ సహా 49 మిలియన్ డాలర్ల విలువైన వివిధ వస్తువులను ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. రమణిక్‌లాల్ ఎస్ గోసాలియా అండ్ కంపెనీ ఇరాన్ నుంచి 22 మిలియన్ డాలర్ల విలువైన మెంథాల్, టోలుయిాన్‌ను కొనుగోలు చేసింది. పర్సిస్టెంట్ పెట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గత సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో 14 మిలియన్ డాలర్ల విలువైన మెంథాల్‌ను దిగుమతి చేసుకుంది. వీటితో పాటు కాంచన్ పాలిమార్స్ కంపెనీ 1.3 మిలియన్ డాలర్ల విలువైన పాలిథిన్‌ను ఇరాన్ నుంచి కొనుగోలు చేసింది.

ఆంక్షల ప్రభావమేంటి?

ఆంక్షల నేపథ్యంలో ఆ కంపెనీలు, వాటి యజమానులకు అమెరికాలో కానీ, దాని నియంత్రణలో ఉన్న దేశాలలో కానీ ఆస్తులు ఉన్నట్లయితే వాటిని ఫ్రీజ్ చేస్తారు. అంతేకాదు...అమెరికా పౌరులు, కంపెనీలు వాటితో వ్యాపారం చేయకూడదు. వాటికి సంబంధించిన లావాదేవీలన్నింటినీ నిషేధిస్తారు. ఆంక్షలు విధించిన కంపెనీల తరపున ఇతర దేశాలలో వ్యాపారం చేస్తున్న సంస్థలపై కూడా నిషేధం విధిస్తారు. ఉదాహరణకు యూఏఈలోని బర్నా ట్రేడింగ్ ఎల్ఎల్‌సీ అనే కంపెనీ పర్సిస్టెంట్ పెట్రోకెమ్‌తో కలిసి పనిచేస్తోంది. దీంతో అమెరికా ఆంక్షలు బర్నా ట్రేడింగ్ ఎల్ఎల్‌సీకి కూడా వర్తిస్తాయి. ఇరాన్‌పై సాధ్యమైనంత ఎక్కువ ఒత్తిడి తెచ్చేందుకే ఈ ఆంక్షలు విధించామని అమెరికా చెబుతోంది. ఇరాన్ నుంచి చమురు, పెట్రోకెమికల్ ఉత్పత్తులను ఎగుమతి చేసే నౌకలు, వ్యాపారులు, బ్రోకర్లు...ఇలా అందరిపై నిఘా ఉంచుతారు. ఈ చర్యలు ఇరాన్‌ను శిక్షించేందుకు తీసుకుంటున్నవి కావని, దాని ప్రవర్తనలో సానుకూల మార్పు తీసుకురావడమే తమ ఉద్దేశమని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది.

ఈ కంపెనీలపై కూడా...

ఇరాన్‌తో భారత్‌కు చాలా కాలంగా వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా మన దేశం ఇరాన్ నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది. అయితే 2019లో అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఆ దేశం నుంచి చమురు దిగుమతులను భారత్ తగ్గించుకుంది. అయినప్పటికీ రెండు దేశాల మధ్య వ్యాపార సంబంధాలు కొనసాగుతున్నాయి. అమెరికా తాజాగా విధించిన ఆంక్షలు భారతీయ కంపెనీలకే పరిమితం కావడం లేదు. టర్కీ, చైనా, ఇండోనేషియా, యూఏఈ కంపెనీల పైన కూడా అమెరికా ఆంక్షలు విధించింది. వీటిలో అనేక కంపెనీలకు భారత్‌తో సంబంధాలు ఉన్నాయి. ఉదాహరణకు యూఏఈలోని టియోడార్ షిప్పింగ్ ఎల్ఎల్ఈకి అనుబంధంగా ఉన్న కోరా లైన్స్ కంపెనీని ఓ భారతీయుడు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఈ కంపెనీ కూడా అమెరికా ఆంక్షలకు గురవుతోంది.

రోహింగ్యాలు శరణార్థులా? చొరబాటుదారులా?

- ముందు తేల్చాల్సింది ఇదేనన్న సుప్రీం



న్యూఢిల్లీ : రోహింగ్యాలు శరణార్థులా? లేక అక్రమ చొరబాటుదారులా? అనే ప్రశ్నపై సవివరంగా విచారించాలని సుప్రీం కోర్టు గురువారం నిర్ణయించింది. ఈ కేసును సవివరంగా విచారించేందుకు మూడు రోజులు కేటాయించనున్నట్లు జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వాన గల త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రశ్నకు అధికారికంగా సమాధానం ఇచ్చినట్లైతే, ఇక పర్యవసానాలన్నీ ఆటోమేటిక్‌గా సాగుతాయని అన్నారు. దేశ రాజధానిలోని శిబిరాల్లో నివసిస్తున్న రోహింగ్యాలు లేవనెత్తిన ప్రాథమిక ప్రశ్నలను కోర్టు నమోదు చేసింది. ఒకవేళ శరణార్థులుగా వారిని ప్రకటించినట్లైతే భారత్‌లో రోహింగ్యాలకు అందుబాటులో వున్న రక్షణలేంటి ?, ఒకవేళ వారు శరణార్థులు కాదు, అక్రమ చొరబాటుదారులైతే వారిని తరలించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సమర్థనీయమేనా అనే ప్రశ్నలను పిటిషనర్లు లేవనెత్తారు. వారి తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సీనియర్ న్యాయవాది కొలిన్ గొంజాలెజ్‌లు వున్నారు. ఈ పిటిషన్లలో కొన్ని 2013 నాటివి కూడా వున్నాయి. అస్సాం వంటి రాష్ట్రాల్లో వారిని విదేశీయులుగా ప్రకటించిన సుదీర్ఘకాలం వారిని నిర్బంధంలో వుంచడాన్ని భూషణ్ తన పిటిషన్‌లో ప్రస్తావించారు. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన వారిలో పాటూ ఎవరినైనా నిరవధికంగా నిర్బంధించవచ్చా? అని ప్రశ్నించారు.

రోహింగ్యా శిబిరాల్లో అందుబాటులో వున్న మౌలిక వసతులేమిటి, వారి జీవన పరిస్థితులేమిటిఅనే అంశాలపై కూడా కోర్టు విచారించనుంది. ముందుగా అసలు వారు శరణార్థులా లేదా అక్రమ చొరబాటుదారులా అనేది తేల్చాల్సి వుందని, ఇక మిగిలినవన్నీ దాని ప్రకారమే అవుతాయని జస్టిస్ కాంత్ వ్యాఖ్యానించారు.

ఎన్‌డిఎకు పన్నీర్ సెల్వం గుడ్‌బై

చెన్నయ్ : బిజెపి నేతృత్వ ఎన్‌డిఎకి తమిళనాట గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం (ఒపిఎస్) ఎన్‌డిఎ నుంచి వైదొలిగారు. ఈ మేరకు గురువారం నాడు మాజీ మంత్రి, సెల్వంకు అత్యంత సన్నిహితుడైన రామచంద్రన్ ప్రకటించారు. ఆయన ప్రకటిస్తున్న సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. గురువారం మార్నింగ్ వాక్ సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. పలు విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎన్‌డిఎ నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఎన్‌డిఎతో పూర్తిగా సంబంధాలు తెంచుకున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పన్నీర్ సెల్వం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. పొత్తుల గురించి ఇప్పుడు ప్రస్తావించాల్సిన సమయం కాదని, ఎన్నికల ముంగిట ఆ అంశం గురించి మాట్లాడతామని అన్నారు. మరోవైపు ఇటీవల సినీనటుడు విజయ్ ప్రారంభించిన తమిళ వెట్రి కళగ (టివికె)తో ఒపిఎస్ చేతులు కలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పన్నీర్ సెల్వాన్ని విలేకరులు పొత్తుల అంశం గురించి ప్రస్తావించగా.. కాలమే చెబుతుంది అంటూ.. సమాధానం దాటవేశారు. పన్నీర్ సెల్వం ఒకానొక సమయంలో అన్నాడిఎంకె (ఎఐఎడిఎంకె)లో కీలకంగా వ్యవహరించారు. ఎన్‌డిఎ లోనూ ముఖ్యపాత్ర పోషించారు. అయితే సమగ్ర శిక్షా అభియాన్ కింద తమిళనాడుకు ఇవ్వాల్సిన రూ.2,151 కోట్లను విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం తొక్కి పెడుతోందని పన్నీర్ సెల్వం ఇటీవల విమర్శించారు. త్రిభాషా సూత్రాన్ని అనుమతించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించడం వల్లనే కేంద్రం నిధుల విడుదలను ఆపేసిందని ఆరోపించారు. ఇది విద్యా హక్కు చట్టానికి, సమాఖ్య సూత్రానికి విరుద్ధమని చెప్పారు. కాగా ప్రధాని గత నెల 26 నుంచి 28వ తేదీ వరకూ తమిళనాడులో పర్యటించినప్పుడు ఆయనను కలిసేందుకు పన్నీర్‌సెల్వం నిరాకరించారు. పన్నీర్‌సెల్వం గత లోక్‌సభ ఎన్నికలలో ఎన్డీఏ బ్యానర్ కింద స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తనకు ఎన్డీఏలో తగిన గౌరవం దక్కడం లేదని ఆయన కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ఎన్‌డిఎ నుంచి కూడా బయటకు రావడం.. 2026 అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఎలక్టోరల్ కాలేజీ జాబితా సిద్ధం

న్యూఢిల్లీ : ఉప రాష్ట్రపతి పదవికి ఎన్నిక నిర్వహించేందుకు వీలుగా ఎలక్టొరల్ కాలేజీ జాబితాను సిద్ధం చేశామని ఎన్నికల కమిషన్ గురువారం తెలిపింది. 'ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం ఎలక్టొరల్ కాలేజీ జాబితాను ఖరారు చేశాం. ఉభయసభలలో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతం ఆధారంగా అక్షర క్రమంలో సభ్యుల పేర్లను వరుసగా ఇవ్వడం జరిగింది' అని ఈసీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పత్రికా ప్రకటనను పోస్ట్ చేసింది. అనారోగ్య కారణాలను చూపుతూ గత నెల 21న జగదీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ధన్‌ఖడ్ రాజీనామా చేసిన రెండు రోజుల తర్వాత తదుపరి ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం ఈసీ కసరత్తు ప్రారంభించింది.

ఇదిలావుండగా ఉప రాష్ట్రపతి పదవి కోసం ఎన్డీఏ పలువురు నేతల పేర్లను పరిశీలిస్తోంది. వీరిలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఉన్నారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్ హరివంశ్ నారాయణ్ సింగ్ పేరు కూడా వినిపిస్తోంది. ధన్‌ఖడ్ రాజీనామా కారణంగా ప్రస్తుతం రాజ్యసభ కార్యకలాపాలను హరివంశ్ పర్యవేక్షిస్తున్నారు

.పాలస్తీనాను గుర్తిస్తాం : కెనడా

ఒట్టావా : పాలస్తీనాను గుర్తించేందుకు ముందుకు వస్తున్న పశ్చిమ దేశాల జాబితాలో ఇప్పుడు కెనడా కూడా చేరింది. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని నిరసిస్తున్న పలు దేశాలు పాలస్తీనాను గుర్తిస్తామంటూ ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కెనడా ప్రధాని మార్క్ కర్నే కూడా అలాంటి ప్రకటనే చేశారు. సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి 80వ సర్వసభ్య సమావేశం సందర్భంగా పాలస్తీనాను గుర్తించాలని అనుకుంటున్నామని ఆయన చెప్పారు. బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు ఇప్పటికే పాలస్తీనాను గుర్తించేందుకు సంసిద్ధత తెలిపాయి.

పాలస్తీనాను వివిధ దేశాలు గుర్తించినప్పటికీ గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న యుద్ధంపై దాని ప్రభావం ఏ మేరకు ఉంటుందో స్పష్టంగా తెలియడం లేదు. సంస్కరణలు చేపడతామని పాలస్తీనా అథారిటీ, అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ హామీ ఇవ్వడంతో తాము ఈ నిర్ణయానికి వచ్చామని కర్నే తెలిపారు. వచ్చే సంవత్సరం సార్వత్రిక ఎన్నికలు జరిపేందుకు కూడా వారు అంగీకరించారని అన్నారు. పాలస్తీనా భవిష్యత్తులో హమాస్‌కు ఎలాంటి పాత్ర ఉండకూడదని, ఎన్నికలలో కూడా అది పాల్గొనకూడదని కర్నే స్పష్టం చేశారు. హింస లేదా ఉగ్రవాదానికి తావులేకుండా శాంతిని కోరుకుంటున్న ప్రజల పక్షాల నిలిచేందుకు రెండు దేశాలు చర్చలు జరిపి పరిష్కారం సాధించాలని ఆయన సూచించారు.

పాలస్తీనాను గుర్తించాలన్న ప్రతిపాదనకు అమెరికా ససేమిరా అంటోంది. ఇది హమాస్‌కు మేలు చేస్తుందని హెచ్చరిస్తోంది. పాలస్తీనాను గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ చెప్పినప్పుడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దానిని తోసిపుచ్చారు. పాలస్తీనాను గుర్తిస్తామని బ్రిటన్ చెప్పినప్పుడు కూడా ఆయన సానుకూలత వ్యక్తం చేయలేదు.

తమిళనాడు బిజెపి ఉపాధ్యక్షులుగా ఖుష్బు

చెన్నయ్ : బిజెపి తమిళనాడు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రముఖ సినీ నటి ఖుష్బు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నయినార్ నాగేంద్రన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఖుష్బుతో పాటు ఉపాధ్యక్షులుగా నిమితులైన 14 మంది జాబితాను విడుదల చేశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అనుమతితో రాష్ట్ర విభాగానికి నూతన నిర్వాహకులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

'ధర్మస్థల మిస్టరీ'లో కీలక ముందడుగు

- అవశేషాల గుర్తింపు



బెంగళూరు : కర్ణాటకలో ప్రముఖ పర్యాటక క్షేత్రమైన 'ధర్మస్థల'లో అనుమానస్పద మరణాలపై మిస్టరీ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన ప్రదేశాల్లో తవ్వకాలు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో ఓ చోట గురువారం కొన్ని అవశేషాలను గుర్తించారు. ఇప్పటివరకు ఈ కేసులో బయటపడిన తొలి ఆధారం ఇదే కావడం గమనార్హం. పారిశుద్ధ్య కార్మికుడి ఫిర్యాదు నేపథ్యంలో ఈ అనుమానాస్పద మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గత సోమవారం నుంచి సిట్ అధికారులు.. అతడిని వెంట తీసుకెళ్లి దర్యాప్తు చేపట్టారు. నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలి వైపు ఉన్న ప్రాంతం నుంచి పరిశోధన ప్రారంభించారు. మతదేహాలను పూడ్చిపెట్టినట్లుగా మొత్తం 13 చోట్లను అతడు గుర్తించగా.. ఆ ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఆరో ప్రాంతంలో మానవ అవశేషాలు బయటపడ్డాయి. వాటిని ఫోరెన్సిక్ బందం సేకరించి ల్యాబ్‌కు పంపించింది. ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాతే వాటి గురించి వివరాలు తెలుస్తాయని సిట్ అధికారులు చెబుతున్నారు.

ఏమిటీ మిస్టరీ..

దక్షిణ కన్నడ జిల్లాలో ఉన్న ధర్మస్థల ప్రాంతం ప్రముఖ శైవ క్షేత్రంగా పేరుగాంచిన సంగతి తెలిసిందే. కర్ణాటక ప్రజలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచీ కూడా ఇక్కడికి భారీగా వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. గత జులై 3న సంచలన ఆరోపణలు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అదశ్యమైన వారివని, లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు అనుమానాలున్నట్లు పేర్కొనడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండడంతో తాము అజ్ఞాతంలోకి వెళ్లిపోయామని ఆ వ్యక్తి చెప్పినట్లు సమాచారం. మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు? వాటిని ఎవరి సహాయంతో తీసుకువెళ్లేవారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు అడిగి అతడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

అందరినీ వదిలేశారు!

(మొదటి పేజీ తరువాయి)

ఎకె లాహోటి, నిందితులందరూ జులై 31న కోర్టుకు హాజరుకావాలని మే 8న ఆదేశించారు. విచారణ సందర్భంగా, ప్రభుత్వ ప్రాసిక్యూటర్లు 323 మంది సాక్షులను విచారించారు. వారిలో 37 మంది వాంగ్మూలాలు ఇచ్చారు. 'ప్రాసిక్యూషన్ తగిన తగిన ఆధారాలు చూపలేకపోయింది. కేవలం అనుమానాలు, సందేహాలతో దేన్ని నిజమని చెప్పలేం. రుజువుల సమగ్రతను గమనిస్తే, నిందితులకు శిక్షవేసేందుకు తగిన బలమైన సాక్ష్యాధారాలు లేవు. ఇదో తీవ్రమైన నేరం. కానీ నిర్ణయాత్మకమైన ఆధారాలు కోర్టుకు సమర్పించలేదు. అందుకే నిందితులందరినీ బెనిఫిట్ ఆఫ్ ది డౌట్ కింద నిర్దోషులుగా ప్రకటిస్తున్నాం' అని న్యాయమూర్తి పేర్కొన్నారు.

అసలేం జరిగింది?

మహారాష్ట్రలోని మాలేగావ్‌లోని భీకు చౌక్, అంజుమన్ చౌక్ వద్ద 2008, సెప్టెంబర్ 29న బాంబులు పేలాయి. ఈ పేలుళ్లలో ఆరుగురు మరణించగా, 101 మంది గాయపడ్డారు. రంజాన్ మాసంలో జరిగిన ఈ పేలుళ్లపై మొదట ఉగ్రవాద నిరోధక సంస్థ (ఎటిఎస్) విచారణ చేపట్టింది. 2009 జనవరి 20న ఎటిఎస్ అరెస్ట్ చేసిన 11 మంది, పరారీలో ఉన్న మరో ముగ్గురిపై మొదటి చార్జిషీటు దాఖలు చేసింది. నిందితులు తమపై ఎంసిఒసిఎ చట్టం కింద కేసు నమోదు చేయడంపై హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్, బిజెపి నేత ప్రజ్ఞా ఠాకూర్, మేజర్ రమేష్ ఉపాధ్యాయ్ (రిటైర్డ్), అజయ్ రాహిర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణిలపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా), భారత శిక్షాస్మృతి (ఐపిసి) కింద అభియోగాలు నమోదయ్యాయి. ఇప్పుడు వీరందరినీ నిర్దోషులుగా ప్రకటించారు. గతంలో ఈ కేసును మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం (ఎటిఎస్) దర్యాప్తు చేసింది. కానీ 2011లో, ఈ కేసు దర్యాప్తు బాధ్యతను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కి అప్పగించారు. ఎన్ఐఎ 2016లో దాఖలు చేసిన ఛార్జిషీటులో ఎంసిఒసిఎ కింద నమోదు చేసిన అభియోగాలను తొలగించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌ను మెల్లగా కొనసాగించాలంటూ ఎన్ఐఏ తనపై ఒత్తిడి తెచ్చిందంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రోహిణి సాలియా 2015లో రాజీనామా చేశారు. అయితే 2016లో ఎన్ఐఏ చార్జిషీట్ దాఖలు చేసింది. ప్రజ్ఞా ఠాకూర్, శ్యామ్ సాహు, ప్రవీణ్ తకల్కి, శివనారాయణ్ కల్సంగ్రాలకు క్లీన్ చిట్ ఇస్తూ, వారికి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లభించలేదని, ఈ కేసులో వారిని నిర్దోషులుగా విడుదల చేయాలని పేర్కొంది. సాహు, కల్సంగ్రా, తకల్కిలను నిర్దోషులుగా తేల్చిన ఎన్ఐఏ కోర్టు, ప్రజ్ఞా ఠాకూర్ విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని తీర్పునిచ్చింది. ఇప్పుడు బలమైన సాక్ష్యాధారాలు లేవంటూ నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది.

న్యాయాన్ని అపహాస్యం చేయడమే!

- ఎన్ఐఎ కోర్టు తీర్పుపై సిపిఎం

న్యూఢిల్లీ : మాలెగావ్ పేలుళ్ళ కేసులో వచ్చిన తీర్పు పట్ల సిపిఎం తీవ్ర నిరాశను , అసంతృప్తిని వ్యక్తం చేసింది. సంఘటన జరిగిన 17 ఏళ్ళ తర్వాత వచ్చిన ఈ తీర్పులో, సాక్ష్యాధారాలు లేవంటూ నిందితులందరినీ నిర్దోషులుగా విడిచిపెట్టారని సిపిఎం పొలిట్‌బ్యూరో విమర్శించింది. మాలెగావ్ పేలుళ్లలో ఆరుగురు అమాయకులు మరణించగా, దాదాపు వందమంది గాయపడ్డారు. ఇది న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. సాక్ష్యాధారాలు లేవంటూ, విధానపరమైన లోపాలు వున్నాయన్న సాకుతో మాజీ బిజెపి ఎంపి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, నాటి ఆర్మీ ఆఫీసర్‌గా చేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్, ఇతరులను నిర్దోషులుగా విడిచిపెట్టారు.ముఖ్యంగా ముస్లిం కమ్యూనిటీలో ఒక గ్రూపు ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తూ కుట్రదారులు నేరానికి పాల్పడ్డారని, ముఖ్యమైన సేవలకు అంతరాయం కలిగించారని, మత పరమైన ఉద్రిక్తతలు సృష్టించారని, దేశ అంతర్గత భద్రతకు ముప్పుగా పరిణమించారని పేర్కొంటూ వారికి తగిన శిక్ష వేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కోరింది. తీవ్రవాద హిందూత్వ గ్రూపు పాల్పడిన ఉగ్రదాడిలో బాధితులకు న్యాయం జరగడంలో అసాధారణమైన జాప్యానికి, చివరకు న్యాయం నిరాకరించడానికి ఇది మరొక ఉదాహరణగా నిలిచిందని ఆందోళన వ్యక్తం చేసింది. నిందితులకు ఆర్ఎస్ఎస్-బిజెపి అన్ని రకాలుగా మద్దతునిచ్చి, ఆదరించాయని గుర్తు చేసింది. ప్రజ్ఞా సింగ్‌ను బిజెపి తమ ఎంపీ అభ్యర్థిగా పోటీకి నిలబెట్టింది. ఆమె ఎంపీగా ఎన్నికయ్యారని పేర్కొంది. దేశంలో ఏ హిందువూ ఉగ్రవాది కాదంటూ పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేసిన మరుసటి రోజే ఇలాంటి తీర్పు వెలువడటం పట్ల సిపిఎం విస్మయం వ్యక్తం చేసింది. ఈ నేరం తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, ఎన్ఐఎ కోర్టు నిర్ణయాన్ని అప్పీల్ చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేసింది.

నోరు మెదపరేం?

(మొదట పేజీ తరువాయి)

ప్రారంభం కాగా సభలో ప్యానల్ డిప్యూటీ ఛైర్మన్‌గా సస్మిత్ పాత్ర వ్యవహరించారు. సభలో ప్రతిపక్షాల ఆందోళన సభ ఆరు నిమిషాల్లోనే సాయంత్రం 4.30 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ నిర్వహించారు. అమెరికా విధించిన సుంకాలపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ ప్రకటన చేశారు. అనంతరం సభ శుక్రవారానికి వాయిదా పడింది.

సుంకాలపై గోయల్ స్పందన ఇలా..

కేంద్ర మంత్రి పియూష్ గోయల్ మాట్లాడుతూ ఇండియాపై సుంకాలను పెంచుతూ అమెరికా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీనిపై ఇరుదేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని, దేశ ప్రయోజనాలు పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అమెరికా నుండి దిగుమతులపై 10-15 శాతం సుంకాల గురించి చర్చ జరిగిందన్నారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశారని, ఇరుపక్షాల మధ్య నాలుగు రౌండ్ల చర్చలు జరిగాయని తెలిపారు. వర్చువల్‌గానూ సమావేశాలు జరిగాయన్నారు. ఏప్రిల్ 5 నుండి 10 శాతం బేస్‌లైన్ సుంకాలు అమల్జేస్తున్నారని, కానీ ఇప్పుడు మొత్తం 26 శాతం సుంకాలు అమల్జేయనున్నట్లు ప్రకటించారని తెలిపారు. దీని తరువాత, ఏప్రిల్ 9 నుండి దేశ నిర్దిష్ట అదనపు సుంకాలను అమలు చేయాల్సి ఉందని, కానీ ఏప్రిల్ 10న అమెరికా మొదట దానిని 90 రోజులు వాయిదా వేసిందని, ఆపై దానిని 2025 ఆగస్టు 1 వరకు పొడిగించిందని తెలిపారు. బలహీనమైన ఆర్థిక వ్యవస్థ నుంచి భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని గోయల్ చెప్పుకొచ్చారు.

మోడీ బదులివ్వరేం? : రాహుల్ గాంధీ

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'ట్రంప్ 30-32 సార్లు కాల్పుల విరమణపై ప్రకటన చేశారని, ఐదు భారతీయ జెట్ విమానాలు కూలిపోయాయని వ్యాఖ్యానించారు. తాజాగా సుంకాలు విధిస్తామని చెబుతున్నారు. అయినా ప్రధాని మోడీ ఎందుకు బదులివ్వలేకపో తున్నారు? కారణాలేంటి? ఆయనపై ఎవరి నియంత్రణ ఉంది?' అని రాహుల్ నిలదీశారు. 'పూర్తిగా గందరగోళ పరిస్థితి నెలకొంది. మోడీ తన ప్రసంగంలో ట్రంప్ పేరును ప్రస్తావించేందుకు కూడా సాహసించలేకపోతున్నారు. ఈ దుస్థితి ఏంటి?' అని ఆయన ప్రశ్నించారు. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాకిస్తాన్ సైనిక అధిపతితో భోజనం చేస్తున్నారని, మరోవైపు ప్రధాని మోడీ తాము గొప్ప విజయం సాధించామని చెబుతున్నారంటూ ఎద్దేవా చేశారు. భారత్‌లో మృత ఆర్థిక వ్యవస్థ నెలకొందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు నిజమేనని, ఈ విషయం ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసని రాహుల్ విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తోందన్న సంగతి ప్రపంచమంతా తెలుసు కానీ, బిజెపి నేతలు మాత్రం ఎంత సేపూ అదానీకి సహాయం చేయడంలోనూ తలమునకలై ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తున్నారని విమర్శించారు.

11 ఏళ్ల మిత్రలాభం ఇదేనా! : అఖిలేష్ యాదవ్

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ గత 11 ఏళ్లగా అమెరికా అధ్యక్షులు ట్రంప్‌తో మోడీ సర్కార్ స్నేహాన్ని కొనసాగిస్తోందని, ఇప్పుడు ఆ మిత్రలాభం ఏమిటో 'సుంకాల బాదుడు..ఆంక్షల మోత' రూపంలో చూడాల్సివస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ 'సుంకాలపై ట్రంప్ ఏమి చెప్పారో అందరూ చూశారు. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని నిరోధించానని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఈ రెండు అంశాలపైనా భారత్ స్పందించాల్సివుంది. కానీ ప్రధాని మోడీ నోరు మెదపరు. ఆయన ప్రపంచంలోని మూలమూలకూ వెళ్తారు. స్నేహితులను ఏర్పరుచుకుంటారు. ఆ స్నేహాల ఫలితం ఇదిగో ఇలా సుంకాలు, ఆంక్షల రూపంలో దేశ ప్రజలు అనుభవించాల్సివస్తోంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ సర్కారుకు కాళేశ్వరం కమిషన్ నివేదిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది. హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో 650 పేజీలతో కూడిన తుది నివేదిక రెండు సీల్డ్ కవర్లల్లో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు చైర్మన్ పిసి ఘోష్ గురువారం అందజేశారు. ఆయన ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె రామకృష్ణారావుకు ఇవ్వడంతో ఈ నివేదికను సిఎస్ కార్యాలయంలోని లాకర్‌లో భద్రపరిచినట్టు తెలిసింది. పిసి ఘోష్ నివేదికకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన తర్వాత పలువురు అధికారులు, గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన పెద్దలపై చట్ట పరమైన చర్యలుంటాయని తెలిసింది.

ఇదిలావుండగా గత బిఆర్ఎస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల్లో భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ కోసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం, మిగతా బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు తలెత్తడంపై విజిలెన్స్ విచారణతోపాటు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ)తో అధ్యయనం చేయించింది. లోపాలు తీవ్రంగా ఉన్నట్టు విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అసెంబ్లీలో చర్చ సందర్భంగా న్యాయ విచారణ చేయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వెంటనే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జి అయిన పిసి ఘోష్‌ను నియమిచింది. 2019 నుంచి 2022 వరకు భారతదేశ మొదటి లోక్‌పాల్‌గా పనిచేసిన విషయం విదితమే. గత 2024, మార్చి 14న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి పిసి ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ దాదాపు 15 నెలలపాటు 115 మందిని విచారించింది. ఈ బ్యారేజీలకు సంబంధించిన డిపిఆర్, డిజైన్లను పరిశీలించిన కమిషన్, విజిలెన్స్ రిపోర్ట్ ఆధారంగా నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులను విచారణ చేసింది. ఇందులో భాగంగా నాటి ముఖ్యమంత్రి కెసిఆర్, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కూడా కమిషన్ క్రాస్ ఎగ్జామిన్ చేసింది. అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు ఇలా మొత్తం 115 మందిని విచారించి వారి స్టేట్‌మెంట్లను కమిషన్ రికార్డు చేసింది. అఫిడవిట్లు, వాంగ్మూలాలను విశ్లేషించి తుది నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి కమిషన్ సమర్పించింది. కాళేశ్వరం నివేదిక ప్రభుత్వానికి చేరడంతో అందులో ఏముందనే విషయమై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది. ఈ నివేదిక నేపథ్యంలో రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు చోటుచేసుకునే అవకాశాలు లేకపోలేదని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

జగన్ పర్యటనలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. జగన్ వచ్చే వరకూ అక్కడే ధర్నా చేశారు. ఆయన రాగానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

గురువారం ఉదయం పది గంటలకు కొత్తూరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు జగన్‌మోహన్‌రెడ్డి చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద జగన్‌ను కలిసేందుకు అతికొద్ది మందికి మాత్రమే పోలీసులు అనుమతించారు. అక్కడి నుంచి నెల్లూరు సెంటర్ జైలుకు చేరుకున్నారు. రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో 30 నిమిషాల పాటు జగన్ ములాఖత్ అయ్యారు. అనంతరం అక్కడి నుంచి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటికి వెళ్తున్న దారిలో బుజబుజ నెల్లూరు వద్దకు రాగానే జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలొచ్చిన వైసిపి నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్డు మీదకొచ్చారు. భారీ జనసందోహం నడుమే సుజాతమ్మ కాలనీలోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి జగన్ వెళ్లారు. కుటుంబ సభ్యులతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ..... రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని, వైసిపి నేతలను అకారణంగా జైలుకు పంపుతున్నారని విమర్శించారు. తాము మూడేళ్ల తరువాత అధికారంలోకి వస్తామని, అప్పుడు ఇంత కంటే ఎక్కువ చూస్తారని హెచ్చరించారు. ఈ రోజు మీరు ఏం చేస్తే, రేపు అంతకంటే తాము ఎక్కువ చేస్తామన్నారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. ప్రసన్నకుమార్ ఇంటిలోకి మారుణాయుధాలతో ప్రవేశించి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారని..ఇలాంటి దిగజారుడు రాజకీయాలు ఎప్పుడూ చూడలేదన్నారు. జగన్ వెంట మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మాజీ మంత్రులు కారుమూరు నాగేశ్వరరావు, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పి. చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళి, నాయకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, ఆనం అరుణమ్మ తదితరులున్నారు.

జీవన సౌరభం


ఉన్నతంగా ఆలోచించడం అలవాటు చేసుకున్నప్పుడే మనకు మనమే మార్గదర్శకులుగా మారుతాం.

మీ కోసం

పగిలిన గుడ్డును కొద్దిగా వెనిగర్ కలిపిన నీటితో ఉడికిస్తే లోపలి ద్రవం బయటికి రాకుండా ఉంటుంది.



అమాయకపు దొంగ



ఒక ఊరిలో ఒక దొంగ ఉన్నాడు. వాడు ఒట్టి అమాయకుడు. దొంగతనం చేసి వెంటనే దొరికిపోయేవాడు. అయినా దొంగతనాలు చేయడం మానలేదు. ఆ దొంగ స్నేహితుడు 'అరేయ్ ఎందుకురా.. నువ్వు దొంగతనాలు చేస్తావు? ఊరి వాళ్ళతో దెబ్బలు తింటావు' అని ఎన్నిసార్లు చెప్పినా వినేవాడు కాదు.

ఒకరోజు ఆ ఊరికి కళాకారులు బాగోతం వేయడానికి వచ్చారు. ఆ ఊరి ప్రజలంతా బాగోతం చూడడానికి వెళ్లారు. అప్పటికే అర్ధరాత్రి దాటింది. ఆ దొంగ 'ఇదే మంచి సమయం' అనుకున్నాడు. తన ఇంట్లోకి వెళ్లి నల్లని దుస్తులు ధరించాడు. ముఖానికి మాస్కు కూడా పెట్టుకున్నాడు. మెడలో ఒక టార్చ్ లైట్ తగిలించుకున్నాడు. ఊరంతా నిశ్శబ్దంగా ఉంది. బడి దగ్గర ప్రదర్శిస్తున్న బాగోతాన్ని ప్రజలంతా శ్రద్ధగా వింటున్నారు. అప్పుడే దొంగ మెల్లగా ఊరి చివరన ఉన్న రంగయ్య ఇంటి దగ్గరికి వెళ్ళాడు. అటు ఇటు చూశాడు. ఇంటిముందు లైటు ఆర్పివేసి ఉంది. ఇంట్లో లైటు మాత్రం వెలుగుతూ ఉంది.

'ఎవరబ్బా! ఇంట్లో ఉన్నది' అని మనసులో అనుకున్నాడు. రంగయ్య మామను బడి దగ్గర చూశాను. అత్త కూడా అక్కడే ఉంది. ఓ వాళ్ల పిల్ల ఒక్కతే ఇంట్లో ఉందేమో! ఆ పిల్ల నన్నేం చేస్తుందిలే' అని మెల్లగా గోడదూకి లోపలికి వెళ్ళాడు. ఆ విషయం గ్రహించిన చిన్నారి ధైర్యం తెచ్చుకుంది. దొంగ లోపలికి వచ్చాడు. 'అరిచావంటే దెబ్బలు పడతాయి. నిశ్శబ్దంగా ఉండు. నగలన్నీ ఎక్కడున్నాయో చెప్పు' అని బెదిరించాడు దొంగ.

నగలన్నింటిని చూపించింది చిన్నారి. వాటిని మూటగట్టుకుని భుజాన వేసుకున్నాడు. గోడ దగ్గరికి వెళ్లి గోడ దూకుతుండగా, "ఓ దొంగా.. అటు వెళ్ళకు. అక్కడ మనుషులు తిరుగుతారు. కుక్కలు కూడా ఉన్నాయి. ఈ వెనుక తలుపు నుండి వెళ్ళు. నీకు ఏ ఇబ్బంది ఉండదు' అని ఆ పిల్ల చెప్పింది. 'ఈ పిల్ల ఒట్టి అమాయకపు పిల్లలా ఉంది. నాకు నగలన్నీ ఇవ్వడమే కాకుండా, దారి కూడా చూపిస్తుంది' అని లోలోపల నవ్వుకున్నాడు అమాయకపు దొంగ.

చిన్నారి తలుపు తీసింది. దొంగ అడుగు బయటకు వేశాడు. అంతే! ధబీమని పెద్ద గుంటలో పడిపోయాడు. అది చాలా లోతైన గుంట. అప్పుడు ఆ పిల్ల పరుగు పరుగున వెళ్లి అమ్మానాన్నలను తీసుకొని వచ్చింది. ఊరి ప్రజలంతా అక్కడికి చేరుకున్నారు. నిచ్చెన సాయంతో దొంగని బయటకు తీసి దేహశుద్ధి చేశారు. ఇక ఆరోజు నుండి ఆ దొంగ ఎప్పుడూ దొంగతనాలు చేయలేదు. కష్టించి పనిచేయడం అలవాటు చేసుకున్నాడు.



- మహమ్మద్ మాహీన్
మెహరోజ్,
7వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్, కోదాడ,
సూర్యాపేట జిల్లా.

నేను గీసిన బొమ్మ



- దాసరి తేజ
3వ తరగతి,
అభ్యాస విద్యాలయం,
విజయవాడ.





- ఎల్.సాయి
9వ తరగతి,
ఎస్‌డిఎంవైఆర్ఆర్ హైస్కూలు,
విజయవాడ.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లల స్కూల్లోనే అమ్మలకూ పాఠాలు..

ఒక్కోసారి చిన్న చిన్న ప్రయత్నాలే గొప్ప స్ఫూర్తిని ఇస్తాయి. కేరళ పాలక్కడ్‌లోని ఓ బధిర ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం ఆ బడి పిల్లలనే కాక, వారి తల్లులకు కూడా గొప్ప ప్రోత్సాహంగా నిలిచింది.

ఒట్టపాలెం బధిర ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో వివిధ తరగతులకు చెందిన 50 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ ఏడాది ఈ పిల్లలు ధరించిన యూనిఫామ్స్ వాళ్ల తల్లులే కుట్టేలా పాఠశాల యాజమాన్యం వీలు కల్పించింది. 'ధనిమా ప్రొడక్షన్ సెంటర్' పేరుతో స్కూల్లో చిన్న టైలరింగ్ యూనిట్‌ని నెలకొల్పారు. దీనిద్వారా విద్యార్థులతో పాటు వారి తల్లులు కూడా సాధికారత సాధించేలా చేశారు. ఈ అంశంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మినికుమారి ఇలా చెప్పారు.

'మా స్కూలు విద్యార్థులు వారికున్న ప్రత్యేక అవసరాల దృష్ట్యా ఎకడమిక్ అంశాలపై, భాషలపై, జీవన నైపుణ్యాలపై పట్టు సాధించేందుకు ఎక్కువ సమయం తీసుకుంటారు. అయినా సరే ఇప్పటివరకు ఇక్కడ విద్యనభ్యసించి వెళ్లిన వారిలో చాలామంది ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉపాధి పొందారు. అయితే ఈ ఏడాది మేము ఇంకా అదనపు ప్రయోజనాలు ఈ పిల్లలకి కల్పించాలని అనుకున్నాం. అందులో భాగంగానే టైలరింగ్ యూనిట్ స్థాపించాం. ఆ తరువాత ఇందులో విద్యార్థుల తల్లులను కూడా భాగస్వామ్యం చెయ్యాలని ఆశించాం. ఇప్పుడు మా లక్ష్యం నెరవేరింది. తల్లులు, పిల్లలు ఒకేచోట జీవితనైపుణ్యాలను నేర్చుకుంటున్నారు' అని మినికుమారి నవ్వుతూ చెప్పారు.



టైలరింగ్ యూనిట్ నిర్వాహకురాలు సుజితా మాట్లాడుతూ, 'ఇక్కడ దుస్తులు కుట్టడం నేర్చుకున్న విద్యార్థినుల తల్లులతోనే వారి పిల్లలకు యూనిఫామ్‌లు కుట్టించడం మా ప్రయత్నంలో సాధించిన మొదటి విజయం. ఇప్పుడు ఈ కుట్టు మిషన్ కేంద్రంలో ఆరుగురు తల్లులు పూర్తికాలం పనిచేస్తున్నారు. వీరిలో మొదటిసారి సూది, దారం పట్టుకున్న వారు కూడా ఉన్నారు. అరకొరా పనులు చేసి ఇళ్ల దగ్గర సంపాదించే సొమ్ము కన్నా ఇక్కడ దుస్తులు కుట్టడం వల్ల ఎక్కువ సంపాదించేలా కూడా మేం చర్యలు తీసుకున్నాం' అని ఆమె చెప్పారు.

శిక్షణా కేంద్రంలో పనిచేస్తున్న సలీనా తన అనుభవాలను ఇలా చెప్పారు. 'ఇక్కడ మాకు యూనిఫామ్‌లతో పాటు, క్లాత్ బ్యాగ్‌లు, పర్సులు, పేపర్ ఫైల్స్, హ్యాండీక్రాఫ్ట్స్, ఫ్యాన్సీ ఐటమ్స్ వంటి వాటి తయారీలో కూడా శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు కూడా మాకు చేదోడుగా నిలుస్తాయని ఆశిస్తున్నాం' అంటున్న సలీనా, 8వ తరగతి చదువుతున్న మహ్మద్ మున్నావర్ తల్లి. ప్రతిరోజూ ఇంటి నుండి 70 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మరీ ఆమె ఇక్కడికి చేరుకుంటుంది. కొడుకుతో కలిసి స్కూలుకు రావడం, వెళ్లడం ఇప్పుడు ఆమె దినచర్యగా మారిపోయింది.

ఈ ప్రత్యేక అవసరాలు గల స్కూలు నిర్వహణపై కేరళ రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ప్రత్యేక శ్రద్ధ ఎంత గొప్పగా ఉందో, ఆ బడిలో ఉన్న ఈ సౌకర్యాలే చెబుతాయి.


మున్వార్ లాంటి పిల్లల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు స్కూలు క్యాంపస్‌లో ఆడియాలజీ ల్యాబ్, స్పీచ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ఇంటరాక్టివ్ స్పీచ్ ప్యానెల్, కంప్యూటర్ ల్యాబ్, పిల్లల పార్కు, ఆటస్థలం, హాస్టల్ వంటి సౌకర్యాలన్నీ ఈ స్కూల్లో ఉన్నాయి. ఇంకా కూరగాయలు పండించే స్థలం కూడా ఉంది. కళలు, క్రీడలు, సైన్స్ సబ్జెక్టులు బోధించే అంకితభావం గల టీచర్లు ఉన్నారు. ప్రతి ఐదుగురు విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు.

ప్రత్యేక స్కూళ్లపై కేరళ రాష్ట్రం పెట్టిన ఈ శ్రద్ధ, ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా ఉంది. అలాగే ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో పాటు వారి తల్లుల పట్ల కూడా ఇంత ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ఈ స్కూలు నిర్వాహకులను కూడా ప్రశంసించకుండా ఉండలేం.

నల్లపొర ఉల్లి తినొచ్చా?

వంటకి అదనపు రుచిని ఇచ్చే ఉల్లిపాయని చాలామంది ఇష్టపడతారు. ఈమధ్య కాలంలో ఉల్లిపాయ పైపొరలపై నల్లటి, దుమ్ము లాంటి పొడి కనిపిస్తోంది. ఇలాంటి ఉల్లిపాయలని తినాలా? వద్దా? ఇది ఆరోగ్యానికి మంచిదా! కాదా! అనే విషయంపై చాలామందికి అనుమానాలు ఉంటాయి.

ఈ నల్లటి మచ్చలు తరచుగా ఆస్పెర్‌గిల్లస్ నైగర్ అని పిలువబడే సాధారణ నేల ద్వారా వ్యాపించే ఫంగస్ వల్ల వస్తాయి. ఉల్లిపాయలపై ఈ ఫంగస్ కనిపించడం అసాధారణం కాదు, ముఖ్యంగా గాలి ప్రసరణ తక్కువగా ఉన్న తేమతో కూడిన వాతావరణంలో నిల్వ చేయబడిన వాటిపై ఇది తరచూ కనిపిస్తుంది.



నల్లటి పొడికి కారణమేమిటి?

ఆస్పెర్‌గిల్లస్ నైగర్ వెచ్చని, తేమతో కూడిన పరిస్థితులలో వృద్ధి చెందుతుంది. ఉల్లిపాయలను తడిగా లేదా తక్కువ వెంటిలేషన్ ఉన్న ప్రదేశాలలో, అంటే బస్తాలు లేదా మూసివేసిన కంటైనర్లలో నిల్వ చేసినప్పుడు, ఫంగస్ బయటి పొరలపై పెరగడం ప్రారంభిస్తుంది. క్రమంగా నల్లటి పొడి అవశేషాలను ఏర్పడతాయి. ఫలితంగా ఉల్లిపాయ బయటి చర్మం దెబ్బతింటుంది.

తినడం సురక్షితమేనా?

ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఇలాంటి ఉల్లిపాయలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఎలాంటి ప్రమాదం లేదు. అయితే వంట చేయడానికి ముందు వాటిని బాగా కడిగి తొక్క తీసివేయాలి. పైపొరపై పాతుకుపోయిన ఆస్పెర్‌గిల్లస్ నైగర్ చిన్న చిన్న జాడలు కూడా లేకుండా జాగ్రత్తపడాలి. ఒకవేళ స్వల్పంగా ఉన్నా ఆరోగ్యవంతులకు హాని కలిగించే అవకాశం లేదని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ఎవరు తినకూడదు?

బలహీనమైన రోగనిరోధక వ్యవస్థలు, ఉబ్బసం లేదా ఇతర శ్వాసకోశ పరిస్థితులు ఉన్నవారు మాత్రం వీటికి దూరంగా ఉండాలి. లేకపోతే అలెర్జీలు, శ్వాసకోశ సమస్యలు పెరుగుతాయి.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- నల్ల పొడి పైపొరపై అనిపించినా, ఉల్లిపాయ లోపలి పొరలను కూడా జాగ్రత్తగా పరిశీలించాలి.
- లోపలి పొరలు బూజు, తెగులు లేదా బూజుపట్టిన వాసన కలిగివుంటే వాటిని పారవేయడం ఉత్తమం.
- ఉల్లిపాయ మృదువుగా, తడిగా లేదా జిగటగా అనిపించినా, దానిని తినడం సురక్షితం కాదు.
- లోపల పూర్తిగా ఎండిపోయి, పైపొరపై కొద్దిగా నల్ల పొడి మాత్రమే ఉన్న ఉల్లిపాయలను మాత్రం తొక్క తీసి కడిగిన తర్వాత ఉపయోగించుకోవొచ్చు.



కష్టాల్లో భారత్

- తొలిరోజు ఆట ముగిసేసరికి 204/6 • ఇంగ్లండ్‌తో ఐదో టెస్టు

ఓవల్: ఇంగ్లండ్‌తో ఐదో, చివరి టెస్ట్‌లో తొలి రోజు ఆటలో భారత్ కష్టాల్లో నిలిచింది. మొదటి రోజు ఆట ముగిసేసరికి ఆరు వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే ఈ టెస్టులో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌కు పలుమార్లు వర్షం అంతరాయం కలిగించింది. దీంతో గురువారం 64 ఓవర్ల పాటు మాత్రమే ఆట సాధ్యమయింది. 22ఓవర్ల తర్వాత తొలిసారి వర్షం కారణంగా మ్యాచ్ నిలువగా.. ఆ సమయానికి భారతజట్టు 2వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. ఆ తర్వాత లంచ్ బ్రేక్ ప్రకటించగా.. దాదాపు 2గంటల తర్వాత మళ్లీ మ్యాచ్ ప్రారంభమైంది. కానీ కెప్టెన్ గిల్(21) రనౌట్ కావడంతో భారత జట్టుకు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. రెండోసారి మళ్లీ వర్షం కారణంగా మ్యాచ్ నిలవడంతో ఆ సమయానికి భారతజట్టు 29 ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 85 పరుగులు చేసింది. తరువాత ఆట ప్రారంభమైనా సాయి సుదర్శన్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ వికెట్లు కోల్పోయింది. ఆట ముగిసేసరికి కరుణ్ నాయర్ (52), వాషింగ్టన్ సుందర్ (19) అజేయంగా నిలిచారు.

భారతజట్టు విదేశీ టెస్ట్ సిరీస్‌లలో చేసిన అత్యధిక పరుగులు...

- 3393 : ఇంగ్లండ్ టూర్, 2025
- 3270 : వెస్టిండీస్ టూర్, 1978-79
- 3230 : ఇంగ్లండ్ టూర్, 2016-17
- 3140 : ఇంగ్లండ్ టూర్, 2024
- 3119 : ఇంగ్లండ్ టూర్, 1963-64

శుభ్‌మన్ గిల్ రికార్డు

గురువారం ఆటలో మరొకొత్త రికార్డును భారత్ కెప్టెన్ శుభమన్ గిల్ తన పేర లిఖించుకున్నాడు. ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్‌గా నిలిచాడు. సునీల్ గవాస్కర్ 1978లో 732 పరుగులతో చేసిన రికార్డును తిరగరాశాడు.


ఈ సిరీస్‌లో గిల్ ఇప్పటి వరకూ 737 పరుగులు చేశాడు. జట్టు స్కోర్ 83 పరుగుల వద్ద ఈ రికార్డును శుభ్‌మన్ గిల్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక చివరి టెస్ట్‌కు బుమ్రా తప్పక బరిలోకి దిగుతాడని ఆశించిన అభిమానులకు నిరాశే మిగిలింది. ఈ టెస్ట్‌కు బుమ్రా దూరమైనట్లు జట్టు టాస్‌కు ముందు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. టెస్టుల్లో అరంగేట్రంపై ఆశలు పెట్టుకున్న అర్ష్‌దీప్ సింగ్‌కు మరోసారి నిరాశ తప్పలేదు. అతడి స్థానంలో ప్రసిధ్ కృష్ణ తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. వికెట్ కీపర్ కోటాలో పంత్ స్థానంలో ధృవ్ జురెల్ చోటు దక్కించుకోగా.. ఆరుగురు బ్యాటర్లు, ఇద్దరు ఆల్‌రౌండర్లు, ముగ్గురు పేసర్లతో భారతజట్టు చివరి టెస్ట్ బరిలోకి దిగింది.

వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తున్నా : సోనూసూద్



'500 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ వద్దాశ్రమం ఏర్పాటు చేయబోతున్నా. నా సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి రాష్ట్రంలో వృద్ధాశ్రమంతో పాటు ఉచిత పాఠశాలలు ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నా. ఆ దిశగా కృషిచేస్తున్నా. వృద్ధులు ఒంటరిగా ఉండకుండా, ప్రేమతో, గౌరవంతో జీవించాలి. ఈ ఆశ్రమాల్లో ఆరోగ్య సంరక్షణతో పాటు మంచి ఆహారం, మానసిక ప్రశాంతత కల్పించేలా ఏర్పాట్లు చేస్తాం.' అని బాలీవుడ్ నటుడు సోనూసూద్ అన్నారు. జులై 30న సోనూసూద్ తన 52వ పుట్టినరోజు జరుపుకున్నారు. విద్య, వైద్యం, ఇతర అవసరాల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వ్యక్తులకు ఆయన తరచూ సాయం చేస్తుంటారు. 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' పేరుతో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటి ఎన్నో మంచి పనులు ఆయన చేస్తుంటారు.

హృదయం నిండిపోయింది..




తను నటించిన 'కింగ్డమ్' చిత్రం సక్సెస్ అయినందుకు ఆనందంగా ఉందన్నారు విజయ్ దేవరకొండ. విజయంపై చాలా ఫీలవుతున్నానని, ఎలా చెప్పాలో అర్థం కావట్లేదన్నారు. ఆయన హీరోగా గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన 'కింగ్డమ్' సినిమా గురువారం విడుదలైంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో విజయ్, సత్యదేవ్, నిర్మాత నాగవంశీ పాల్గొన్నారు. విజయ్ మాట్లాడుతూ.. 'ఈ విజయంతో హృదయం నిండిపోయింది. మాటల్లో ఎలా చెప్పాలో అర్థం కావట్లేదు. 'అర్జున్‌రెడ్డి', 'గీత గోవిందం' సినిమాల విడుదలకు ముందు చిన్ననాటి స్నేహితులతో కలిసి సరదాగా గడిపేవాడిని. నిన్న రాత్రి కూడా వాళ్లు మా ఇంటికి వచ్చారు. చాలా విషయాలు మాట్లాడుకున్నాం. అదే సమయంలో యూఎస్‌లో 'కింగ్డమ్' ప్రీమియర్ మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎంతోమంది నాకు ఫోన్ చేసి ఎమోషనల్‌గా మాట్లాడారు. మీ అందరి ప్రేమ వల్లే ఇది సాధ్యమైంది. ఆగస్టులో యూఎస్ వెళ్లి, అక్కడ అభిమానులను కలుస్తా. టీమ్‌తో కలిసి త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌కూ వెళతా. ఫ్యాన్స్‌తో ఈ విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవాలని ఉంది. థియేటర్‌లో చూడాలంటే పర్మిషన్ కావాలని భయపెడుతున్నారు (నవ్వుతూ). మీతో కలిసి సినిమా చూడాలని ఉంది' అని అన్నారు.

ఏడేళ్ల తర్వాత

విశాఖలో కబడ్డీ పోటీలు

- పికెఎల్ షెడ్యూల్ విడుదల



ముంబయి: ప్రొ కబడ్డీ లీగ్ (సీజన్-12) షెడ్యూల్ విడుదలైంది. మ్యాచ్‌ల వివరాలు, వేదికలు, తేదీలను ఖరారు చేస్తూ పికెఎల్-12 షెడ్యూల్‌ను నిర్వాహకులు గురువారం విడుదల చేశారు. విశాఖ, జైపూర్, చెన్నై, ఢిల్లీ వేదికలుగా ఈసారి టోర్నమెంట్ జరగనుంది. మొత్తం 108 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆగస్టు 29న విశాఖపట్నంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో పికెఎల్-2025 తొలి మ్యాచ్ జరగనుంది. తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఈ ఏడాది ప్రొ కబడ్డీ లీగ్ ప్రారంభం కానుంది. అదే రోజు బెంగళూరు బుల్స్, పుణేరి పల్టన్స్‌ల మధ్య మరో మ్యాచ్ జరగనుంది. ఏడేళ్ల తర్వాత విశాఖపట్నంలో ప్రొ కబడ్డీ లీగ్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఆగస్టు 31న డిఫెండింగ్ ఛాంపియన్ హర్యానా స్టీలర్స్ జట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను బెంగాల్ వారియర్స్‌తో మ్యాచ్‌తో ప్రారంభించనుంది. మొత్తం 12 జట్ల మధ్య పికెఎల్ సీజన్-12 టోర్నీ జరగనుంది. అక్టోబర్ 23 తర్వాత నాకౌట మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల కానుంది.

వేదికలు, షెడ్యూల్..

విశాఖ : ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 11వరకు
జైపూర్ : సెప్టెంబర్ 12 - 28వరకు
చెన్నై : సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 12వరకు
ఢిల్లీ : అక్టోబర్ 13 - 23వరకు

జట్లు...

1. తెలుగు టైటాన్స్
2. పట్నా పైరెట్స్
3. జైపూర్ పింక్ ప్యాంథర్స్
4. యుపి యోధాస్
5. యు ముంబ
6. బెంగళూరు బుల్స్
7. గుజరాత్ జెయింట్స్
8. దబాంగ్ ఢిల్లీ
9. బెంగాల్ వారియర్స్
10. హర్యానా స్టీలర్స్
11. తమిళ్ తలైవాస్
12. పుణేరి పల్టన్స్

తరుణ్ సంచలనం

- ప్రి క్వార్టర్స్‌లో టాప్‌సీడ్‌కు ఝలక్



మకావు: మకావు సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో తరుణ్ మన్నేపల్లి సంచలనం నమోదు చేశాడు. గురువారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో ఏకంగా టాప్‌సీడ్, హాంకాంగ్‌కు చెందిన లీ-ఛౌక్-యును ఓడించాడు. మూడుసెట్ల హోరాహోరీ పోరులో తరుణ్ 19-21, 21-14, 22-20తో లీపై సంచలన విజయం సాధించాడు. ముఖ్యంగా మూడోగేమ్ హోరాహోరీగా సాగింది. చివర్లో వరుసగా రెండు పాయింట్లు సాధించిన తరుణ్ టాప్‌సీడ్‌కు చెక్ పెట్టాడు. ఇక 2వ సీడ్ లక్ష్యసేన్ కూడా మూడుసెట్ల హోరాహోరీ పోరులోనే ప్రి క్వార్టర్స్‌లో గెలిచాడు. ప్రి క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 21-14, 14-21, 21-17తో ఛికో అరా (మలేషి యా)పై విజయం సాధించాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట 10-21, 22-20, 21-16తో జపాన్‌కు చెందిన కుమాగి-నిషీపై విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రి క్వార్టర్స్‌లో 5వ సీడ్ ధృవ్ కపిల-తానీసా కాస్ట్రో జంట 21-19, 13-21, 18-21తో మలేషియాకు చెందిన వాంగ్-లియా చేతిలో పోరాడి ఓడాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68